: fb.com/vaartha Digital
WWW.VAARTHA.COM
epaper.vaartha.com
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
రాజమహేంద్రవరం
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam,Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
10-5-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 98 పేజీలు: 12 వెల: 6.50

## ఐపిఎల్ వారం వాయిదా



### ఉద్రిక్తతలు పెరగడంతో బిసిసిఐ నిర్ణయం

**న్యూఢిల్లీ, మే 9:** భారత్ పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇరు దేశాల మధ్య యుద్ధ మేఘాలు అలుముకోవడంతో ఐపిఎల్ 2025ను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు బిసిసిఐ అధికారికంగా ప్రకటించింది. దేశం తర్వాతే తమకు ఏదైనా అని ఈ సందర్భంగా బిసిసిఐ తేల్చి చెప్పింది. ప్రభుత్వం, భారత ఆర్మీ ఏ నిర్ణయం తీసుకున్నా తాము కట్టుబడి ఉంటామని బిసిసిఐ వెల్లడించింది. ఐపిఎల్ 2025ను వారం రోజుల పాటు అర్ధాంతరంగా వాయిదా వేస్తున్నట్లు బిసిసిఐ అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించిన మిగతా అప్‌డేట్స్‌ను త్వరలోనే వెల్లడిస్తామని >>2

# దద్దరిల్లిన ఎల్వోసీ



## సమర 'సిందూర'ం

వరుసగా రెండోరోజున కూడా పాక్ బరితెగించింది. అయితే 100పైగా డ్రోన్లను కూల్చివేసి భారత్‌సైనికులే తమసత్తా మరోసారి నిరూపించారు. కాశ్మీర్ సహా నాలుగు రాష్ట్రాలలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితుతు నెలకొన్నాయి.





## చీకటిపడగానే డ్రోన్లతో విజృంభించిన పాక్

- 20 కేంద్రాలను టార్గెట్ చేసిన దాయాది దేశం
- ఎక్కడికక్కడ డ్రోన్లను కూల్చివేసిన భారత్ సైన్యం
- సరిహద్దు రాష్ట్రాల్లో బ్లాకౌట్
- ప్రజలను అప్రమత్తం చేస్తూ సైరన్ల మోత
- తాను ఉన్న ప్రాంతంలో కూడా పేలుళ్ల శబ్దాలు వినిపించాయన్న సిఎం ఒమర్
- సరిహద్దుల్లో ప్రజలు బంకర్లలోకి వెళ్లాలన్న కేంద్రం
- తాజా పరిణామాలను ప్రధానికి వివరించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, త్రివిధ దళాధిపతులు

**న్యూఢిల్లీ, మే 9:** సరిహద్దుల్లో భీకర దాడులు కొనసాగుతున్నాయి. పాక్ క్షిపణి సామర్థ్యాలను వ్యూహాత్మక దాడులతో ధ్వంసంచేస్తుండటంతో దాయాది పాక్ భారత్‌పై కుట్రపూరిత దాడులతో పేట్రేగిపోతోంది. అయితే భారత్‌వద్ద ఉన్న అత్యాధునిక రక్షణ వ్యవస్థలతో అవన్నీ తేలిపోతున్నాయి. సుమారు 500కిపైగా డ్రోన్లతో సరిహద్దుల్లో దాడులుచేసిందని సాక్షాత్తూ రక్షణశాఖ అధికారులే వెల్లడించారు. 36 ప్రాంతాలను లక్ష్యంగాచేసుకుని ఈ డ్రోన్లను ప్రయోగిస్తే పాక్‌డ్రోన్లు అన్నింటినీ సమర్థవంతంగా భారత్ సేనలు తిప్పికొట్టాయి. శుక్రవారం రాత్రి చీకటిపడిన వెంటనే మళ్లీ దాడులు ప్రారంభించిన పాక్ దాడులను అక్కడికక్కడే తిప్పికొడుతోంది. రాజస్థాన్‌లోని జైసల్మేర్, పోఖ్రాన్ ప్రాంతాల్లోకి దూసుకువచ్చిన డ్రోన్లను భారత్‌సేనలుకూల్చివేసాయి. అలాగే జమ్ముకాశ్మీర్‌లోని కుప్వారా, పూంచ్,రాజౌరి,సాంబా సెక్టార్‌లలో డ్రోన్ల దాడులు ముమ్మరం చేయడంతో భారత్ >>2



ప్రధాని మోదీతో రాజ్‌నాథ్, త్రివిధ దళాధిపతుల భేటీ

### పాక్ కాల్పుల్లో తెలుగు జవాన్

## మురళీనాయక్ వీరమరణం

### బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి సవిత

### అండగా ఉంటామని సిఎం చంద్రబాబు భరోసా



మురళీ నాయక్(ఫైల్)

**గోరంట్ల, మే 9 ప్రభాతవార్త:** ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో గోరంట్ల మండలం కల్లితాండ గ్రామానికి చెందిన వీరజవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత విచారం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. గోరంట్ల మండల కేంద్రంలో మురళీ నాయక్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. పాకిస్తాన్ తో జరుగుతున్న యుద్ధంలో గోరంట్ల మండలం కల్లితాండ గ్రామానికి చెందిన వీర జవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందారు. విషయం తెలుసుకున్న వెంటనే కల్లితాండ గ్రామానికి వెళ్లి మురళీ నాయక్ తల్లి దండ్రులను మంత్రి శుక్రవారం పరామర్శించారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న మురళీ నాయక్ తల్లిదండ్రులు శ్రీరాములునాయక్, జ్యోతిభాయిని చూసి మంత్రి భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. తేరుకున్నాక మురళీనాయక్ తల్లిదండ్రులను ఓదార్చారు. ప్రభుత్వంతో పాటు దేశమంతా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. తమ ఏకైక బిడ్డయుద్ధంలో వీరమరణం చెందడంతో మురళీనాయక్ తల్లిదం >>2



శుక్రవారం అమరజవాన్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మంత్రి సవిత

## తిరుమల,తిరుపతిలో హై అలర్ట్

### రేణిగుంట విమానాశ్రయంలో విస్తృత తనిఖీలు

**తిరుమల,మే 9ప్రభాతవార్తప్రతినిధి:** భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచ ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుమలతో బాటు తిరుపతి నగరంలో భద్రతను మరింత హైఅలర్ట్‌చేశారు. తిరుమల ఆలయంతోబాటు ఇక్కడకు వస్తున్న యాత్రికుల భద్రత కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం తిరుమలలోని కమాండ్ కంట్రోల్‌రూమ్‌లో టిటిడి సివిఎస్ఓ వి. హర్షవర్ధన్‌రాజు, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, విజిలెన్స్ అధికారులు, ఆక్టోపస్ అధికారులు అత్యవసరంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుమల ఆలయంతో బాటు తిరుమల అంతటా పూర్తిస్థాయిలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, వస్తున్న ప్రతి యాత్రికునిపై మరింత నిఘాఉంచాలని ఆదేశించారు. ఆలయం పరిసరాల్లో అదనపు భద్రత బలగాలను మొహరింపజేశారు. శుక్రవారం సాయంత్రం ఆక్టోపస్ బలగాలు, తిరుమల పోలీసులు జిఎన్‌సి టోల్‌గేట్ ప్రాంతంలో కవాతు నిర్వహించారు. ఏదేని ఉపద్రవం ఎదురైనా భక్తులను కాపాడటం, భక్తులు కూడా సురక్షితంగా ఉండేలా చేపట్టారు.

**రెండురోజులు వరుసగా మరింత హైఅలర్ట్ :** భారత్ పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పుణ్యక్షేత్రం తిరుమలకు ఉన్న ఘాట్‌రోడ్డుమార్గంతోబాటు రెండు కాలినడక మార్గాల్లో తిరుపతి జిల్లా పోలీసుయంత్రాంగం, ఆక్టోపస్ బలగాలు గట్టి నిఘా ఉంచాయి. హైఅలర్ట్ జోన్‌గా ప్రకటించి తనిఖీలు చేపడుతున్నాయి. ప్రత్యేక బృందాలతో యాత్రికులు బసచేసే గోగర్భమ్‌డ్యామ్ సమీపంలోని మఠాలలో, వసతిసముదాయాలు, విశ్రాంతి గృహాల్లో ఏకకాలంలో క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ ప్రక్రియ 24గంటలూ అణువణువూ నిశితంగా పరిశీలించి, యాత్రికుల పేరుతో గదుల్లో దిగిన, బసచేస్తున్న వారి వివరాలు, ఆధార్‌కార్డులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. తిరుమల పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది బృందాలుగా విడిపోయి మెట్లమార్గంలో యాత్రికులను, వారి లగేజీలను తనిఖీ చేస్తున్నారు. కొండకు వస్తున్న వారెవరు, వారి లగేజీలను నిశితంగా పరిశీలించిన తరువాత అనుమతినిస్తున్నారు. తిరుమల ఆర్టీసి బస్టాండుతోబాటు అతిథిగృహాల్లో బసచేసిన వారి వివరాలను తెలుసుకుంటున్నారు. ఆయా విశ్రాంతి గృహాలు, అతిథిగృహాల్లో మేనేజర్లు, సిబ్బందికి పోలీసులు స్పష్టమైన సూచనలు, జాగ్రత్తలు చేస్తున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో తిరుమల డిఎస్పీ >>2

## జూలై 10న 'హంద్రీ' నీరు విడుదల



శుక్రవారం సభలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

### ఆధునీకరణ పనుల పూర్తికి రూ. 3,873 కోట్లు

### 'తల్లి వందనం' పిల్లలందరికీ ఇస్తాం

### దేశంలో ఉగ్రవాదాన్ని ఉపేక్షించే ప్రసక్తిలేదు

### ఛాయాపురం సభలో సిఎం చంద్రబాబు

**అనంతపురం, మే 9 ప్రభాతవార్త బ్యూరో:** రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని,వచ్చే జూలై 10న హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా నీటిని విడుదల చేస్తామని, ఈ సీజన్లోనేహంద్రీ నీవా ద్వారా 40టీఎంసీల నీటిని తేవాలని ఆలోచన చేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. హంద్రీ నీవా ప్రాజెక్టులో ఫేజ్ 1, 2 కింద 554 కి.మీ. మేర కాలువ లైనింగ్, వెడల్పు పనులకు రూ.3,873 కోట్లు ఖర్చు చేస్తున్నామని,, పనులు ప్రారంభించి ఇప్పటికే 37 శాతం పనులు పూర్తి చేసినట్లు సీఎం తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఐదేళ్ల హంద్రీనీవా పనులు ఆగిపోయాయని, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే హంద్రీ నీవా పనులను శరవేగంగా పూర్తి చేస్తోందని , పోలవరంబనకచర్ల పూర్తయితే సీమలో కరువు అనే మాట వినబడదని, రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరు అందుతుందని సీఎం చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం చాయాపురంలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద కాలవ వెడల్పు పనులను క్షేత్రస్థాయిలో సీఎం పరిశీలించారు. అనంతరం చాయాపురంలో నిర్వహించిన ప్రజావేదికలో పాల్గొన్నారు. దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని సీఎం చంద్రబాబు రెండు నిమిషాలు మోనం పాటించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సభలో ప్రజలను ఉద్దేశించి సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడారు. సీఎం మాటల్లోనే.మనందరి ప్రియతమ నేత ఎన్టీఆర్ కల హంద్రీనీవా.ఆనాడు రాయలసీమకు నీరు లేదు. ఎడారిగా మారిపోతుందని అందరూ చేతులెత్తేశారు. అలాంటి పరిస్థితుల్లో నమ్మకం కల్పించిన వ్యక్తి ఎన్టీఆర్. ఆనాడు కృష్ణా జలాలను బచావత్ అవార్డు ప్రకారం కేటాయించేవారు. మిగులు జలాలు వాడుకునే అవకాశం ఏపీకి ఉందని భావించిన ఎన్టీఆర్ హంద్రీనీవా, గాలేరు, నగరి, తెలుగుగంగ వంటి ప్రాజెక్టులు తెచ్చి సీమ దశదిశా మార్చే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత నేను ముఖ్యమంత్రి అయ్యాక సీమకు ఏం చేయాలో అన్నీ చేశాను. రాయలసీమ రాళ్ల సీమ అని చాలామంది అన్నారు. రతనాలసీమ చేస్తానని ఆరోజు చెప్పాను. మొన్నటి ఎన్నికల్లో కూటమికి జిల్లా వాసులు పట్టం కట్టారు అని వెల్లడించారు. నీరు ఉంటేనే ఏదైనా సాధ్యం . నీటి వనరుల కోసం హంద్రీనీవాను వెడల్పు చేస్తానని చెప్పిన గంటలో జీవో ఇచ్చాను. అదే సమయంలో 37 శాతం పనులు పూర్తి చేశాను. 2014లో మేం గెలిచాక సీమ ప్రాజెకక్టులపై దృష్టి పెట్టాం. కియా పరిశ్రమను ఏపీకి రమ్మంటే నీళ్లు ఎక్కడున్నాయో చెప్పమన్నారు. ఆరునెలల సమయం తీసుకుని గొల్లపల్లిప్రాజెక్టు పూర్తిచేసి ఐదేళ్లలోనే కరువు జిల్లాకు కియా వచ్చేలా చేశాం. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో ఒక్క రూపాయి ఖర్చు పెట్టారా, ఒక్కరోడ్డుకైనా మట్టి వేశారా, గుంటలు పూడ్చారా, కాల్వల్లో గంప మట్టి తీశారా అలాంటి ప్రభుత్వాల వల్ల ప్రజలకు ఒరిగేది ఏమీఉండదు. ఈ సీజన్లోనే హంద్రీనీవా ద్వారా 40 టీంసీలు తేవాలని చూస్తున్నాం. 2014-19మధ్య కాలంలో >>2

## డిప్యూటీ కలెక్టర్‌కు ఎమ్మార్వోగా డిమోషన్

### సుప్రీం కోర్టు సంచలన తీర్పు

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన డిప్యూటీ కలెక్టర్ విషయంలో సుప్రీం కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. డిప్యూటీ కలెక్టర్‌ను ఎమ్మార్వోగా డిమోషన్ చేస్తూ సుప్రీం తీర్పునిచ్చింది. డిప్యూటీ కలెక్టర్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. తాము చట్టానికి అతీతులమన్న భావనను ప్రభుత్వ అధికారులు తగ్గించుకోవాలని వ్యాఖ్యలు చేసింది. >>2

## సిఎం చంద్రబాబుకు పటిష్ట భద్రత

**విజయవావ.మే9,ప్రభాతవార్తప్రతినిధి:** ఆపరేషన్ సిందూర్ తరువాత వివిధ ప్రాంతాల్లో చేపట్టిన భద్రతా చర్యలు, ప్రజలు, సంస్థల రక్షణ, వీఐపీల భద్రతపై ఉన్నతాధికారులు హైలెవల్ రివ్యూ చేశారు. ప్రస్తుత పరిస్థితులు,తీసుకోవాల్సిన చర్యలపై డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, ఇంటిలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్రలడ్హాతో పాటు ఉన్నతాధికారులు సమీక్షకు హాజరయ్యారు. ఇందు >>2

## లిక్కర్ స్కాం దర్యాప్తు ముమ్మరం

### వాస్తవాలు కూపీ లాగుతున్న ఇడి

### కేసులో 33మంది నిందితులు

**విజయవాడ,మే 9,ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అడుగుపెట్టడం సంచలనంగా మారిన నేపథ్యంలో ఆ సంస్థ దూకుడు పెంచింది,నిజాలు రాబట్టేందుకు పలు దిశలో కూపీలాగుతుంది.ఇప్పటికే ప్రాథమిక విచారణ జరిపిన ఈడీ అధికారులు మనీ లాండరింగ్ చట్టం(పీఎంఎల్ఏ) కింద అభియోగాలు మోపింది. తదనుగుణంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు(ఈసీఐఆర్) నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసులో 33 మందిని నిందితులుగా చేర్చారు. వైకాపా ప్రభుత్వం పెద్దల తరపున మద్యం కుంభకోణంలో అన్నీ తానై వ్యవహరించిన రాజ్ కెసిరెడ్డితో పాటు వైకాపా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి,ఆ పార్టీ నేత విజయసాయిరెడ్డి,జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం సిఎంఓ కార్యదర్శిగా పనిచేసిన విశ్రాంత ఐఎఎస్ అధికారి ధనుంజయరెడ్డి,జగన్ ఓఎస్డీ కృష్ణమోహనరెడ్డి,భారతి సిమెంట్స్ పూర్తి కాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీతో పాటు ఏపీఎస్‌బీసీఎల్ పూర్వపు ఎండీ డి.వాసుదేవరెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ ప్రత్యేకాధికారి సత్యప్రసాద్, ఎస్‌వీవై ఆగ్రో ఇండస్ట్రీస్ పూర్వపు డైరెక్టర్ సజ్జల శ్రీధర్‌రెడ్డి,మద్యం ముడుపుల వసూళ్ళలో కీలకంగా వ్యవహరించిన రాజ్ కెసిరెడ్డి తోడల్లుడు ముప్పిడి అవినాష్‌రెడ్డి,వీరి అనుచరులు బూనేటి చాణక్య,టి.కిరణ్‌కుమార్‌రెడ్డి,సైఫ్ అహ్మద్‌తో పాటు మద్యం ముడుపుల సొత్తు రూటింగ్ కోసం వినియోగించిన పలు డొల్ల సంస్థల యాజమాన్యాలను నిందితులుగా ఈడీ చేర్చింది. వీరందరికీ నోటీసులిచ్చి విచారించేందుకు అధికారులు సిద్దమవుతున్నారు. దేశ చరిత్ర లోనే ఇది అతి పెద్ద మద్యం కుంభకోణం కావడంతో పాటు సరఫరా కంపెనీలు,డిస్టలరీల నుండి వసూలు చేసిన దాదాపు రూ.3200 కోట్ల ముడుపులను కల్పిత, ఊహాజనిత కంపెనీల ద్వారా వివిధ దశల్లో రూటింగ్ చేసి అంతిమ లబ్దిదారుకు చేర్చినట్లు ప్రాథమికంగా ఈడి గుర్తించింది.మద్యం కుంభకోణం కేసులో దర్యాప్తును ముమ్మరం చేసిన ఈడీ అధికారులు దీనికి సంబంధించిన సమగ్ర వివరాలివ్వాలని కోరుతూ రెండు రోజుల కిందట సిట్ అధిపతి ఎస్‌వీ రాజశేఖరబాబుకు లేఖ రాశారు. సీఐడీ తొలుత నమోదు చేసిన ఎఫ్ఐఆర్ సర్టిఫైడ్ ప్రతులు,ఈ కేసులో నిందితులు, అనుమానితులు, సంబంధమున్న ఇతర వ్యక్తులు, సంస్థల బ్యాంకు ఖాతాల వివరాలు,ఆస్థుల సమాచారం అందివ్వాలని లేఖలో కోరారు. ఇప్పటి వరకు అరెస్ట్ అయిన నిందితులు,వారి రిమాండు రిపోర్టులు,అభియోగ పత్రం దాఖలు చేసుంటే దాని ప్రతిని సమర్పించాలని అడిగారు. వాటితో పాటు ఈ కేసు దర్యాప్తులో ఉపయోగపడే అవసరమైన ఇతర పత్రాలు,సమాచారం ఉంటే అందివ్వాలని లేఖలో పేర్కొన్నారు. ఈడీ కోరిన వివరాల్ని సిట్ అధికారులు అందించినట్లు తెలిసింది. వాటి ఆధారంగా ఈడీ మనీ లాండరింగ్‌కు సంబంధించి లోతుగా వివరాలు ఆరా తీస్తుంది.బ్యాంకు ఖాతాలు,ఆస్థుల సమాచారాన్ని పరిశీలిస్తోంది. కుంభకోణానికి >>2

## భద్రత పెంచాలని కోరిన జగన్

### మాజీ సీఎం పిటిషన్ విచారణ వేసవి తరువాతకు వాయిదా

2లో

### గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో

## కర్నూలు, అనకాపల్లి టాప్



ఫలితాలు విడుదల చేసిన మంత్రి బాల వీరాంజనేయస్వామి

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకాలల ప్రవేశ పరీక్ష -2025 ఫలితాలు విడుదలయ్యాయి. శుక్రవారం ఉదయం మంత్రి డాక్టర్ బాల వీరాంజనేయస్వామి ఈ ఫలితాలను విడుదల చేశారు. ఐదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం సాంఘీక సంక్షేమ శాఖ ఈ ప్రవేశ పరీక్షలను నిర్వహించింది. ఐదవ తరగతి ప్రవేశ పరీక్షల ఫలితాల్లో కర్నూలు జిల్లా నుంచి ఇద్దరు మొదటి, మూడో ర్యాంకు సాధించగా అనకాపల్లికి చెందిన విద్యార్థి రెండవ ర్యాంక్ సాధించారు. 5వ తరగతి ప్రవేశ పరీక్షలో.మొదటి ర్యాంక్ కడవల సుమతి (కర్నూలు జిల్లా), రెండవ ర్యాంక్ వియ్యపు శరత్ (అనకాపల్లి జిల్లా), మూడవ ర్యాంక్ బోయా విద్యా (కర్నూలు జిల్లా) లభించాయి. ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షల్లో విశాఖ జిల్లాకు చెందిన విద్యార్థి మొదటి ర్యాంకు, కర్నూలు జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు రెండు, మూడు ర్యాంకులను సాధించారు. మొదటి ర్యాంక్ రఘుపతి గీతిక (విశాఖజిల్లా), రెండవ ర్యాంక్ ఈపూరు సుహృతి (కర్నూలు జిల్లా ), మూడవ ర్యాంక్ పింజరి హసీనా (కర్నూలుజిల్లా) లభించాయి. ఫలితాలు విడుదల సందర్భంగా మంత్రి డోలా వీరాంజనేయస్వామి మాట్లాడుతూ. గురుకుల పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెరిగిందన్నారు. గురుకులాల్లో భవిష్యత్తులో సీట్లు పెంచాలని సీఎం చంద్రబాబు నాయుడు ప్రణాళికాబద్ధంగా వెళ్తున్నారని తెలిపారు. గురుకుల పాఠశాలల్లో చదివే విద్యారులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థులకు కాస్మోటిక్ కిట్స్ కూడా అందిస్తున్నామని తెలిపారు. గురుకులాల్లో మెకానైజ్డ్ సిస్టం ఇంప్లిమెంట్ చేస్తున్నామన్నారు. కార్పొరేట్‌కు ధీటుగా >>2



శుక్రవారం చాయాపురం సభకు హాజరైన ప్రజలు

# జూలై 10న 'హంద్రీ' నీరు విడుదల

>> ఒక్కడ ఇరిగేషన్ కోసమే రూ. 70వేల కోట్లు ఖర్చు చేశాం. ఒక్క రాయలసీమలోనే రూ. 12,441 కోట్లు ఖర్చు చేశాం అని సీఎం వెల్లడించారు. హంద్రీనీవాలో రూ.4,200 కోట్లు ఖర్చు చేశాం. 10మీటర్ల నుంచి 16.5 మీటర్ల వెడల్పు చేశాం. 40 టీఎం సీ నీరు తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ సీజన్ లోనే పనులు పూర్తి చేస్తాం. 23 నుంచి 34 ప్యాకేజీలు పనులు పూర్తయ్యాయి. గొల్లపల్లి, మడకశిర బ్రాంచ్ కెనాల్ పూర్తిచేశాం. చెర్లోపల్లి , జీడిపల్లి ప్రాజెక్టులు పూర్తిచేశాం. హంద్రీనీవా ప్రాజెక్టు కోసం 512 ఏజెన్సీ లు పనిచేస్తున్నాయి. మొత్తంగా 1040 మిషన్లు పనిచేస్తున్నాయి అని సీఎం తెలియజేశారు.మొన్నటి వరకూ పుట్టపర్తి చుట్టుపక్కల నీరు కనిపించేది కాదు. ఇప్పుడు ఎక్కడ చూసినా నీరు కనిపిస్తుంటే ఆనందంగా ఉంది. ఒకప్పుడు ఇక్కడ జనం దిగాలుగా ఉండేవారు. ఇప్పుడు హుషారుగా ఉన్నారు. నీరు అందడంతోనే మీలో ధైర్యం వచ్చింది. అందుకు హంద్రీనీవానే కారణం అని తన ప్రసంగంలో సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. గత ఐదేళ్లలో డ్రిప్ , మైక్రో ఇరిగేషన్ పథకాలు ఇవ్వలేదు. మేం వచ్చాక 90 శాతం డ్రిప్ ఇరిగేషన్ కు సబ్సిడీ ఇచ్చేది ఏపీ ప్రభుత్వమే అని సీఎం వెల్లడించారు. పోలవరంబనకచర్ల పూర్తయితే రాష్ట్ర ముఖచిత్రం మారిపోతుంది. 2 వేల టీఎంసీల నీరు గోదావరి నుంచి సముద్రంలోకి పోతోంది. అందులో 300 టీఎంసీ నీరు మనం తెచ్చుకోగలిగితే రాష్ట్రమంతా సస్యశ్యామలం అవుతుంది. ప్రతి ఎకరాకు నీరు అందుతుంది. రైతులు బంగారం పండిస్తారు. ప్రాజెక్టు కోసం రూ. 81 వేల కోట్లు కావాలి. సంకల్పం ఉంటే అదే దారి చూపుతుంది. పోలవరం నుంచి బనకచర్ల వరకూ నీరు తెస్తే నా జీవితం సార్థకమవుతుంది అని సీఎం చంద్రబాబు వెల్లడించారు. దేశాన్ని రక్షించే సమర్థ నాయకుడు మోదీ. దేశాన్ని రక్షించే శక్తి ప్రధాని మోదీ కి ఉందని ఇటీవల అమరావతి సభలో నేను చెప్పాను. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ తో టెర్రరిస్టులను హతం చేసింది. పాకిస్తాన్ మనపై దాడులు చేస్తూ కవ్వింపు చర్యలకు దిగుతోంది. దేశ రక్షణలో భాగంగా మన తెలుగుబిడ్డ మురళీ నాయక్ ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధించింది. ఆతని ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. మురళీ నాయక్ కుటుంబానికి అండగా ఉంటాం. ఎందరో యువకులు రక్షణశాఖలో చేరుతున్నారు. సైన్యానికి మనమంతా అండగా ఉండాలి. వారి పోరాటానికి మద్దతివ్వాలి. ప్రపంచంలో హింసకు తావులేదు. ప్రగతిలో పోటీ పడాలని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ తల్లి వందనం ఇస్తాం. రాష్ట్రంలోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. 63 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నాం. ఇందుకోసం రూ. 33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. ప్రతి కుటుంబానికి ఇల్లు, మంచినీటి కుళాయి , మరుగుదొడ్డి, కరెంటు, దీపం కింద గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలన్నదే నా లక్ష్యం. ఇప్పటికే 200కు పైగా అన్నాక్యాంటీన్లు ఏర్పాటు చేశాం. దీపం 2 పథకం కింద 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. మత్స్యకారులకు రూ. 20 వేలు వేశాం. 16 వేలకు పైగా టీచరు పోస్టులు భర్తీ చేయబోతున్నాం. రైతులకు అన్నదాత సుఖీభవ కింద ఏడాదిలో మూడు విడతల్లో రూ. 20 వేలు పెట్టుబడి సాయం అందిస్తాం. తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ రూ. 15 వేలు అందిస్తాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరులకు ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం. భద్రత విషయంలోనూ కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఆడబిడ్డల జోలికొస్తే ఎవరినీ వదిలిపెట్టం. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి. త్వరలో హెల్త్ డిజిటల్ కార్డులు అందుబాటులోకి తెస్తాం. గుంతల రోడ్లు గత పాలకులు ఎలా పాలించారో చెప్పాయి. రాష్ట్రంలో కూటం ప్రభుత్వం వచ్చాకే రోడ్లలో గుంతలన్నీ పూడ్చామని సీఎం చంద్రబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్,జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు, ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ,అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్,అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ,కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు,గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఏడీసీసీ బ్యాంక్ అధ్యక్షులు ముంటిమడుగు కేశవరెడ్డి, టిడిపి నేతలు ఆలం నర్స నాయుడు, శ్రీధర్ చౌదరి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## హంద్రీ నీవా కాలువ విస్తరణ పనులు పరిశీలించిన సిఎం చంద్రబాబు

**అనంతపురం, మే 9, ప్రభాతవార్త బ్యూరో:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనంతపురం జిల్లా పర్యటనలో కొద్దిసేపు అధికారులకు గుండెల్లో రైలు పరిగెత్తించారు. ప్రజా ప్రతినిధులు కూడా లేకుండా హంద్రీ నీవా ఎస్.ఈ స్వరూప్ కుమార్‌ను పక్కన పెట్టుకొని కాలవ వెడల్ పనులను సీఎం పరిశీలించడం, ప్రత్యేకంగా వివరాలుతెలుసుకోవడం చర్చనీయాంశంగా మారింది. సాంకేతిక నిపుణులతో డ్రోన్ల సహాయంతో కూడా కాలవ విస్తరణ పనులు స్వయంగా తెలుసుకుని సీఎం వారితో మాట్లాడడం గమనించదగ్గ విషయం కొద్దిసేపు జిల్లా మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, తదితర ఎమ్మెల్యేలు కలిసి హంద్రీ నీవా విస్తరణ పనులను సమీక్షించారు. తనదైన శైలిలో సిఎం చంద్రబాబు కాలువ పనులను పరిశీలించడం ప్రత్యేకంగా చెప్పవచ్చు.

# కర్నూలు, అనకాపల్లి టాప్

>> విద్యను అందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు కెరీర్ కౌన్సిలింగ్‌లు ఇప్పించి భవిష్యత్తుకు పునాదులు వేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి డోలా వీరాంజనేయస్వామి వెల్లడించారు. విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యం, సంరక్షణ పట్ల కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యా ప్రమాణాలు ఉ సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు.ప్రతి పాఠశాలలో పారిశుధ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యవిద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కోసం ప్రతి వారం ఒక పీరియడ్ బోధించేలా చర్యలు ఉచిత నీట్ కోచింగ్ సెంటర్లు 10కి పెంచుతున్నాం. పేదింటి బిడ్డలు డాక్టర్లు, ఇంజనీర్లు అవ్వాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. రాష్ట్రంలోని వంద పాఠశాలల్లో రూ. 10 కోట్లతో అధునాతన కిచెన్ లను అప్ గ్రేడ్ చేసి విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన భోజన వసతికి వెకనైజేషన్ ఆఫ్ కిచెన్ కు చర్యలు తీసుకున్నామని తెలిపారు. అలాగే ప్రతి విద్యార్థికి రెండు జతల నైట్ డ్రెస్ లు అందిస్తున్నామన్నారు. అంతేకాకుండ రాష్ట్రంలో 3ఎక్సలెన్స్ సెంటర్‌లు ఉండగా వాటిని 10కి పెంచుతున్నామన్నారు. పదవ , ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎక్సలెన్స్ సెంటర్‌ల ద్వారా వారికి మరింత మెరుగైన, ఉత్తమమైన శిక్షణ అందించనున్నామన్నారు. సమావేశంలో సెక్రటరీ వి. ప్రసన్న వెంకటేష్, అడిషనల్ సెక్రటరీ కె. సునీల్ రాజ్ కుమార్, జాయింట్ సెక్రటరీ ఎన్. సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ కలెక్టర్‌కు ఎమ్మార్వోగా డిమోషన్

>> హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించినందుకు అమరావతి, విజయవాడ , తీహార్.. ఏ జైలుకు వెళ్లాలో డిప్యూటీ కలెక్టరే నిర్ణయించుకోవాలని సూచించింది. ఉద్దేశపూర్వకంగా ఉత్తర్వులను పాటించకపోవడంతో డిప్యూటీ కలెక్టర్‌కు ఏపీ హైకోర్టు రెండు నెలల జైలుశిక్ష విధించింది. ఏపీ హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాలు చేశారు డిప్యూటీ కలెక్టర్. ఈ పిటేషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. 2013 డిసెంబర్ 11న గుంటూరులో ఒక ప్రాంతంలో ఆక్రమణలను తొలగించవద్దని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను డిప్యూటీ కలెక్టర్ ధిక్కరించారు. అప్పట్లో తహసీల్దార్‌గా ఉన్న సదరు అధికారి హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించి 2014లో ఆక్రమణలు తొలగించారు. దీంతో ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన సదరు తహసీల్దార్‌కు ఏపీ హైకోర్టు రెండు నెలల జైలు శిక్ష విధించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ డిప్యూటీ కలెక్టర్ సుప్రీంను ఆశ్రయించారు.దీనిపై గత విచారణ జరిపింది ధర్మాసనం. విచారణలో డిప్యూటీ కలెక్టర్‌పై తీవ్రస్థాయిలో జస్టిస్ బీఆర్ గవాయ్‌మండిపడ్డారు. న్యాయస్దానం తీర్పును గౌరవించాలని, అహంభావంతో వ్యవహరించడం సరికాదని మందలించింది.

# మురళీనాయక్ వీరమరణం

>> ద్రులు శ్రీరాములు నాయక్, జ్యోతిభాయి కడుపు కోత వర్ణాతీతమన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మురళీ నాయక్‌ను సూర్య చంద్రులు ఉన్నంత వరకూ గుర్తించుకుంటామన్నారు. మురళీ ప్రాణత్యాగం వృథా కానివ్వబోమని, శత్రువును చిత్తుగా ఓడించి తీరుతామని తెలిపారు. పాకిస్తాన్ జరుగుతున్న ధర్మయుద్ధంలో కేంద్ర ప్రభుత్వానికి, సైనికులకు రాజకీయాలకతీతంటా అండగా ఉండాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు.వీర జవాన్ తల్లిదండ్రులు విషాదంలో ఉన్నా తమ బిడ్డ దేశం కోసం ప్రాణాలు అర్పించడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. బాధిత కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. తాను కూడా సొంతంగా రూ.5 లక్షలు చెక్కు ను అందజేసినట్లు మంత్రి సవిత తెలిపారు. మురళీ నాయక్ ధైర్య సాహసాలు భవిష్యత్తు తరాలకు తెలియాలనే లక్ష్యంతో గోరంట్ల మండలం ప్రధాన సర్కిల్ లో ఆయన విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. మురళీ నాయక్ తల్లిదండ్రులను సీఎం చంద్రబాబునాయుడు ఫోన్ లో పరామర్శించినట్లు మంత్రి సవిత తెలిపారు. మురళీ ధైర్య సాహసాలను చూసి దేశం గర్విస్తోందని, అన్ని విధాలా అండగా ఉంటామని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చినట్లు వెల్లడించారు. మురళీ నాయక్ మృతదేహం శనివారం బెంగుళూరు నుంచి స్వగ్రామానికి వస్తుందని, ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తామని మంత్రి సవిత తెలిపారు. అంతకుముందు మురళీనాయక్ చిత్ర పటానికి మంత్రి సవిత నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్, బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ బొట్టు శ్రీనివాసులు, జనసేన మండల అధ్యక్షులు సంతోష్ కుమార్, జిల్లా కార్యదర్శి సురేష్, టిడిపి మండల సీనియర్ నాయకులు బాలకృష్ణ చౌదరి, మాజీ సర్పంచ్ నరేష్, నిమ్మల శ్రీధర్, నాగేనాయక్, మాజీ సర్పంచ్ సుధాకర్ రెడ్డి, సుబ్బారెడ్డి, పచ్చ అశోక్, చింత భాస్కర్ రెడ్డి, చింత రామచంద్రారెడ్డి, జయరాం, మెడికల్ స్టోర్ శ్రీనివాసులు, పసుపులేటి శ్రీనివాసులు, షణ్ముఖ, లక్ష్మీరామ్ నాయక్, మాజీ సర్పంచ్ రవి నాయక్, జనసేన నేత గాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# దద్దరిల్లిన ఎల్వోసీ

>> భద్రతా బలగాలు కూడా అందుకు ధీటుగా తిప్పికొడుతున్నాయి. అమెరికానుంచి కొనుగోలుచేసిన ఎఫ్16 యుద్ధవిమానాలను భారత్ తాను రష్యానుంచి కొనుగోలుచేసిన ఎస్400 వ్యవస్థతో కూల్చివేయడంతో పాక్ వెన్నులో వణుకుపుడుతోంది. ఇప్పటికే ఇస్లామాబాద్‌ను టార్గెట్‌చేసి దాడులు చేయడంతో పాక్ ప్రధాని షెహబాజ్‌షరీఫ్‌సైతం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అలాగే కరాచి పోర్టుపైనా ఐఎన్‌ఎస్ విక్రాంత్ సాయంతో భారత్ దాడులుచేసింది. లాహోర్‌పైనా మనవద్ద ఉన్న హార్పర్ డ్రోన్లతో ఎడతెరిపలేకుండా దాడులుచేయడంతో పాక్‌సేనలు తోకముడిచాయి. ఇక శుక్రవారంచూస్తే రాజస్థాన్‌లోని జైలస్మేర్, పోఖ్రాన్‌ప్రాంతాలతోపాటు పంజాబ్‌లోని పఠాన్‌కోట్, యూరి, ఫిరోజ్‌పూర్‌ప్రాంతాలు పాక్ లక్ష్యంగా చేసుకుంది. అలాగే హర్యానాలోని పంచకుల, అంబాలా ప్రాంతాలపైకి కూడా పాక్‌డ్రోన్లు దూసుకురావడంతో భారత్ దళాలు వెంటనే అప్రమత్తం అయి బ్లాక్‌ఔట్ ప్రకటించి తమ కార్యాచరణను ఉధృతం చేసాయి.ఎక్కడికక్కడే పాక్ డ్రోన్లను కూల్చివేసారు.ప్రత్యేకించి జమ్ముకాశ్మీర్‌లోని రాజౌరి, పూంచ్, కుప్వారా, నౌషేరా,నౌగామ్,సాంబాసెక్టార్లలో పాక్ డ్రోన్లుముంచుకురావడంతో సరిహద్దు భద్రతా దళాలు వెంటనే అప్రమత్తం అయ్యాయి.సాంబా సెక్టార్‌మీదుగా చొరబడేందుకు ప్రయత్నించిన ఏడుగురిని మన భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. పాకిస్థాన్‌తో సరిహద్దును పంచుకుంటున్న నాలుగు రాష్ట్రాల్లో భద్రతా చర్యలను పెంచేసారు. రాజస్థాన్, జమ్ముకాశ్మీర్, పంజాబ్, గుజరాత్ లలో మరింతగా భద్రతను కట్టుదిట్టంచేసారు. పగటివేళల్లోనే సైరన్లు మారుమోగడంతోప్రజలంతా ఇళ్లనుంచి బయటికి రాలేదు. రాత్రి కావడంతోనే ఈ సరిహద్దుల్లో మొత్తం విద్యుత్‌సరఫరాను నిలిపివేసి బ్లాకౌట్‌ప్రకటించడంతో భద్రతా బలగాలు ప్రతిదాడులను ముమ్మరంచేసాయి. ఫిరోజ్‌పూర్‌లోని జనావాసాలపై పాకిస్థాన్‌డ్రోన్ దాడులుచేయడంతో క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించారు. ఇక దేశవ్యాప్తంగా కీలక విమానాశ్రయాలన్నింటినీ మూసివేసారు. అలాగే అంతర్జాతీయ సంస్థలు, శ్రీహరికోట ఇస్రో వంటి అంతరిక్ష పరిశోధనా సంస్థలవద్ద భద్రతను మరింతగా పెంచారు. హోంశాఖ ఇప్పటికే సిఐఆర్‌ఎఫ్ సంస్థలను భద్రతాపరంగా ఎలాంటి రాజీ పడవద్దని హెచ్చరించడంతో ఈ సంస్థలవద్ద భద్రతను మరింత కట్టుదిట్టంచేసారు. దేశంలోని సరిహద్దు ఉన్న నాలుగు రాష్ట్రాల్లో మొత్తం 28కిపైగా ఎయిర్‌పోర్టులుమూసివేసారు. ఢిల్లీలో కూడా విమానసర్వీసులు నిలిపివేసారు. మొత్తం 130 విమానసర్వీసులను రద్దుచేసారు. దాడులు ముమ్మరం అవుతున్నందున వైద్యరంగంలో విశిష్టసేవలు వినియోగించుకు నేందుకు కేంద్ర ఆరోగ్యమంత్రి జెపినడ్డా తన మంత్రిత్వశాఖ పరిధిలో ఎయిమ్స్ వైద్యులు, సిబ్బంది ఉద్యోగులకు సెలవులు రద్దుచేసారు. ఆరోగ్యకారణాలపై మినహా ఎలాంటి సెలవులు ఇవ్వకూడదన్న ఆదేశాలు జారీ అయ్యాయి. ఇప్పటికే సెలవుల్లో ఉన్నవారిని వెంటనే విధుల్లో చేరాలని ఆదేశం చారు. ఈనెల 15వ తేదీ వరకూ సరిహద్దు రాష్ట్రాల్లోని ఎయిర్‌పోర్టులన్నింటినీ మూసివేస్తున్నట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖప్రకటించింది. ఉత్తర, పశ్చిమ భారత్‌లోని ఎయిర్‌పోర్టులు కేంద్రఉత్తర్వులు వెలువడేంతవరకూ మూతపడ్డాయి. భారత్‌పాక్ దాడులనేపథ్యంలో అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కేంద్ర హోంశాఖ మార్గదర్శకాలు జారీచేసింది. సివిల్ డిఫెన్స్ చట్టంలోని 11వ నిబంధనను ఉపయోగించాలని కోరింది. ఈ నిబంధనప్రకారం సైరన్‌వంటివి కొనుగోలు చేసుకోవచ్చు. అవసరం అనుకుంటే అత్యవసర అధికారాలు వినియో గించుకోవాలని సూచించింది. ఇదిలా ఉంటే పాకిస్తాన్‌కు మద్దతు ప్రకటించిన తుర్కియే, అజర్‌బైజాన్‌లకు ప్రయాణసేవలను నిలిపివేసినట్లు ట్రావెల్ సంస్థలు వెల్లడించాయి. తదుపరి ఉత్తర్వులు వెలువడేంతవరకూ ఈసేవలు నిలిపివేత అమలులో ఉంటుందని వెల్లడించాయి. తాజాగా గుజరాత్ తీరప్రాంతంలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోకూడా డ్రోన్లు, బాణాసంచా కాల్చడంపై నిషేధం విధించారు. వేడుకల్లోకూడా ఈనిషేధం అమలవుతుందని, ఈనెల 15వరకూ అందరూ పాటించాలని గుజరాత్ సీఎం భూపేంద్రపటేల్ తెలిపారు. దేశరాజ ధాని ఢిల్లీలో శుక్రవారం సైరన్లుమారుమోగాయి. ఒక్కోసైరన్ ఐదుకిలోమీటర్ల పరిధివరకూ వినిపిస్తున్నది. పలుప్రాంతాల్లో ఇప్పటికే అత్యవసర సైరన్ టెస్టింగ్ పూర్తిచేసిన అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీచేసారు. **ప్రధానిమోడీ సమీక్ష:** కాగా రెండురోజులుగా జరుగుతున్నదాడులపై ప్రధానిమోడీ అధ్యక్షతన అత్యవసర సమావేశంజరిగింది. శుక్రవారం ప్రధాని నివాసంలోజరిగిన భేటీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్, త్రివిధ దళాల అధిపతులు, జాతీయభద్రతా సలహా దారు అజిత్‌ధోబాల్‌లు పాల్గొన్నారు. దాడుల్లో భారత్ విజయవంతం కావడంపై ప్రధాని సంతృప్తి వ్యక్తంచేసారు. మరోపక్క రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ త్రివిధ దళాలు అధిప తులు,సిడిఎస్‌లతో భేటీఅయి ప్రస్తుతపరిస్థితి, భవిష్యత్ వ్యూహాలను సమీక్షించారు. ఇప్పటికే స్వతంత్ర నిర్ణయాలు తీసుకునేందుకు త్రివిధదళాలకు అనుమతినిచ్చారు. మరోపక్క కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అధ్యక్షతన కూడా కీలక సమావేశంజరిగింది.ఈ సమావేశంతర్వాత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాం తాల్లో తీసు కోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తూ నోటిఫికేషన్ జారీచేసారు.అత్యవసరంగా సైరన్లు కొనుగోలుచేయాలని ఆదేశించారు.

# ఐపిఎల్ వారం వాయిదా

>> పేర్కొంది. ఐపిఎల్ 2025 న్యూ షెడ్యూల్, వేదికలపై పరిస్థితుల ఆధారంగా సమాచారం అందిస్తామని తెలిపింది. ఐపిఎల్ భాగస్వామ్యులు, ఫ్రాంచైజీలతో చర్చించిన తర్వాతే ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సెల్ ఈ నిర్ణయం తీసుకుంది. క్లిష్ట పరిస్థితుల్లో బిసిసిఐ దేశం కోసం కచ్చితంగా నిలబడుతుంది. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైనికుల ధైర్యానికి, సేవకి బిసిసిఐ సెల్యూట్ చేస్తోంది. క్రికెట్‌ని దేశం మొత్తం ఆదరిస్తున్నప్పటికీ.. దేశం తర్వాతే మాకు ఏదైనా. దేశ భద్రతే మాకు చాలా ముఖ్యం. దేశానికి ఏది కావాలో అది చేయడానికి మేము ముందుంటాం అని బిసిసిఐ ప్రెస్‌నోట్‌లో పేర్కొంది. మార్చి 22న ప్రారంభమైన ఐపిఎల్ 2025 మే 25 వరకు కొనసాగాల్సి ఉంది. కానీ భారత్‌పాక్ ఉద్రిక్తతల దృష్ట్యా ప్లే ఆఫ్స్‌కు ముందే ఈ సీజన్ వాయిదా పడింది. వారం రోజులు అని బిసిసిఐ చెబుతున్నప్పటికీ.. అప్పటి పరిస్థితులను బట్టి ఐపిఎల్ నిర్వహించే దానిపై స్పష్టత వస్తుంది. యుద్ధ మేఘాలు ఇలానే ఉంటే ఐపిఎల్ 2025 మరింత వాయిదా పడే అవకాశాలు కూడా ఉన్నాయి. క్రికెట్ విశ్లేషకుల ప్రకారం ఇంగ్లండ్‌ఇండియా టెస్టు సిరీస్ తర్వాత తిరిగి ఐపిఎల్ 2025 కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## కేంద్రమంత్రి రామ్మోహననాయుడికి వై-ప్లస్ భద్రత

**విజయవాడ,మే 9,ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడికి భద్రత పెంచారు. ఆయనకు ప్రస్తుతం వైకేటగిరి భద్రత ఉండగా దాన్ని ఇప్పుడు వై-ప్లస్ కేటగిరీకి మార్చారు. దాంతో రాష్ట్ర పోలీసుల తరపున ఇద్దరు గన్‌మెన్‌లతోపాటు మరో ఇద్దరు సీఆర్‌పీఎఫ్ అధికారులు కలిపి మొత్తంగా ఆయన వెంట నలుగురు సిబ్బంది భద్రతగా ఉండనున్నారు. ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం నియమించిన చీఫ్ సెక్యూరిటీ అధికారి,సీఆర్‌పిఎఫ్ కమాండో విధుల్లో చేరారు.

# భద్రత పెంచాలని కోరిన జగన్

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతపై ఏపీ హైకోర్టును ఆశ్రయించిన జగన్‌కు శుక్రవారం హైకోర్టు విచారణలో నిరాశే ఎదురయింది. తనకు ప్రాణహాని ఉందని పిటీషన్‌లో పేర్కొన్న మాజీ సీఎం ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు తదుపరి విచారణ వేసవి తర్వాతకు వాయిదా చేసింది. తనకు జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతను పునరుద్ధరించాలని, ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని కోరుతూ ఆయన గురువారం ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం.తదుపరి విచారణను వేసవి తర్వాతకు వాయిదా వేసింది. పార్టీ ఎంపీలు,సీనియర్ నేతలు తన భద్రత విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పలు దఫాలు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు.

# తిరుమల,తిరుపతిలో హై అలర్ట్

>> కె.విజయశేఖర్ నేతృత్వంలో సిఐలు, ఎస్ఐలు, ఆక్టోపస్ బలగాలు, విజిలెన్స్ సిబ్బంది భారీసంఖ్యలో బృందాలుగా విడిపోయి బాంబుడిస్పోజల్ టీమ్స్, పోలీసు జాగిలాలు, ప్రత్యేక పోలీసు బృందాలు తనిఖీలు చేస్తున్నారు. తిరుమల అంతటా ఏకకాలంలో వందలసంఖ్యలో భద్రతా బలగాలు వేలాదిమంది యాత్రికుల కదలికలపై, లగేజీలపై డేగకన్నేసి తనిఖీలు కొనసాగిస్తున్నారు. యాత్రికులు కూడా పోలీసులకు సహకరించాలని, ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, అనుమానాస్పద వస్తువులు ఉన్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరుతున్నారు.



శ్రీహరికోట వద్ద భద్రత సిబ్బంది

# ఇస్రో కేంద్రాల వద్ద హై అలర్ట్

**శ్రీహరికోట (తడ), మే 9 ప్రభాతవార్త:** ఆపరేషన్ సింధూర్ ఒకవైపు కొనసాగుతుంటే మరోవైపు భారత్ ఇస్రో కేంద్రాల వద్ద హై అలర్ట్ ప్రకటించింది. పాకిస్తాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలోని అన్ని ముఖ్యమైన ఇస్రో కేంద్రాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఇస్రో ప్రధాన కార్యాలయం బెంగళూరుతో పాటు అంతరిక్ష ప్రయోగ కేంద్రం శ్రీహరికోట, తిరువనంతపురం, అహ్మదాబాద్ తదితర కేంద్రాల్లో భద్రతదళ సంఖ్యను పెంచారు. ప్రతి కేంద్రంలో ముఖ్యమైన ప్రాంతాల్లో స్కానింగ్, వాహన తనిఖీలు మరింత కట్టుదిట్టం చేశారు. దేశ భద్రతను కాపాడేందుకు కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న ముందస్తు చర్యల్లో భాగంగా ఇస్రో కేంద్రాల వద్ద హై అలర్ట్ ప్రకటించడంతో అక్కడ పనిచేసే ఉద్యోగులు, శాస్త్రవేత్తలు సైతం అప్రమత్తంగా ఉంటున్నారు.

## ఢిల్లీలో ఎపి భవన్ స్పెషల్ కమిషనర్‌గా అర్జా శ్రీకాంత్

**విజయవాడ మే 9 ప్రభాతవార్త ప్రతినిధి:** డా.అర్జా శ్రీకాంత్ ను కూటమి ప్రభుత్వం ఢిల్లీ ఆంధ్రప్రదేశ్‌కు భవన్‌కు స్పెషల్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.సాంస్కృతిక శాఖ పూర్వ సంచాలకులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్య అభివృద్ధి శాఖ సీఐవోగా అర్జా శ్రీకాంత్ గతంలో వ్యవహరించారు. ఆయనకు ఈ పదవిలో రెండేళ్లుకొనసాగుతారు. ఇక నుంచి ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ భవన్‌కు వచ్చే పార్లమెంట్ సభ్యులు, మంత్రులు, ఇతర అధికారులకు సంబంధించిన వ్యవహారాలు ఆయన చూసుకుంటారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే వివిధ స్కీమ్స్‌ను పర్యవేక్షించి సకాలంలో రాష్ట్రానికి అందేలా చూసే బాధ్యతను అర్జాకు అప్పగించారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనకు సంబంధించి వ్యవహారాలు కూడా చూసుకుంటారు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో స్కిల్ డెవలప్మెంట్ విభాగం ద్వారా ఎందరో నిరుద్యోగలకు శిక్షణ ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగాల బాట పట్టించి మంచి గుర్తింపు పొందారు. అంతకు ముందు సాంస్కృతిక శాఖ ద్వారా కళాకరులకు ప్రోత్సహించి దేశ విదేశాల్లో తెలుగు సాంస్కృతిక పరిమళాలు వెదజల్లారు. తన సొంత ఊరును దత్తత తీసుకుని అద్భుతంగా అభివృద్ధి చేశారు. ముఖ్యంగా వెనకబడిన యానాదులు, ఎరుకల వారి అభివృద్ధికి విశేష కృషి చేశారు. లాక్ డౌన్ సమయంలో కోవిడ్ నోడల్ అధికారిగా అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్ ప్రత్యేకంగా అర్జా శ్రీకాంత్‌ను నియమించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వేలాది వలస కార్మికులను వారి సొంతూళ్లకు పంపించడంలో విశేష కృషి చేసి అభినందనలు అందుకున్నారు.

## ఢిల్లీ ఏపీ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** భారత్, పాకిస్తాన్‌లమధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రాబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీ లోని ఏపీ భవన్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. పాకిస్తాన్‌తో సరిహద్దు గల రాష్ట్రాలలో ఉన్న లేదా ఆ రాష్ట్రాలకు వెళుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల సౌకర్యార్థం ఈ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని సీఎం వెల్లడించారు. జమ్మూ కాశ్మీర్, లడక్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో ఉన్న లేదా రాష్ట్రాలకు వెళుతున్న ఆంధ్రులు సమాచారం, సహాయం కొరకు నిరంతరం (24గంటలు)పనిచేసే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చునని సీఎం చంద్రబాబునాయుడు తెలిపారు. కంట్రోల్ రూమ్‌సంప్రదించాల్సిన వివరాలు ఇలా ఉన్నాయి. **01123387089, 9871999430, 9871999053,** అదనపు సమాచారం లేదా సహాయం కొరకు ఎం.వి.ఎస్. రామారావు, డిప్యూటీ కమిషనర్ **98719 90081**, వి. సురేష్‌బాబు లైజన్ ఆఫీసర్ **9818395787.** ఈ నెంబర్లు నుంచి రోజంతా ఎప్పుడు ఫోన్ చేసిన తగిన సహకారం,సహాయత లభిస్తాయి.

# లిక్కర్ స్కాం దర్యాప్తు ముమ్మరం

>> పాల్పడ్డ ముఠా,అత్యధికంగా ఆర్డర్లు కట్టబెట్టిన మద్యం డిస్టలరీలు,సరఫరా కంపెనీల నుండి ముడుపులు తీసుకోవడమే కాకుండా కొన్ని డిస్టలరీలను గుప్పిట్లో పెట్టుకొని,వాటికి రూ.,వేల కోట్లను ఏపీఎస్‌బీసీఎల్ ద్వారా చెల్లించింది. ఆ తర్వాత ఆ డిస్టలరీల నుండి కల్పిత కంపెనీలు,అసలు ఉనికిలోనే లేని సంస్ఠథల ఖాతాల్లోకి బారీగా డబ్బు జమచేసింది. దీని వెనుక భారీగా మనీ లాండరింగ్ జరిగింది.ఈ నిధుల రూటింగ్‌ను ఎలా చేశారు? కల్పిత సంస్థల ఖాతాల నుండి సొత్తు ఎన్ని అంచెల్లో చివరికి ఎక్కడికి చేరింది? ఎవరికి చేరిందనే దానిపై దానిపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. అంతిమ లబ్దిదారును తేల్చనుంది. ప్రధానంగా ముడుపుల సొమ్మును హైదరాబాద్, బెంగుళూరుల్లో స్థిరాస్థి రంగంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు భారీగా బంగారం రూపంలోకి మార్చినట్లు సిట్ దర్యాప్తులో గుర్తించింది. ఈ నేపథ్యంలో ఎక్కడి నుండి ఏ స్థాయిలో ముడుపులు వచ్చాయి. వాటిని ఏయే మార్గాల ద్వారా రూటింగ్ చేసి, స్థిరాస్థి సంస్థల ఖాతాల్లోకి మళ్ళించారు?అనే దానిపై ఈడీ లోతుగా దర్యాప్తు చేస్తోంది.కొల్లగొట్టిన సొత్తును నేరుగా కాకుండా వివిధ దశల్లో,అనేక అంచెల్లో(మల్టీ లేయర్) అంతిమ లబ్ధిదారుకు చేరవేసేందుకు ఈ ముఠా డొల్ల కంపెనీలు, అస్మదీయ సంస్థలను ముం దుపెట్టి కథ నడిపించింది.ఓల్విక్ మల్టీవెంచర్ ప్రైవేటు లిమిటెడ్, క్రిపాటి ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేటు లిమిటెడ్,నైస్న మల్టీవెంచర్స్ ప్రైవేటు లిమిటెడ్,ట్రిఫెర్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేటు లిమిటెడ్, విక్సో ఎంటర్ ప్రైజెస్, డీ కార్ట్ లాజిస్టిక్స్ ప్రైవేటు లిమిటెడ్, బాలాజీ ట్రేడింగ్,రుచిత జ్యుయలర్స్,మలీష్కా గోల్డ్ అండ్ జ్యూయలరీ,సన్ హాక్ ల్యాబ్స్, ఈషాన్వీ ఇన్‌ఫ్రా తదితర అనేక సంస్థలను అడ్డం పెట్టుకున్నట్లు సిట్ ఇప్పటికే తేల్చింది. ఈ నేపథ్యంలో ఆయా ఖాతాలన్నింటిపైనా ఈడీ దృష్టి పెట్టనున్నది,

# సిఎం చంద్రబాబుకు పటిష్ట భద్రత

>>లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సెక్యూరిటీ విషయంలో పటిష్ట చర్యలకు డీజీపీ ఆదేశించారు. మరింత పటిష్టంగా సీఎం చంద్రబాబు భద్రతా చర్యలు ఉండాలని ఇంటలిజెన్స్ అండ్ సెక్యూరిటీ వింగ్ అధికారులకు డీజీపీ తెలిపారు.సెక్యురిటీ ప్రొటోకాల్స్ పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ఎక్కడా రాజీ పడవద్దని అధికారులకు సూచించారు. జన సమూహంలోకి ముఖ్యమంత్రి వెళుతున్న సమయంలో పాటించాల్సిన నిబంధనలు, ప్రత్యేక ఏర్పాట్లపై దృష్టి పెట్టాలని జిల్లా ఎస్పీలకు ఆదేశాలు జారీ చేశారు. భద్రతా చర్యల విషయాన్ని ఉన్నతాధికారులు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. సామాన్య ప్రజలు, కార్యకర్తలకు ఇబ్బంది కలగకుండా అవసరమైన మేర భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సీఎం సూచించారు.

## వారం - వర్జ్యం

తేది : 10-05-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్ల పక్షం
త్రయోదశి సా.5.30
చిత్త రా.3.15
వర్జ్యం ఉ.9.33-11.21
దు.తె.5.39-ఉ.7.18
శుభసమయం :ఉ.7.50-8.30
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** నూతన పరిచయాలు పెరుగుతాయి. ఆత్మయుల నుండి శుభ ఆహ్వానాలు అందుతాయి.

**వృషభం :** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. భూవివాదాలు తీరి నూతన ఒప్పందాలు చేసుకుంటారు.

**మిథునం:** వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.ఉద్యోగాలలో ఉత్సాహ వంతంగా ఉంటుంది. వస్తు, వస్త్రాల లాభాలు.

**కర్కాటకం:** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

**సింహం:** పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**కన్య :** వ్యాపారాలలో ఒడిదుడుకులు ఎదురైన అధిగమిస్తారు. ఉద్యోగాలలో ఒత్తిడులు ఎదురై చికాకులు పెడతాయి.

**తుల :** పాతబాకీలు వసూలవుతాయి. పనులలో విజయం సాధిస్తారు. ఆస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు.

**వృశ్చికం:** శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలు మరింత విస్తరిస్తారు. వస్తులాభం.

**ధనుస్సు:** ఉద్యోగాలలో చికాకులు తొలుగుతాయి. సంతానం నాకు నూతన ఉద్యోగ, విద్యావకాశాలు పొందుతారు.

**మకరం:** ఆత్మీయులతో కలిసి ఆనందంగా గడుపుతారు. విందు, వినోదాలు, శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**కుంభం:** వివాదాలకు దూరంగా వుండండి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**మీనం :** ఉద్యోగాలలో గందరగోళం తొలుగుతుంది. ఋణబాధలు ఎదురై చికాకులు పెడతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



## తెలుగు జవాను మురళీ నాయక్ వీర మరణాన్ని జాతి మరచిపోదు

**- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** ఆపరేషన్ సిందూర్ లో వీర మరణం పొందిన జవాన్ మురళీ నాయక్ గారి త్యాగాన్ని భారత జాతి ఎన్నడూ మరచిపోదని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు.ఆ మేరకు డి.సీఎంవో కార్యాలయం నుంచి ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు.జమ్ము కశ్మీర్ సరిహద్దుల్లో శత్రు మూకలతో పోరాడి వీర మరణం పొందిన భారత జవాన్ మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. శ్రీ సత్యసాయి జిల్లా కల్లి తండాకు చెందిన ఈ యువ జవాన్ దేశ రక్షణకు అంకితమై, సమర భూమిలో అమరులయ్యారు. ఈ వీరుడి తల్లిదండ్రులు జ్యోతి బాయి, శ్రీరామ్ నాయక్‌కు ఇతర కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆ కుటుంబానికి భరోసా ఇస్తుందన్నారు. నాయక్ కుటుంబాన్ని తప్పని సరిగా తాను కలుసుకుంటానన్నారు. యుద్ధంలో అయిదుగురు శత్రుమూకలను మట్టుపెట్టిన మురళీనాయక్ నేటి తరానికి ఆదర్శనీయం, స్ఫూర్తిదాయకం కావాలన్నారు.

# చిరుధాన్యాలు ఆరోగ్యకరం



చిరుధాన్యాల స్టాల్స్‌ను పరిశీలిస్తున్న డిఆర్‌డిఏ పిడి

**- ముగిసిన శిక్షణా కార్యక్రమం**

**-హాజరైన 9 జిల్లాల మిల్లెట్స్ ఉత్పత్తుల రైతులు**

**.తొట్లంబేడు, మే 9 ప్రభాతవార్త** చిరుధాన్యాలు అంటే తెలుగులో మిల్లెట్స్ అని పేర్కొనవచ్చును ఇవి భారతదేశంలోని అనేక ప్రాంతాల్లోముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణాలో ప్రధాన ఆహారంగా ఉన్న చిన్న పోషకమైన ధాన్యాల సమూహాన్ని సూచిస్తుంది ఈ చిరుధాన్యాలు వాటి ఆరోగ్య ప్రయోజనాలకు ప్రసిద్ధిచెందాయి. మరియు బియ్యానికి ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా ప్రజాధరణ పొందుతున్నాయి. వీటికి సంబంధించి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని విస్తరణ శిక్షణ కేంద్రం(ఈటీసి)లో 9 జిల్లాలైన కడప, కర్నూలు, చిత్తూరు, అన్నమయ్య, సత్యసాయి, అనంతపురం, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన చిరుధాన్యాల ఉత్పత్తి దారులు రైతులు, ప్రొసెసర్లు, సెర్ప్ అధికారులు హాజరయ్యారు. రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం నాటితో ముగిసింది. కార్యక్రమానికి డిఆర్‌డిఏ పిడి టిఎన్.శోభన్‌బాబు అధ్యక్షత వహించారు. చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, జొన్నలు, జొన్న ఖార్, కొర్రలు, ఊదలు, అరికెలు, సామెల్లో పోషక విలువలకు ప్రసిద్ధిచెందిన మిల్లెట్స్ అని అన్నారు. ఈసందర్భంగా డిఆర్‌డిఏ పిడి టిఎన్.శోభన్‌బాబు మాట్లాడుతూ నేటి ప్రపంచంలో పాలిషింగ్ బియ్యం, ఇతర కల్తీ పదార్థాలు తీసుకోవడం వల్ల ప్రజలు పలురకాల ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు వ్యాధులకు గురవుతున్నా రనారు. చిరుధాన్యాలతో ఆరోగ్య ప్రయోజనాలు సమృద్ధిగా ఉంటాయని తెలిపారు. చిరుధాన్యాలు ఫైబర్, ప్రొటీన్, ఐరన్, కాల్షియం, మరియు ఇతర ముఖ్యమైన ఖనిజాలు వంటి పోషకాలతో నిండి ఉంటాయన్నారు. ఇవి జీర్ణక్రియకు ఎంతో సహాయపడి మలబద్ధకాన్ని నివారిస్తుందన్నారు. రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుందన్నారు. ఇది మధుమేహం ఉన్న వారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అంతేకాకుండా చిరుధాన్యాలలో కేలరీలు తక్కువగా మరియు ఫైబర్ ఎక్కువగా ఉంటాయి. ఇది కడుపు నిండిన భావనను పెంపొందించడానికి మరియు బరువు తగ్గడానికి సహాయపడుతుందన్నారు. చిరుధాన్యాలు ముఖ్యంగా రాగులు, బలమైన ఎముకలకు అవసరమైన కాల్షియం యొక్క మంచి మూలం అన్నారు. రెండు రోజుల పాటు జరిగిన శిక్షణ తరగతుల్లో 9 జిల్లాలకు చెందిన సుమారు 90 మంది శిక్షణ కార్యక్రమానికి హాజరవగా 40రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. చిరుధాన్యాలతో తయారుచేసిన వంటకాలను రుచి చూపించారు. అంతేకాకుండా పాత్రికేయులకు కూడా అందించి రుచిచూశారు. జి-20 సదస్సుకు హాజరైన వారికి చిరుధాన్యాల రుచికర ఆహారం:- ఇటీవల హైదరాబాదులో జరిగిన జి-20 సదస్సుకు హాజరైన ప్రతినిధులకు మిల్లెట్స్ బ్యాంకు సీఈఓ విశాలరెడ్డి, అంతర్జాతీయ న్యూట్రిషన్ స్పెషలిస్టు హిమాంసులు హాజరై వారికి చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారపదార్థాలను తయారు చేసి అందరి మన్ననలు పొందారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని వీటిని తయారు చేయడంతో ఎక్కువ ఆదాయం పొందవచ్చన్నారు. ముఖ్యంగా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందటంలో చిరుధాన్యాల ఉత్పత్తులను ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి శోభన్‌బాబు, ఈటిసి ప్రిన్సిపల్ నాగపద్మజ, అడిషనల్ డైరెక్టర్ సరళ, ప్రాజెక్టు మేనేజర్ బి.శ్రీనివాస్, జెపిఈ.మూర్తి, డిపిఎం లక్ష్మీహంద్, టి.ధనంజయరెడ్డి మరియు వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన మహిళలు హాజరయ్యారు.

# సిబిఐ విచారణకు హాజరైన సజ్జల, అవినాశ్

## టిడిపి కార్యాలయంపై దాడి కేసు



మీడియాతో మాట్లాడుతున్న వైకాంగ్రెస్‌పార్టీ నేత సజ్జల

**విజయవాడ,మే 9,ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాంగ్రెస్ పార్టీ నేతసజ్జల రామకృష్ణారెడ్డి సిబిఐ విచారణకు హాజరయ్యారు.వైకాపా ప్రభుత్వ హయాంలో మంగళగిరి టిడిపి కార్యాలయంపై జరిగిన దాడికి సంబంధించి ఆయనపై కేసు నమోదైంది. ఈ క్రమంలో గుంటూరు సిఐడీ ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. సజ్జలతో పాటు దేవినేని అవినాష్ విచారణకు వచ్చారు. సిఐడీ కార్యాలయం వద్దకు మాజీ మంత్రులు అంబటి రాంబాబు,విడదల రజని,ఎంఎల్సీ లేళ్ల అప్పిరెడ్డి వచ్చారు. కోర్టు రోడ్డు వద్దే సజ్జల వాహనాన్ని పోలీసులు నిలిపివేశారు. దీంతో అక్కడి నుండి సిఐడి కార్యాలయానికి ఆయన నడుచుకుంటూ వచ్చారు. విచారణ నేపథ్యంలో అక్కడ పోలీసులు మోహరించారు.విచారణ అనంతరం రాష్ట్రంలో కూటమి సర్కార్ పక్షం ప్రకారం వ్యవస్థీకృత బెదిరింపుల సృష్టిస్తోందని వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర సమన్వయకర్త, పీఏసీ కన్వీనర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. అసమర్థ పాలనతో ఎన్నికల హామీలను అమలు చేయలేక ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో తప్పుడు కేసులు పెట్టి వైయస్ఆర్‌సీపీని భయపెట్టాలనుకోవడం చంద్రబాబు అవివేకమని అన్నారు. ఇంకా ఆయనేమన్నారంటే...టీడీపీ కార్యాలయంపై దాడి కేసు ఆరోపణలపై పోలీసులు దర్యాప్తుకు సహకరించాలనే ఉద్దేశంతో బాధ్యతగల పౌరుడిగా సిఐడీ కార్యాలయానికి రావడం జరిగింది. దాడి జరిగిన సమయంలో నేను ఉప ఎన్నిక ప్రచారంలో ఉన్నాను. ఈ విషయం గతంలో విచారణకు హాజరైనప్పుడే చెప్పడం జరిగింది. ఈరోజు కూడా విచారణ సందర్భంగా నన్ను అడిగినప్పుడు మళ్లీ ఇదే విషయం చెప్పాను. దానికి సంబంధించిన ఆధారాలు గతంలోనే పోలీసులకు కూడా అందజేయడం జరిగింది. మీ సూచనల ప్రకారమే జరిగిందా అని అడిగినప్పుడు.. కోట్ల మంది ప్రజాభిమానం ఉన్న జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు టీడీపీ నాయకుడు పట్టాభిరాం ఆయనను అసభ్యంగా దూషించడంపై చాలా ఆవేదన కలిగింది. ఆక్రోశం వచ్చింది. అంత అసభ్యకరంగా చెప్పలేని రీతిలో మాట్లాడినప్పుడు దీనికోసమా రాజకీయాల్లో ఉన్నాం అనే బాధ కలిగింది.దాడులకు ప్రతిదాడులే పరిష్కారం అని మాత్రం ఎప్పటికీ మేం అనుకోలేదు.

# కౌలు రైతుల సంక్షేమానికి కొత్త చట్టం చేయాలి

## సిఎంకు సిపిఐ నేతల విజ్ఞప్తి



సిఎం చంద్రబాబుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

**అమరావతి, మే9.,:** రాష్ట్రంలో కౌలు రైతుల సంక్షేమం కోసం సమగ్రమైన నూతన కౌలుచట్టాన్ని తీసుకురావాలని సీపీఐ నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబును సచివాలయంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఆ పార్టీ నేతలు జల్లి విల్సన్, ముప్పాళ్ల నాగేశ్వరరావు కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి,మాజీఎంఎల్‌ఏ రామకృష్ణ నేడు మీడియాకు వివరించారు. రాష్ట్రంలో అకాల వర్షాలకు తడిసి రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధర ప్రకారమే కొనుగోలు చేయాలని, వర్షాలకు దెబ్బతిన్న ఉద్యాన పంటలకు అందించే పరిహారాన్ని పెంచాలని సీఎం చంద్రబాబును సీపీఐ నాయకులుకోరారు. ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టే అన్నదాత పథకాన్ని సొంతభూమి లేని కౌలు రైతులకు కూడా వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు సేవలందిస్తున్న ఆర్డీటీకి విదేశాల నుంచి వచ్చే నిధుల వినియోగానికి సంబంధించిన ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్‌ను కేంద్రం నిలిపేసిందని, దీని పునరుద్ధరణకు చొరవ తీసుకోవాలని కోరారు. సీపీఐ నేతలు తన దృష్టికి తీసుకొచ్చిన అంశాలపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు.

# అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణను ఫోన్లో పరామర్శించిన సిఎం చంద్రబాబు



అంబికా లక్ష్మీనారాయణ( ఫైల్ ఫోటో)

**అనంతపురం, మే 9, (ప్రభాతవార్త బ్యూరో)** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఫోన్ లో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ని పరామర్శించి ధైర్యంగా వుండాలని,గాయపడిన మీ బావ మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కు తీసుకు వెళ్ళాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు ప్రభుత్వమే చేస్తుందని సీఎం తెలియజేసినట్లు ఎంపీ ప్రత్యేకంగా మీడియా కు తెలియజేశారు. రేపు ఉదయం రెండు చార్టెడ్ ఫ్లైట్స్ డెహ్రాడూన్ కు పంపుతామని ఒక దాంట్లో బాడీ ని,మరొకదాంట్లో పేషంట్ ని తీసుకొని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కి రావాలని సీఎం సూచించారు. ఈ సందర్భంగా ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో అండగా నిలిచిన రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడుకు సర్వదా రుణ పడి ఉంటామని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మి నారాయణ ఇతర కుటుంబ సభ్యులు తెలియజేశారు.. ఇటీవల పర్యాటక ప్రాంతాలు చూసేందుకు వెళ్లిన సందర్భంగా డెహ్రాడూన్ లో హెలికాప్టర్ కూలిన సంఘటనలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సోదరి చనిపోగా ఆయన బావ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే.. ఈ సంఘటనపై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ఫోన్లో ఎంపీ తో మాట్లాడడం గమనించదగ్గ విషయం..

## తెలుగు జవాన్ మురళీనాయక్ త్యాగం మరువలేనిది :హోంమంత్రి వంగలపూడి

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా వదిలేసిన తెలుగు జవాన్ మురళీనాయక్ త్యాగం మరువలేనిదిఅని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. ప్రాణం కన్నా దేశమే గొప్పదన్న ధీరత్వంతో వీరోచితంగా పోరాడిన నాయక్ త్యాగం మరువవలేనిదన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితాడకు చెందిన జవాన్ మురళీనాయక్ యుద్ధభూమిలో మరణించారన్న వార్త దిగ్భ్రాంతికి గురి చేసిందని హోంమంత్రి అన్నారు.జవాన్ మురళీ నాయక్ మృతికి ప్రగాఢ సంతాపం తెలుపుతున్నానన్నారు.అమర జవాన్ మురళీనాయక్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# జెసి ప్రభాకర్ సిఎం మధ్య ఆసక్తికర చర్చ

## జెసి అస్మిత్‌కు ఫ్రీ హ్యాండ్ ఇవ్వాలన్న సిఎం చంద్రబాబు

## సిఎంకు వెండి పళ్లెం బహూకరించిన జెసి



సిఎంకు వెండి పళ్ళెం బహుకరిస్తున్న జేసీ ప్రభాకర్ రెడ్డి, జేసీ అస్మిత్ రెడ్డిలు

**అనంతపురం, మే 9, (ప్రభాతవార్త బ్యూరో)** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చి నప్పుడు ఒక ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం చాయాపురం గ్రామం వద్ద హంద్రీనీవా ప్రధాన కాలవ విస్తరణ పనులు పరిశీలించేందుకు ముఖ్యమంత్రి వచ్చారు. ఈ సందర్భంగా ఛాయాపురంలో ఏర్పాటుచేసిన హెలిపాడ్ లో సీఎంకు పలువురు జిల్లా నేతలు స్వాగతం పలికే సమయంలో తాడపత్రి మాజీ ఎమ్మెల్యే అయిన తాడపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, ప్రస్తుత తాడపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డిలు సీఎంకు వెండి పళ్లెం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఎవరు చేయని విధంగా వినూత్న రీతిలో ముఖ్య నేతలకు వెండి పళ్లెం బహూకరించడం జెసి ప్రభాకర్ రెడ్డి తరచూ చేస్తుంటారు. అందులో భాగంగా సీఎం పర్యటనలో జెసి ప్రభాకర్ రెడ్డి, ఆయన కుమారుడు కలిశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా జేసీ ప్రభాకర్ రెడ్డితో మాట్లాడుతూ ఇక జేసీ అస్మిత్ కు ఫ్రీ హ్యాండ్ ఇవ్వకూడదా అంటూ నవ్వుతూ ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా అన్ని అభివృద్ధి కార్యక్రమాలు అస్మితే చూసుకుంటున్నారు నేను కూడా మిమ్మల్ని కలుద్దామని వచ్చానంటూ తాడపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసి ప్రభాకర్ రెడ్డి సీఎంతో వ్యాఖ్యానించినట్లు సమాచారం. మున్సిపల్ ఛైర్మన్ హోదాలో జేసీ ప్రభాకర్ రెడ్డి ఇక్కడికి వచ్చాడంటూ ఓ టిడిపి నేత సీఎంతో అన్నట్లు తెలియ వచ్చింది.

## తెలుగు జవాన్ మురళి నాయక్ కుటుంబాన్ని ఫోన్‌లో ఓదార్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**అనంతపురం, మే 09 :(ప్రభాతవార్త బ్యూరో)** దేశ సేవలో ప్రాణాలర్పించిన శ్రీ సత్య సాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం పుడగుండ్లతండా గ్రామానికి చెందిన వీర జవాన్ మురళి నాయక్ మరణం పట్ల ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మురళి నాయక్ తల్లిదండ్రులు జ్యోతిబాయి, శ్రీరామ్ నాయక్‌లతో ముఖ్యమంత్రి ఫోన్‌లో మాట్లాడి తన హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేశారు. 25 ఏళ్ల చిన్న వయసులోనే మాతృభూమి కోసం ప్రాణాలర్పించిన మురళి త్యాగాన్ని దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని ఆయన మృతుని కుటుంబానికి హామీ ఇచ్చారు. ధైర్యవంతుడైన కొడుకును కోల్పోయిన బాధను ఏ మాటలు తగ్గించలేవని అంగీకరిస్తూనే, ఈ క్లిష్ట సమయంలో తల్లిదండ్రులు ధైర్యంగా ఉండాలని ముఖ్యమంత్రి కోరారు.

# ఎంఎల్సీగా ప్రమాణం చేసిన కావలి గ్రీష్మ

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలి సభ్యురాలుగా ఇటీవల ఎంపికైన కావలి గ్రీష్మ ఎంఎల్సిగా ప్రమాణం చేశారు. శుక్రవారం రాష్ట్ర అసెంబ్లీ భవనంలోని శాసన మండలి అధ్యక్షులు ఛైర్మన్ కొయ్యే మోషన్ రాజు వారి చాంబరులో ఆమెతో శాసన మండలి సభ్యురాలుగా ప్రమాణం చేయించారు. అనంతరం శాసన మండలి నియ౦ని బ౦ధ్ న ల క్ ౦ సంబంధించిన కిట్ ను ఛైర్మన్ మోషేన్ రాజు ఎంఎల్సి గ్రీష్మకు అం దించారు. ఈకార్య క్రమంలో గ్రీష్మ తల్లి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకరు రాష్ట్ర శాసన సభ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర,శాసన మండలి సభ్యురాలు గ్రీష్మ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రీష్మ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో దుష్టపాలన అంతమయి చంద్రబాబు నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు.ఆయన నేతృత్వంలో పనిచేసే అవకాశం లభించిందన్నారు. ప్రభుత్వ విధానాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుని వెళ్తానన్నారు.



ఎంఎల్సీగా గ్రీష్మ మండలి అధ్యక్షులు ఛైర్మన్ మోషన్ రాజు సమక్షంలో సంతకం చేస్తున్న దృశ్యం

# దక్షిణాది నుంచి తూర్పు వెళ్లే రైళ్లు నెలాఖరు వరకు పొడిగింపు

**గుంతకల్లు రైల్వే,మే 9,ప్రభాతవార్త** ప్రస్తుత వేసవి సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలుగు రాష్ట్రాల మీదుగా దక్షిణాది రాష్ట్రాల నుంచి తూర్పు వెళ్లే రైలు సర్వీసులను జూన్ వరకు పొడిగించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. షాలిమార్ నుంచి చెన్నై సెంట్రల్ వెళ్లే నెంబర్ 02841ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19నుంచి జూన్ 30వరకు పొడిగించారు. ఈ రైలు ప్రతి సోమవారం సాయంత్రం 6.30గటలకు షాలిమార్ నుంచి బయలుదేరి మంగళవారం రాత్రి 11.30గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో చెన్నై సెంట్రల్ నుంచి షాలిమార్ వెళ్లే నెంబర్ 02842ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 21నుంచి జూలై 7వరకు పొడిగించారు. ఈ రైలు ప్రతి బుధవారం తెల్లవారుజామున 4.30గంటలకు చెన్నై సెంట్రల్ నుంచి బయలుదేరి గురువారం రాత్రి 11.20గంటలకు షాలిమార్ చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ రైళ్లు తెలుగు రాష్ట్రాల్లో విజయనగరం,దువ్వాడ,రాజమండ్రి, విజయవాడ,గూడూరు స్టేషన్లతో పాటు పశ్చిమ బెంగాల్,ఒరిస్సా రాష్ట్రాలలోని ముఖ్యమైన స్టేషన్లలో నిలుస్తాయి. అలాగే సాంత్రగచ్చి నుంచి యశ్వంత్‌పూర్ వెళ్లే నెంబర్ 02863 ఏసి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22నుంచి జూన్ 26వరకు ప్రతి గురువారం మధ్యాహ్నం 12.50గంటలకు సాంత్రగచ్చి నుంచి బయలుదేరి శనివారం తెల్లవారుజామున 12.55గంటలకు యశ్వంత్‌పూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో యశ్వంత్‌పూర్ నుంచి సాంత్రగచ్చి వెళ్లే నెంబర్ 02864ఏసీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈనెల 24నుంచి జూన్ 28వరకు ప్రతి శనివారం తెల్లవారుజామున 4.30గంటలకు యశ్వంత్‌పూర్ నుంచి బయలుదేరి ఆదివారం మధ్యాహ్నం 1.25గంటలకు సాంత్రగచ్చి చేరుకుంటుంది. ఈ రైళ్లు మార్గమధ్యలో పలస,శ్రీకాకుళం, విజయనగరం, కొత్తవలస ,పెందుర్తి,దువ్వాడ, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు,నరసరావుపేట, మార్కాపురం, గిద్దలూరు, నంద్యాల,దోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం, హిందూపురంలతో పాటు పశ్చిమ బెంగాల్,ఒరిస్సా రాష్ట్రాలలోని ముఖ్యమైన స్టేషన్లలో నిలుస్తాయి.


**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

**అమ్మకము కొరకు ముందస్తు ప్రకటన**

**SARFAESI చట్టం 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 లోని రూల్ 8 (6) ప్రకారం జారీ చేయడమైనది.**

టు,

**ఋణగ్రహీత చిరునామా: శ్రీ సాకా లక్ష్మీ నారాయణ,** తండ్రి : శ్రీ సాకా జనార్ధనరావు, డి.నెం.6-60, సాకా వారి వీధి, రామాలయం దగ్గర, సోమేశ్వరం, రాయవరం మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533261. **వేరొక చిరునామా : శ్రీ సాకా లక్ష్మీ నారాయణ,** తండ్రి : జనార్ధనరావు, డి.నెం.7-1 & 7-2, కాపుల రామాలయం దగ్గర, సోమేశ్వరం, రాయవరం మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533261. **శ్రీమతి సాకా వెంకట దుర్గ,** భర్త : శ్రీ సాకా లక్ష్మీ నారాయణ, డి.నెం.6-60, సాకా వారి వీధి, రామాలయం దగ్గర, సోమేశ్వరం, రాయవరం మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533261.

**సర్ / మేడమ్**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 లోని సెక్షన్ 13(12) దీనితో చదువుకోలసిన సదరు రూల్స్‌లోని రూల్ 3 ప్రకారం ఋణగ్రహీతలకు **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారి **తేది.01-07-2022న** జారీచేసిన డిమాండ్ నోటీసులో తెలిపిన విధంగా **తేది.16-06-2022** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.4,40,56,912/-** (అక్షరాల నాలుగు కోట్ల నలభై లక్షల యాభై ఆరు వేల తొమ్మిది వందల పన్నెండు రూపాయలు మాత్రమే) **+ తేది.17.06.2022** నుండి కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు వసూలు నిమిత్తం పైన తెలిపినట్లు 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తెలియజేయడమైనది.

మీరు మొత్తం ఋణాలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సదరు ఆస్తులను సెక్షన్ 13(4) దీనితో సదరు రూల్స్‌లోని రూలు 8(1) ప్రకారం అధీకృత అధికారి సదరు తనఖా ఆస్తిని **తేది.22.09.2022న** స్వాధీనం చేసుకున్నారు. సదరు స్వాధీనత నోటీసును **తేది. 27-09-2022న (ఈనాడు : తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్ (తెలుగు)** మరియు **ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ : తాడేపల్లిగూడెం ఎడిషన్ (ఇంగ్లీష్))** దినపత్రికలలో రూలు 8(2) ప్రకారము ప్రచురించడమైనది.

తనఖా ఉంచిన దిగువ తెలిపిన ఆస్తులపై గల **తేది.01-07-2022న** డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి మొత్తమును ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా చెల్లించవలెను. లేని యెడల సదరు ఆస్తులు విక్రయించుటకు బహిరంగ వేలం కొరకు టెండర్లు / కొటేషన్లు సాధారణ ప్రజానీకం వద్ద నుండి ఆహ్వానించబడును.

**స్థిరాస్తి వివరములు**

**ఆస్తి -1 (ఆర్‌సిసి నిర్మాణంతో గల కమర్షియల్ భూమి) : రామచంద్రాపురం ఎస్ఆర్ఓ వద్ద తేది.01.07.2016న రిజిష్టరు కాబడిన రిజిష్టర్డు సేల్ సర్టిఫికెట్ డాక్యుమెంట్ నెం.3499/2016 ప్రకారం శ్రీ సాకా లక్ష్మీ నారాయణ గారి పేరున కలదు:**

**ఐటమ్ నెం.1:** తూర్పు గోదావరి జిల్లా, రాయవరం మండలం, రామచంద్రాపురం సబ్-రిజిస్ట్రార్, మాచవరం గ్రామ పంచాయితీ ఏరియా, మాచవరం గ్రామ జిరాయితీ వెట్ ఆర్.ఎస్.నెం.122-4 లోని మొత్తం ఎ.0.24 సెంట్లు లేదా 0.096 హెక్టార్ల భూమి. **హద్దులు : తూర్పు** : 251 లింకులు లేదా 161.6 అ॥ల కొవ్వూరి వెంకటరెడ్డి గారి భూమి, **పడమర:** 225 లింకులు లేదా 148.5 అ॥ల దిగువ తెలిపిన రెండవ ఐటమ్ భూమి, **ఉత్తరం :** 90 లింకులు లేదా 59.4 అ॥ల మేడపాటి పేర్రెడ్డి గారి భూమి, **దక్షిణం :** 103 లింకులు లేదా 68.00 అ॥ల సత్తి రామారెడ్డి మరియు మల్లిడి నవ భారతి గార్ల భూమి.

**పైన తెలిపిన ఐటమ్ హద్దులలో ఎ.0.24 సెంట్లు లేదా 0.096 హెక్టార్లు లేదా 1161.6 చ॥గ॥లు లేదా 971.25 చ॥మీ॥ల భూమి అన్నీ ఈజిమెంట్ హక్కులతో, కామన్ దారులు, నీటి సదుపాయాలు మొ॥ వాటితో కలదు.**

**ఐటమ్ నెం.2:** తూర్పు గోదావరి జిల్లా, రాయవరం మండలం, రామచంద్రాపురం సబ్-రిజిస్ట్రార్, మాచవరం గ్రామ పంచాయితీ ఏరియా, మాచవరం గ్రామ జిరాయితీ వెట్ ఆర్.ఎస్.నెం.122-5 లోని మొత్తం ఎ.0.17 సెంట్లు లేదా 0.069 హెక్టార్ల భూమి. **హద్దులు : తూర్పు** : 225 లింకులు లేదా 148.05 అ॥ల ఇక్కడ గల 1వ ఐటమ్ భూమి, **పడమర** : 205 లింకులు లేదా 135 అ॥ల సత్తి ముత్తారెడ్డి గారి భూమి, **ఉత్తరం** : 87 లింకులు లేదా 57.4 అ॥ల మేడపాటి పేర్రెడ్డి గారి భూమి, **దక్షిణం** : 73 లింకులు లేదా 48.02 అ॥ల సత్తి రామారెడ్డి మరియు మల్లిడి నవ భారతి గార్ల భూమి.

**పైన తెలిపిన ఐటమ్ హద్దులలో ఎ.0.17 సెంట్లు లేదా 0.069 హెక్టార్లు లేదా 822.8 చ॥గ॥లు లేదా 687.96 చ॥మీ॥ల భూమి అన్నీ ఈజిమెంట్ హక్కులతో, కామన్ దారులు, నీటి సదుపాయాలు మొ॥ వాటితో కలదు.**

**ఐటమ్ నెం.3:** తూర్పు గోదావరి జిల్లా, రాయవరం మండలం, రామచంద్రాపురం సబ్-రిజిస్ట్రార్, మాచవరం గ్రామ పంచాయితీ ఏరియా, మాచవరం గ్రామ జిరాయితీ వెట్ ఆర్.ఎస్.నెం.122-9 లోని మొత్తం ఎ.0.19 సెంట్లు లేదా 0.076 హెక్టార్ల భూమి. **హద్దులు : తూర్పు** : 180 లింకులు లేదా 118.08 అ॥ల సత్తి సాటి ముత్తారెడ్డి గారి భూమి, **పడమర** : 169 లింకులు లేదా 111.05 అ॥ల ఇక్కడ గల ఐటమ్ నెం.4, **ఉత్తరం** : 109 లింకులు లేదా 78.05 అ॥ల మేడపాటి పేర్రెడ్డి గారి భూమి, **దక్షిణం** : 113 లింకులు లేదా 74.06 అ॥ల 5వ ఐటమ్ భూమి.

**పైన తెలిపిన ఐటమ్ హద్దులలో ఎ.0.19 సెంట్లు లేదా 0.076 హెక్టార్లు లేదా 919.6 చ॥గ॥లు లేదా 768.90 చ॥మీ॥ల భూమి అన్నీ ఈజిమెంట్ హక్కులతో, కామన్ దారులు, నీటి సదుపాయాలు మొ॥ వాటితో కలదు.**

**ఐటమ్ నెం.4:** తూర్పు గోదావరి జిల్లా, రాయవరం మండలం, రామచంద్రాపురం సబ్-రిజిస్ట్రార్, మాచవరం గ్రామ పంచాయితీ ఏరియా, మాచవరం గ్రామ జిరాయితీ వెట్ ఆర్.ఎస్.నెం.122-10 లోని మొత్తం ఎ.0.16 సెంట్లు లేదా 0.064 హెక్టార్ల భూమి. **హద్దులు : తూర్పు:** 169 లింకులు లేదా 111.05 అ॥ల సత్తి సాటి ముత్తారెడ్డి గారి భూమి, **పడమర** : 159 లింకులు లేదా 105.00 అ॥ల గయ్యాలు కాలువ, **ఉత్తరం** : 103 లింకులు లేదా 68.00 అ॥ల మేడపాటి పేర్రెడ్డి గారి భూమి, **దక్షిణం** : 96 లింకులు లేదా 63.04 అ॥ల 5వ ఐటమ్ భూమి.

**పైన తెలిపిన ఐటమ్ హద్దులలో ఎ.0.16 సెంట్లు లేదా 0.064 హెక్టార్లు లేదా 774.4 చ॥గ॥లు లేదా 647.50 చ॥మీ॥ల భూమి అన్నీ ఈజిమెంట్ హక్కులతో, కామన్ దారులు, నీటి సదుపాయాలు మొ॥ వాటితో కలదు.**

**ఐటమ్ నెం.5:** తూర్పు గోదావరి జిల్లా, రాయవరం మండలం, రామచంద్రాపురం సబ్-రిజిస్ట్రార్, మాచవరం గ్రామ పంచాయితీ ఏరియా, మాచవరం గ్రామ జిరాయితీ వెట్ ఆర్.ఎస్.నెం.122-11 లోని మొత్తం ఎ.1.33 సెంట్లలోని పడమర వైపు గల ఎ.0.53 సెంట్లు లేదా 0.212 హెక్టార్ల భూమి మరియు డి.నెం.లు 7-95 & 7-96లతో గల భవనం. **హద్దులు : తూర్పు** : 176 లింకులు లేదా 116.00 అ॥ల సత్తి రామారెడ్డి మరియు మల్లిడి నవ భారతి గార్ల భూమి, **పడమర** : 174 లింకులు లేదా 115.00 అ॥ల గయ్యాలు కాలువ గట్టు, **ఉత్తరం** : 304 లింకులు లేదా 200.01 అ॥ల సత్తి ముత్తారెడ్డి గారి భూమి కొంతమేర మరియు 3వ మరియు 4వ ఐటమ్‌లు కొంతమేర, 2వ ఐటమ్ భూమి, **దక్షిణం** : 300 లింకులు లేదా 198.00 అ॥ల 6వ ఐటమ్ కొంతమేర మరియు 7వ ఐటమ్ కొంతమేర.

**పైన తెలిపిన ఐటమ్ హద్దులలో ఎ.0.53 సెంట్లు లేదా 0.212 హెక్టార్లు లేదా 2565.2 చ॥గ॥లు లేదా 2144.83 చ॥మీ॥ల భూమి అన్నీ ఈజిమెంట్ హక్కులతో, కామన్ దారులు, నీటి సదుపాయాలు మొ॥ వాటితో కలదు.**

**ఐటమ్ నెం.6:** తూర్పు గోదావరి జిల్లా, రాయవరం మండలం, రామచంద్రాపురం సబ్-రిజిస్ట్రార్, మాచవరం గ్రామ పంచాయితీ ఏరియా, మాచవరం గ్రామ జిరాయితీ వెట్ ఆర్.ఎస్.నెం.122-12/ఏ లోని మొత్తం ఎ.0.51 సెంట్లు లేదా 0.206 హెక్టార్ల భూమి మరియు డి.నెం.లు 7- 95 & 7-96లతో గల భవనం. **హద్దులు : తూర్పు** : 176 లింకులు లేదా 116.00 అ॥ల సత్తి రామారెడ్డి మరియు మల్లిడి నవ భారతి గార్ల భూమి, **పడమర** : 174 లింకులు లేదా 115.00 అ॥ల గయ్యాలు కాలువ గట్టు, **ఉత్తరం** : 304 లింకులు లేదా 200.01 అ॥ల సత్తి ముత్తారెడ్డి గారి భూమి కొంతమేర మరియు 3వ మరియు 4వ ఐటమ్‌లు కొంతమేర, 2వ ఐటమ్ భూమి, **దక్షిణం** : 300 లింకులు లేదా 198.00 అ॥ల 6వ ఐటమ్ కొంతమేర మరియు 7వ ఐటమ్ కొంతమేర.

**పైన తెలిపిన ఐటమ్ హద్దులలో ఎ.0.51 సెంట్లు లేదా 0.206 హెక్టార్లు లేదా 2468.4 చ॥గ॥లు లేదా 2063.90 చ॥మీ॥ల భూమి అన్నీ ఈజిమెంట్ హక్కులతో, కామన్ దారులు, నీటి సదుపాయాలు మొ॥ వాటితో కలదు.**

**పైన తెలిపిన ఐటమ్ నెం.5 & 6 లలో 11653 చ॥అ॥ల ఆర్‌సిసి & ఎసిసి నిర్మాణం కలదు.**

**ఐటమ్ నెం.7:** తూర్పు గోదావరి జిల్లా, రాయవరం మండలం, రామచంద్రాపురం సబ్-రిజిస్ట్రార్, మాచవరం గ్రామ పంచాయితీ ఏరియా, మాచవరం గ్రామ జిరాయితీ వెట్ ఆర్.ఎస్.నెం.122-12/బి లోని మొత్తం ఎ.0.75 సెంట్లలోని పడమర వైపు గల ఎ.0.09.3/4 సెంట్లు లేదా 0.039 హెక్టార్ల భూమి. **హద్దులు : తూర్పు** : 252 లింకులు లేదా 166.03 అ॥ల సత్తి వెంకట రెడ్డి గారి భూమి, **పడమర** : 238 లింకులు లేదా 157.00 అ॥ల ఇక్కడ గల 6వ ఐటమ్, **ఉత్తరం** : 20 లింకులు లేదా 13.00 అ॥ల ఇక్కడ గల 5వ ఐటమ్, **దక్షిణం** : 60 లింకులు లేదా 39.06 అ॥ల వెల్లూరు నుండి మాచవరం రోడ్డు.

**పైన తెలిపిన ఐటమ్ హద్దులలో ఎ.0.09.3/4 సెంట్లు లేదా 0.039 హెక్టార్లు లేదా 471.9 చ॥గ॥లు లేదా 394.57 చ॥మీ॥ల భూమి అన్నీ ఈజిమెంట్ హక్కులతో, కామన్ దారులు, నీటి సదుపాయాలు మొ॥ వాటితో కలదు.**

**పైన తెలిపిన 7 ఐటమ్‌ల మొత్తం ఎ.1-89.3/4 సెంట్లు లేదా 0.7641 హెక్టార్లు లేదా 9183.9 చ॥గ॥లు లేదా 7678.91 చ॥మీ॥ల భూమి అన్నీ ఈజిమెంట్ హక్కులతో, కామన్ దారులు, నీటి సదుపాయాలు మొ॥ వాటితో కలదు.**

**ఆస్తి -2 :** బ్లాక్ నెం.7, ఆర్.ఎస్.నెం.318/5, డి.నెం.7-1&7-2 లోని 191.77 చ॥గ॥ల విస్తీర్ణంలో గల నివాస భవనం (జిఎఫ్ + ఎఫ్ఎఫ్ + ఎస్ఎఫ్) యావత్తు ఆస్తి షెడ్యూలు డాక్యుమెంట్ ప్రకారం దిగువ తెలుపబడినది.

**రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.5266/2014, తేది.18.12.2014 ప్రకారం:** తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రాపురం సబ్-రిజిస్ట్రీ, సోమేశ్వరం పంచాయితీ, బ్లాక్ నెం.7, సోమేశ్వరం గ్రామం, ఆర్.ఎస్.నెం.318/5 లోని (65.77 + 11.67 = 77.44) చ॥గ॥ల విస్తీర్ణంలో సంబంధిత డి.నెం.7-1తో గల ఆస్తి. **హద్దులు : ఐటమ్ నెం.1: తూర్పు** : సాకా జానకి రామయ్య గారికి చెందిన గోడ, **పడమర** : ప్రభుత్వ వీధి, **దక్షిణం:** ఈ ఇంటికి మరియు గరగ జానకమ్మ గారికి చెందిన ఇంటికి ఉమ్మడి గోడ, **ఉత్తరం** : ఇక్కడ గల ఐటమ్ నెం.2 కొంతమేర మరియు పెద్దిరెడ్డి జానకమ్మ గారికి చెందిన స్థలం కొంతమేర.

**పైన తెలిపిన హద్దులలో 65.77 చ॥గ॥ల విస్తీర్ణం అన్నీ ఈజిమెంట్ హక్కులతో కలదు.**

**ఐటమ్ నెం.2: తూర్పు** : సాకా జానకి రామయ్య గారికి చెందిన గోడ, **పడమర** : పెద్దిరెడ్డి జానకమ్మ గారికి చెందిన స్థలం, **దక్షిణం:** ఇక్కడ గల ఐటమ్ నెం.1, **ఉత్తరం** : ఉమ్మడి గోడ దారి మార్గం.

**పైన తెలిపిన హద్దులలో 11.67 చ॥గ॥ల విస్తీర్ణం అన్నీ ఈజిమెంట్ హక్కులతో కలదు.**

**రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.4638/2015, తేది.24.09.2015 ప్రకారం:** తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రాపురం సబ్-రిజిస్ట్రీ, సోమేశ్వరం పంచాయితీ, బ్లాక్ నెం.7, సోమేశ్వరం గ్రామం, ఆర్.ఎస్.నెం.318/5 లోని (65.77 + 11.67 = 77.44) చ॥గ॥ల విస్తీర్ణంలో సంబంధిత డి.నెం.7-1తో గల ఆస్తి. **హద్దులు : ఐటమ్ నెం.1: తూర్పు** : సాకా జానకి రామయ్య గారికి చెందిన గోడ, **పడమర** : ప్రభుత్వ వీధి, **దక్షిణం** : ఈ ఇంటికి మరియు గరగ జానకమ్మ గారికి చెందిన ఇంటికి ఉమ్మడి గోడ, **ఉత్తరం** : ఇక్కడ గల ఐటమ్ నెం.2 కొంతమేర మరియు పెద్దిరెడ్డి జానకమ్మ గారికి చెందిన స్థలం కొంతమేర.

**పైన తెలిపిన హద్దులలో 65.77 చ॥గ॥ల విస్తీర్ణం అన్నీ ఈజిమెంట్ హక్కులతో కలదు.**

**ఐటమ్ నెం.2: తూర్పు** : సాకా జానకి రామయ్య గారికి చెందిన గోడ, **పడమర** : పెద్దిరెడ్డి జానకమ్మ గారికి చెందిన స్థలం, **దక్షిణం** : ఇక్కడ గల ఐటమ్ నెం.1, **ఉత్తరం** : ఉమ్మడి గోడ దారి మార్గం.

**పైన తెలిపిన హద్దులలో 11.67 చ॥గ॥ల విస్తీర్ణం అన్నీ ఈజిమెంట్ హక్కులతో కలదు.**

**రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.1284/2016, తేది.18.03.2016 (36.89 చ॥గ॥లు) ప్రకారం:** తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రాపురం సబ్-రిజిస్ట్రీ, సోమేశ్వరం పంచాయితీ, బ్లాక్ నెం.7, సోమేశ్వరం గ్రామం, ఆర్.ఎస్.నెం.318/5 లోని 36.89 చ॥గ॥ల విస్తీర్ణంలో సంబంధిత డి.నెం.7-1 మరియు 7-2లతో గల ఆస్తి. **హద్దులు : తూర్పు** : సాకా జానకి రామయ్య గారికి చెందిన గోడ, **పడమర** : ప్రభుత్వ వీధి, **దక్షిణం** : అమ్మకందారు నుండి సుంకర శ్రీనివాసరావు గారు కొనుగోలు చేసిన స్థలం, **ఉత్తరం** : కొనుగోలుదారుని స్థలం.

**పైన తెలిపిన హద్దులలో 36.89 చ॥గ॥ల విస్తీర్ణం అన్నీ ఈజిమెంట్ హక్కులతో కలదు.**

**మొత్తం 191.77 చ॥గ॥ల స్థలం అందు గల నివాస (GF + FF + SF) భవనం.**

తేది: 06-05-2025
ప్రదేశం: విశాఖపట్నం

సం/- అధీకృత అధికారి,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

వార్త

తమకు తెలినిదాని తెలుసని విధంగా వ్యవహరించేవారు తమకు తెలిసిన విషయాల్ని గురించి కూడా తెలీనివారుగా పరిగణించబడతారు.

-తిరువళ్లువర్

# సముచిత నిర్ణయం

న్యాయవ్యవస్థకు చెదలు పట్టున్నాయని సందేహం వచ్చినప్పుడల్లా దాని మానమర్యాదలు కాపాడాల్సిన బాధ్యత ఆ వ్యవస్థ అత్యున్నత నిర్వాహకుల మీదనే ఉంటుంది. ఈ మధ్యనే ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో పెద్దఎత్తున కరెన్సీ కట్టలు తగులబడిఉండగా పోలీసులకు చిక్కాయి. అది జరిగిన వెంటనే ఆ జడ్జి దోష మెంత? అంత పెద్ద మొత్తంలో అంత డబ్బు ఆయన ఇంట్లోకి ఎలా వచ్చింది? ఎక్కడి నుంచి వచ్చింది? అన్న అంశాలపై దేశమంతటా చర్చనీయాంశమైనా సదరు న్యాయమూర్తిని సస్పెండ్ చేయకుండా కేవలంఅలహాబాద్ హైకోర్టుకు బదలీ చేయడం పట్ల ఎన్నో అనుమానాలు వ్యక్తమయ్యాయి. సందేహ లబ్ధి కింద సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా వెంటనే తీసుకున్న నిర్ణయాలపై అలహాబాద్ హైకోర్టు బార్అసోసియేషన్ సభ్యులు స్పందిస్తూ ఆ బదిలీపై విమర్శలు కూడాచేశారు. తమ హైకోర్టు ఏమీ 'చెత్త బుట్ట' కాదని యశ్వంత్‌వర్మను తమ హైకోర్టుకు పంపవద్దని నిరసన వ్యక్తం చేశారు. అయినా వర్మ అలహాబాద్ హైకోర్టులోనే పనిచేయాల్సి వచ్చింది. ఇలాంటి న్యాయమూర్తులు తమకు వద్దనే వద్దంటూ బార్ అసోసియేషన్ సుప్రీం కొలీజియానికి అభ్యర్థన పంపుకున్న విషయం విదితమే. తాజాగా జస్టిస్ యశ్వంత్ వర్మపై వచ్చిన నగదు కట్టలు అభియోగాలను సుప్రీంకోర్టు కమిటీ ధృవీకరించగా సుప్రీం చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా కోరగా దాన్ని వర్మ తిరస్కరించినట్లు సమాచారం. ఈ యేడాది మార్చి 14న వర్మ అధికారిక నివాసంలో అగ్ని ప్రమాదంలో భారీ ఎత్తున నగదు కట్టలు బయటపడ్డాయి. కొందరు బయట వ్యక్తులు అగ్ని మాపక ప్రమాదాన్ని నిరోధించే ప్రయత్నంలో కాలుతున్న నోట్ల కట్టలుకనపడగా పోలీసులకు సమాచారం అందించారు. ఈ అంశంపై ఆదిలోనే సీరియస్ నిర్ణయమేమీ తీసుకోకపోవడం విమర్శలకు గురైనా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నిదానించి ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తులు, జస్టిస్ అనుశివరామన్‌లతో కమిటీ నియమించింది. 50 మంది సాక్షుల వాంగ్మూలాన్ని నమోదు చేసిన అనంతరం న్యాయమూర్తిపై వచ్చిన అభియోగాలను నిర్ధారిస్తూ నివేదిక సమర్పించింది. తనపై వచ్చిన ఆరోపణలను వర్మ ఖండిస్తూనే ఉన్నారు. అభియోగాల నేపథ్యంలో బదిలీ చేసినప్పటికీ వర్మకు బాధ్యతలే కేటాయించలేదు. కాగా కమిటీ నివేదికతోపాటు న్యాయమూర్తి వర్మ సమాధానాన్ని జతపరచి రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి పంపారు. ఈ అంశంలో ఒక విధానాన్ని అనుసరించడం ద్వారా ప్రధాన న్యాయమూర్తి న్యాయవ్యవస్థ ప్రతిష్టను కాపాడే ప్రయత్నం చేస్తున్నట్లు విశదం. నివేదిక తర్వాత సిజెఐ జస్టిస్ యశ్వంత్ వర్మను రాజీనామా కోరగా ఆయన తిరస్కరించారు.


నిజానికి చెప్పాలంటే యశ్వంత్‌వర్మ ఉదంతం తర్వాతనే ఒక్కసారిగా హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఆస్తిపాస్తుల వివరాలను స్వచ్ఛందంగా సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో నెలరోజుల్లోగా పొందుపరచాలని సుప్రీంకోర్టు ఫుల్ బెంచ్ సమావేశంలో తీర్మానించింది. అంటే విశ్వసనీయత, పారదర్శకతతో కూడిన న్యాయవ్యవస్థను రూపొందించాలన్న తపన నేపథ్యంలోనే ఇదంతా జరిగింది. న్యాయమూర్తుల ఆస్తుల వెల్లడి ప్రక్రియ అంతకు ముందే ఉన్నా మళ్లీ ఆ వెబ్‌సైట్ పునరాగమనం సంతోషదాయకమే. కాగా రెండు రోజుల క్రితమే ఈ మేరకు న్యాయమూర్తులందరూ సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో తమ ఆస్తుల వివరాలు పొందుపరిచారు. రాబడి కన్నా ఆస్తులు ఎక్కువగా ఉన్న సందర్భాల్లో ఇతర ఉద్యోగుల వలె న్యాయమూర్తులు కూడా సంబంధిత విచారణలను ఎదుర్కొవల్సిందే. యశ్వంత్ వర్మ ఇంట్లో కి ఆ నగదు కట్టలు ప్రత్యక్షం వెనుక ప్రస్తుతంమనముందు ఎలాంటి సమాధానాలూ లేకున్నా, సాక్షాత్తూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి తాను పరిశీలించిన అంశాలను అవిశ్వాస తీర్మాన ప్రక్రియ కోసం రాష్ట్రపతి, ప్రధానికి ఇచ్చారంటే జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటిలోని నోట్ల కట్టల లోగుట్టు సభ్య సమాజానికి తెలియాల్సిందే. అవి అవిశ్వాస తొలగింపు ప్రక్రియలో కానీ తెలిసే అవకాశం లేదు. న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్య మూలస్తంభాలుగా చెప్పబడే వాటిలో ఒక విశిష్టస్థానంలో ఉంది కనుక అందులోని భాగస్వాములంతా చట్ట,న్యాయ పరిధిలో వ్యవహరించాల్సిందే. లేదంటే వారి మీద ఇలాంటి అభియోగాలే వస్తాయి. వాటిని ఎంతటివారైనా ముందుకొచ్చి నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సిందే. ఇలాంటి అభియోగాలు వచ్చిన సందర్భాలలో న్యాయమూర్తిగా వైదొలగాలని, లేక స్వచ్ఛందంగా పదవీ విరమణ చేయడం, ఇవేమీ కానప్పుడు అవిశ్వాస తీర్మాన ప్రక్రియ ఒక్కటే శరణ్యమని న్యాయవ్యవస్థ విధి విధానాలు చెబుతున్నాయి. ఇంతక్రితం ఇలాంటివి మూడు సందర్భాల్లో న్యాయమూర్తులు తొలగింపు కోసం అభిశంసన తీర్మానాలు చేపట్టబడినవి. దేశంలో అభిశంసనను ఎదుర్కొన్న తొలి న్యాయమూర్తి జస్టిస్ సౌమిత్రా సేన్ కోర్టు రిసివర్ హోదాలో రూ.33.22 లక్షల దుర్వినియోగం చేశారన్న కమిటీ నివేదికపై అభిశంసన తీర్మానాన్ని ఎదుర్కొన్నారు. ప్రక్రియ పూర్తికాకుండానే రాజీనామా చేశారు. ఆదాయ వనరులకు మించి ఆస్తుల కూడబెట్టారన్న అభియోగాలపై పి.డి. దినకరన్ 2011లో అభిశంసన ప్రక్రియకు ముందే రాజీనామా చేశారు. 1993లో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామస్వామిని ఆర్థిక అక్ర మాలకు పాల్పడ్డారు. ఆరోపణలపై ఆయనను దోషిగా తేల్చారు. అయితే తీర్మానం విఫలమైంది. తర్వాత న్యాయమూర్తిగా కొనసాగారు. వాస్తవాలు బయటకు పూర్తిస్థాయిలో రాకపోవడంతో పరువు దక్కింది.

సమకాలికులు ఎప్పుడూ వ్యక్తి ప్రతిభ కన్నా, వ్యక్తినే ఎక్కువగా పొగుడుతారు. ఆ తర్వాత తరంవారే ప్రతిభను గౌరవిస్తారు.



కోల్టన్

ఒక పని అంటే గాని, లేదా దానివల్ల కలిగే ఫలితాలంటే కానీ భయపడి ఆ పని చేయడాన్ని మానుకోవడం చాలా చిన్నతనం.



మహాత్మాగాంధి

## ప్రజావాక్కు



### సంయమనం పాటించాలి

వివాహమైన హిందూ స్త్రీలకు సౌభాగ్య చిహ్నమైన నుదుటి మీది కుంకుమరేఖ కనుమరుగయితే జీవితం సముద్రమే. సమాజంలో అందరిలా తలెత్తుకు తిరగలేని పరిస్థితి అది. పెహల్గామ్ దాడిలో ఉగ్రవాదుల ఉన్మాద దాడిలో భర్తలను కోల్పోయిన వారిని పేపర్లలో, టి.వి.లలో చూస్తుంటే హృదయం ద్రవించక మానదు. వీరి సున్నిత హృదయా వేదన ఆపరేషన్ సింధూరమై ఉగ్రమూకలపై అగ్నివర్షం కురిపించి దాదాపు వందమందిని హతమార్చింది మన భారతదేశం. ఈదాడి కేవలం పాక్‌లోని తొమ్మిది ఉగ్రస్థావరాలపై మాత్రమే విరుచుకుపడింది. సంయమనం పాటించమనే అమెరికా తమ దేశంలో ఉగ్రదాడులు జరిగినప్పుడు ఈ సంయమనం పాటించగలి గిందా? గాయమైన వాడికేబాధఏమిటో తెలుస్తుంది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### పాక్‌కు బుద్ధి చెప్పాలి

యుద్ధంచేయవలసిన అవసరం వచ్చినప్పుడు, గెలుస్తామా? ఓడిపోతామా? అని నిశ్చయించుకొని యుద్ధంలోకి దిగరు అనివార్యమైతేనే యుద్ధంలోకి దిగుతారు. యుద్ధం తర్వాత జరిగేది సంధి మాత్రమే. ఆ సంధి ముందుగా చేసుకుంటే యుద్ధం అనివార్యం అవుతుంది. కాశ్మీర్ విషయంలో చూస్తే ఆర్టికల్ 370రద్దుతో పాక్‌ఆక్రమిత కాశ్మీరుతోపాటు కాశ్మీరు అంతా కూడా ఒక సుందరమైన పర్యాటక రంగంగా తీర్చిదిద్ది భారతదేశానికి పర్యాటక రంగం ద్వారా ఆర్థిక పరిపుష్టి చేకూర్చాలని ప్రధాని మోడీ భావించారు. వారి ఆలోచనలు నూటికి నూరు శాతం నిజం. వారు చేసిన అకృత్యానికి భారతదేశం పాకిస్థాన్ కి బుద్ధి చెప్పవలసి వచ్చింది.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### రైళ్ల సంఖ్యను పెంచాలి

విజయవాడ నుంచి గుంతకల్లు మార్గంలో పగటిపూట చాలా తక్కువసంఖ్యలో రైళ్లునడుస్తున్నాయి. ఈ మార్గంలో ఎక్కువ రైళ్లు నడపవలసిన అవసరం ఉంది. చాలా మంది తరచు తమ పనుల నిమిత్తం విజయవాడకు వెళుతూ ఉంటారు. కావున అధిక రైళ్లు ఈ మార్గంలో నడపాలి. అలాగే పగటిపూట విజయవాడ నుంచి గుంతకల్లుకు ఎక్కువ సంఖ్య రైళ్లు నడుపుటకు చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం అరకొర రైళ్లు నడుపుతున్నారు.

-షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

### మ్యాన్‌హోల్స్ మూతలు పెట్టాలి

దేశంలో అత్యధిక వేగవంతంగా విస్తరిస్తూ ఎన్నో రంగాల్లో ఉపాధి కల్పిస్తున్న నగరాల్లో హైదరాబాద్ ముందు ఉందని చెప్పడంలో అతిశయోక్తికాదు. ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో హైద్రాబాద్ నగరానికి వలసలు పెరిగి జనాభా పెరిగింది. జనాభా తగ్గట్టుగా గృహ వసతి లేక చాలా చోట్ల ఇరుకు గృహాల్లో నివసిస్తున్నారు. ఈ నగరంలో డ్రైనేజీ వ్యవస్థ జనాభాకు తగినట్లుగా నిర్మించుకోవలసివస్తోంది. నిజాం పాలనలో ఎన్నో తోటలు ఉండి పచ్చని ప్రదేశాలు కలిగిన ఉన్న నగరంగా ప్రసిద్ధిగాంచింది. కొద్ది పాటి చిరువానకే ప్రజలు తల్లడిల్లుతున్నారు. పల్లపు ప్రాంతాల్లో డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం, మురికి కాల్వలమ్యాన్‌హోల్ మూత లూ లేకపోవడంవలన చాలామంది కొట్టుకొనిపోవడం జరిగింది. కావున వర్షాకాలంరాక ముందే డ్రైనేజీలో పూడికతీసి, నీరుత్వరగా వెళ్లిపోయే విధంగా చర్యలు చేబడుతూ, మ్యాన్‌హోల్ మూతలూ ఉంచాలి.

-ఆళవందార్ వేణు మాధవ్, హైదరాబాద్

### వికలాంగులకు సౌకర్యాలు కల్పించాలి

విద్యాసంస్థలలోని వికలాంగులైన విద్యార్థుల యొక్క మరియు టీచింగ్ స్టాఫ్ అయినాటీచర్స్ మరియు లెక్చరర్స్ సమస్యలను తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ కొన్నింటికి మినహాయింపులు ఇవ్వాలి. మరికొన్నింటికీ సౌకర్యాలు కల్పించాలి. వికలాంగులైన విద్యార్థులు చదువుకోవడానికి మామూలు విద్యార్థులతో పోటీ పడలేరు. జ్ఞాపకశక్తి తక్కువగా ఉంటుంది. వీరు పరీక్షలు రాయడానికి అరగంట సమయం అధికంగాఉంటుంది. వికలాంగులైన టీచింగ్ స్టాఫ్ రవాణా సౌకర్యాలతో సమయపాలన కొంత వేసులుబాటు ఇవ్వాలి. అంధులు టీచర్ లెక్చరర్స్‌ను చిన్న అక్షరాలు చూడలేరు. విద్యార్థుల సహకారం చాలా అవసరం. రిజల్ట్ కారణంగా కొంతమంది వికలాంగులైన టీచింగ్ స్టాఫ్ పై వివక్షత చూపుతున్నారు. షోకాజ్ నోటీసులు ఇస్తున్నారు.

-రాపాక రవీందర్, జనగాం

### ఉపాధి హామీని కొనసాగించాలి

ఉపాధి హామీపథకంలో భూమి అభివృద్ధి కార్యక్రమాన్ని కొనసాగించాలి. ఈ పనిని కొనసాగించడం వల్ల ఎక్కువ మందికి ఉపాధి హామీ పని దొరికే అవకాశం ఉంది. సాగు యోగ్యంగా తయారు అయిన తరువాత రైతులు భూమిలో పంటలు వేసుకుంటారు అటు తరవాత కూలీలకు కూడా పని దొరుకుతుంది. ఇంత బృహత్తరమైన పనిని చేయగలిగే పనుల జాబితా నుండి తీసివేయడం దుర్మార్గం.

-భారత అవినాష్, జనగామ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఉరితాడుగా మారుతున్న ఉపాధి

*ప్రజాస్వామ్య పద్ధతిలో రైతులతో ఎన్నిక కావాల్సిన మార్కెట్ పాలక మండళ్లలో నామినేషన్ పద్ధతిల్లో నింపుతున్నారు. కొందరు రాజకీయ నాయకులకు పునరావాస కేంద్రాలుగా మారిపోయాయి. దీంతో అవి రైతుల అభ్యున్నతి కంటే వ్యాపారుల, దళారుల సంక్షేమానికి ఎక్కువ ప్రయోజనం చేకూర్చేలా పనిచేస్తున్నాయనే ఆరోపణలను కొట్టివేయలేము. ఇలాంటి సమస్యలెన్నో వ్యవసాయమే జీవనాధారంగా బతుకీడుస్తున్న అన్నదాతలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. చివరగా ఒక్కమాట ఎన్ని పథకాలు పెట్టినా సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా, మనిషి బతకడానికి ఆహారం తప్పనిసరి. ఇంత పెద్ద జనాభాకు కావాల్సిన పంటలు అన్నదాతల 'చెమట'పుణ్యమేనని గుర్తుంచుకోవాలి. రైతులు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవడం ఏ కోణంలో చూసినా దేశానికి క్షేమం కాదు.*

దామెర్ల సాయిబాబ

భూమిని నమ్ముకున్నవారు ఎన్నటికీ చెడిపోరనేది పాత కాలపు నమ్మకంగా మారిపోయింది. గ్రామాల్లోఉంటూ భూమిపైనే ఆధారపడుతూ వ్యవసాయమే ఏకైక జీవనాధారంగా బతకడం ఒక శాపంగా పరిణమిస్తున్న దురదృష్టపు రోజులు దాపురించాయి. రైతు సంక్షేమమే తమ ధ్యేయమని వారి అభ్యున్నతికి ఏమి చేయడానికి అయినా వెనుకాడమని రాజకీయ పార్టీల నేతలు ఎంతగా చెబుతున్నా రైతులకు చేయూత నిచ్చేందుకు ఎన్ని కార్యక్రమాలు చేపడుతున్నా వ్యవసాయదారుల పరిస్థితి ఏమాత్రం మారడం లేదు. ఒకపక్క ప్రకృతి సహాయ నిరాకరణ, మరొకపక్క తోటి మానవుడు చేస్తున్న దోపిడీ, మోసాలతో రోజురోజుకు అన్నదాతలు కృంగిపోతున్నారు. విత్తే దగ్గర నుంచి విక్రయించేవరకు అన్నీ కష్టనష్టాలే. పంటల సాగులో పడుతున్న కష్టాల మాట అటుంచి పండించిన పంటలను అమ్ముకోవడంలో కూడా రైతులకు గగనమైపోతున్నది. ఎన్నో ఆటుపోట్లు తట్టుకొని, ఉత్పత్తులు ఇంటికి చేరితే, 'హమ్మయ్య' అనుకునే రైతులు నేడు అవి అమ్ముకోవడం కాదు కదా చివరికి డబ్బులు చేతికి వచ్చేవరకు ఎన్నో ఇబ్బందుల పాలవుతున్నారు. వాణిజ్యపంటల సాగు ఒక జూదంలా మారిపోయింది. ఈ రాష్ట్రం, ఆ రాష్ట్రం అని కాదు అన్నిరాష్ట్రాల్లోనూ రైతుల పరిస్థితి ఇందుకు విరుద్ధంగా లేదు. అటు ఆర్థికంగానూ, మానసికంగానూ కృంగిపోతున్నారు. విశ్వాసం వ్యక్తికి అద్భుతమైన ఉత్తేజాన్ని ఇస్తుంది. కార్యోన్ముఖున్ని చేస్తుంది. ఎన్ని అపజయాలు ఎదురైనా, మరెన్ని ఎదురుదెబ్బలు తగిలినా విశ్వాసం ఉన్న వ్యక్తి తొణకడు, బెదరడు. ముందుకు సాగిపోతూనే ఉంటాడు. విశ్వాసం సన్నగిల్లితే ఏ చిన్న ఎదురు దెబ్బతగిలినా తట్టుకోలేడు. తనకుతానుగా సమిధైపోతాడు. అందుకే విశ్వాసం అనేది మానవ జీవన పోరాటంలో ఎంతో ముఖ్యమైంది. ఆ విశ్వాసం దెబ్బతినే దేశవ్యాప్తంగా రైతులు ఆత్మాభిమానాన్ని చంపుకోలేక తమను ఆదుకునేవారు లేరనే నిరాశానిస్పృహలతో తమలో తాము కృంగికృశించి మరో గత్యంతరమార్గం కానరాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఒకరు కాదు, ఇద్దరు కాదు వేలసంఖ్యలో ఆహుతైపోతున్నారు. ఎన్ని వాగ్దానాలు చేసినా ఈ మారణహోమం ఆగడంలేదు. గత రెండు నెలలుగా తెలుగు రాష్ట్రాలను వదలని వర్షాలు రైతులకు కడగండ్లు తెస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో విభిన్న వాతావరణం కొనసాగుతున్నది. ఒకపక్క మధ్యాహ్నం వరకు తీవ్ర ఎండలతో హాడలెత్తించే వాతావరణం, ఆ తర్వాత సాయంత్రానికి ఈదురుగాలులు, వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో వడగండ్ల వానలు కూడా బీభత్సం సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా వరి రైతుల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కోట్లాది రూపాయలు విలువచేసే ఆరబోసిన ధాన్యం తడిసిముద్దయిపోతున్నది. ధాన్యం ఆరబోసిన రైతులు సాయంత్రం అవుతున్నదంటే గుండెల్లో దడ మొదలవుతున్నది. తెల్లవారేలోపు ఏ క్షణాన వరుణదేవుడు తన ప్రతాపాన్ని చూపుతాడోననే భయం అన్నదాతలకు కంటి మీద కునుకులేకుండాచేస్తున్నది. మరొకపక్క లారీల కొరత. సంచుల కొరత, ఎప్పుడు కాంటా (తూకం) పెడతారో తెలియని పరిస్థితుల్లో రైతులు పడుతున్న వేదన వర్ణనాతీతం. తడిసిన ధాన్యాన్ని ఆరబోయడం సమస్యగా మారుతున్నది. ఇతర సదుపాయాల మాట దేవుడెరుగు. కనీసం మార్కెట్‌కు తెచ్చిన ధాన్యాన్ని వర్షం నుంచి కాపాడేందుకు టార్పాలిన్‌లను కూడా సరఫరా చేయలేని పరిస్థితుల్లో అధికార యంత్రాంగం ఉంది. ఆరు

## ఒక్క మాట

గాలం కష్టం చేసి అంతా తయారు చేసుకొని ధాన్యాన్ని మార్కెట్‌లో అమ్మకానికి కుప్పపోస్తే వర్షానికి అది కంటి ముందే నీటిపాలవుతుంటే తట్టుకోలేకపోతున్నారు. రైతులను ఇబ్బంది పెట్టవద్దని సకాలంలో ధాన్యాన్ని కొనాలని ప్రభుత్వం ఆదేశాలుఇస్తున్నా రకరకాల కారణాలతో పనులు కావడం లేదు. ఒకటి,రెండు రోజులు కాదు. ఇరవై, ముప్పై రోజులు కల్లాల్లో ధాన్యం ఆరబోసి కాపలాగాస్తున్న రైతులున్నారు. ఇక పెనుగాలులతోపాటు కురుస్తున్న అకాల వర్షాల దాటికి మొక్కజొన్న, బొప్పాయి, అరటి, మామిడి తదితర పంటలకు భారీ నష్టం వాటిల్లింది. ప్రధానంగా మామిడి, వరి రైతులకు కోలుకోలేని దెబ్బతగిలిందనే చెప్పొచ్చు. మండువేసవిలో కురుస్తున్న ఈ వర్షాల్లో మొన్న ఆదివారం ఒక్కరోజే ఆంధ్రప్రదేశ్‌లో ఏడుగురు రైతులు పిడుగుపాటుతో మరణించారు. ఇక ఉల్లిరైతుల పరిస్థితి గందరగోళంగా ఉంది. అహర్నిశలు కష్టపడి పండించిన పంటలు ఎలా అమ్ముకోవాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. నిన్న, మొన్నటివరకు యాభైనుండి, ఎనభై రూపాయల వరకు అమ్మిన ఉల్లిధర నేడు రైతుల వద్ద పది, పన్నెండు రూపాయల వరకే కొంటున్నారు. ఇందుకు పాలకుల అనాలోచిత విధానాలే కారణమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రపంచంలో నూటనలభై దేశాల్లో ఉల్లిపంట సాగు చేస్తున్నారు. దిగుబడులో సగం వాటా చైనా, భారత్‌లదే. ప్రపంచంలోని ఐదోవంతు పంట భారత్‌లోనే పండిస్తున్నారు. కానీ ధరలను నియంత్రించడంలోనే కాదు రైతుకు గిట్టుబాటు ధర ఇప్పించడంలో పాలకపెద్దలు విఫలమవుతున్నారు. దళారులదే ఇష్టారాజ్యం అవుతున్నది. మరొకపక్క ప్రపంచంలోనే దిగుబడుల్లో రెండోస్థానంలో ఉన్న భారత్ ఉత్పాదకతలో మాత్రం తొంభైవ స్థానంలో ఉంది. ఐర్లాండ్ హెక్టారుకు 67.33 టన్నులతో అగ్రస్థానంలో ఉంటే మన దేశంలో రైతులు పదిహేను టన్నులకు మించి పండించలేకపోతున్నారు. మరొకపక్క ఉల్లి వినియోగం భారత్‌లో యేడాదియేడాదికి పెరుగుతున్నది. దేశంలో తలసరి వార్షిక ఉల్లి వినియోగం 6.7 కిలోలని జాతీయ ఉల్లి, అల్లం పరిశోధనా సంస్థ గతంలో వెల్లడించింది. అయితే పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా 2050 నాటికి తలసరి వినియోగం 11.6 కిలోలకు పెరగవచ్చునని ఆ సంస్థ అంచనా వేసింది. కానీ పంట విస్తీర్ణం పెంచేందుకు నిర్దిష్టమైన, ప్రణాళికాబద్ధమైన చర్యలేమీ తీసుకోవడం లేదు. అధికార లెక్కల ప్రకారమే అప్పటికి దేశప్రజల అవసరాలు తీరాలంటే దాదాపు మూడు కోట్ల టన్నుల ఉల్లిపాయలను మన రైతులు పండించాలి. ఐరోపా, అమెరికా, దేశాల్లో వచ్చినంత ఉత్పాదకత మనదేశంలో రాకపోవడానికి రెండు ప్రధాన కారణాలున్నాయని మన వ్యవసాయ శాస్త్రవేత్తలు అంటున్నారు. దీర్ఘకాలికంగా సాగుచేసే హైబ్రీడ్ వంగడాలను ఆ దేశాల్లో రైతులకు తక్కువ ధరకు అందుతున్నాయి. పైగా ఆధునిక యంత్రాలను వాడడం వల్ల సాగు ఖర్చు కూడా ఆ దేశాల్లో తగ్గుతున్నది. మనదేశంలో అధిక దిగుబడులు ఇచ్చే హైబ్రీడ్ వంగడాలు సాధారణ రైతులకు అందుబాటులో లేవనే చెప్పొచ్చు. ఉన్నా అవి అధిక ధరలకు అమ్ముతున్నారు. ప్రోత్సాహకాలు కూడా అంతంత మాత్రమే. వీటన్నింటికంటే మించి ఉల్లిపాయల హోల్‌సేల్ వ్యాపార కేంద్రంగా ఉన్న మహారాష్ట్రలోని లాసన్‌గామ్ మార్కెట్లోని ఈ గోల్‌మాల్ అంతా జరుగుతుందనే విమర్శలు చాలాకాలంగా ఉన్నాయి. రైతుల వద్ద ఉల్లి సరుకులున్నప్పుడు ధరలను నియంత్రించడం, ఆ తర్వాత దళారుల చేతిలోకి వెళ్లిన తర్వాత ఇష్టానుసారంగా పెంచుకునేందుకు అవకాశాలు ఇస్తున్నారనే ఆరోపణలు కొట్టివేయలేం. ఉల్లి పంటే కాదు, ఏ పంట ధర తీసుకున్నా రైతుల వద్ద పంటలున్నప్పుడు ధరలు పాతాళలోకానికి పడిపోవడం, అవి ఆ తర్వాత దళారుల చేతుల్లోకి చేరిన పిదప ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రజాస్వామ్యపద్ధతిలో రైతులతో ఎన్నిక కావాల్సిన మార్కెట్ పాలకమండళ్లలో నామినేషన్ పద్ధతిల్లో నింపుతున్నారు. కొందరు రాజకీయ నాయకులకు పునరావాస కేంద్రాలుగా మారిపోయాయి. దీంతో అవి రైతుల అభ్యున్నతి కంటే వ్యాపారుల, దళారుల సంక్షేమానికి ఎక్కువ ప్రయోజనం చేకూర్చేలా పనిచేస్తున్నాయనే ఆరోపణలను కొట్టివేయలేం. ఇలాంటి సమస్యలెన్నో వ్యవసాయమే జీవనాధారంగా బతుకీడుస్తున్న అన్నదాతలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. చివరగా ఒక్కమాట ఎన్ని పథకాలు పెట్టినా సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా, మనిషి బతకడానికి ఆహారం తప్పనిసరి. ఇంత పెద్ద జనాభాకు కావాల్సిన పంటలు అన్నదాతల 'చెమట' పుణ్యమేనని గుర్తుంచుకోవాలి. రైతులు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవడం ఏ కోణంలో చూసినా దేశానికి క్షేమం కాదు. •

# పవన శక్తితో కార్బన్ ఉద్గారాల కట్టడి!

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

గాల్లో మండి శక్తిని ఇవ్వగల పదార్థాన్ని ఇంధనంగా నిర్వచిస్తాం. ఆది మానవుడి నుంచి నేటివరకు బొగ్గు, వంట చెరుకు, పెట్రోల్, డిసిల్, కిరోసిన్. వంట గ్యాసు లాంటి ఘన/ద్రవ/వాయు పదార్థాలను ఇంధనాలుగా వాడుతూ వస్తున్నాం. భూమి పొరల్లోంచి తవ్వి తీసిన బొగ్గు, పెట్రోలియం లాంటి ఉత్పత్తులను శిలాజ ఇంధనాలుగా పిలుస్తున్నాం. నేడు విద్యుత్ వినియోగమే ప్రజల జీవనాధారంగా మారిన వేళ శిలాజ ఇంధనాల కొరతతో పాటు వాటి వాడకం వల్ల జరుగుతున్న పర్యావరణ విధ్వంసం వల్ల తరిగే సాంప్రదాయ పునరుత్పాదకత సాధించలేని శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గిస్తూనే తరగని, సాంప్రదాయేతర,పునరుత్పాదక శక్తివనరుల పట్ల మానవ ఆలోచనలు వెళ్లవలసిన అగత్యం ఏర్పడింది. నేడు పునరుత్పాదక శక్తి వనరులుగా సౌర,పవన, అలల, జియోథర్మల్, హైడ్రో, బయోమాస్ లాంటివి నిలుస్తున్నాయి. గాలులు వీచినప్పుడు వచ్చే పవనాలతో గాలి మరలను లేదా విండ్ మిల్స్‌ను అమర్చి విద్యుత్తుశక్తిగా మార్చడం అనాదిగా జరుగుతూ వస్తున్నది. నెథర్‌లాండ్స్‌లో ప్రారంభమైన విండ్ మిల్స్ విప్లవం నేడు ప్రపంచ దేశాలన్నింటిలో ప్రవేశిస్తున్నది. పవన శక్తిని ఒడిసి పట్టే సునాయాస విండ్ మిల్స్ లేదా గాలి మరలకు విస్తృత ప్రచారం కలిపించడానికి ప్రతి ఏటా 10 మే రోజున జాతీయ విండ్ మిల్ లేదా గాలి మరల దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. పర్యావరణ హిత, గ్రీన్, క్లీన్ ఎనర్జీగా లభిస్తున్న పవన శక్తిని విండ్ మిల్స్ ద్వారా గ్రామీణ, మునిసిపల్, ఇతర విభాగాల్లో విద్యుత్ లేదా ఇతర రూపాల్లో వాడడం కొనసాగుతున్నది. నాటి విండ్ మిల్స్‌కు సాంకేతిక సొబగులు అద్ది అత్యాధునిక విండ్ టర్బైన్స్‌ను కూడా రూపొందించి ముందుకు సాగడం జరుగుతోంది. సహజ పవన గమనాలకు అనుగుణంగా గతిశక్తిని గాలి మరలను అమర్చి పర్యావరణహిత, హరిత, శుద్ధ విద్యుత్తుశక్తిని ఉత్పత్తిచేయడం నేడు సర్వత్రా కనిపిస్తున్న దృశ్యాలు. భూతాపానికి గ్రీన్‌హౌజ్ వాయువుల ఉద్గారకాలను తగ్గించడం, కార్బన్ ఎమిషన్స్‌ను కట్టడి చేయడం, ఖర్చు తక్కువ కావడం, మేయింటెనెన్స్ సులభం కావడం, శక్తి అవసరాలను తీర్చడం, భూభాగానికి సహకరించడం, విండ్ మిల్స్ స్థాపన సులభం కావడం, ఉద్యోగాల కల్పన జరగడం లాంటి పలు ప్రయోజనాలు కలిగిన పునరుత్పాదక పవన శక్తి ఉత్పత్తితోపాటు వాడకాన్ని కూడా ప్రోత్సహించడం నేటి అవసరంగా మారింది. గాలి మరల వాడకంతో వన్యప్రాణుల సహజత్వానికి విఘాతం కలగడం, శబ్దకాలుష్యానికి కారణం కావడం, ఎత్తైన ప్రదేశాల్లో భూమి అనుకూలంగా ఉండడం లాంటి ప్రతికూలాలు ఉన్నప్పటికీ పవవ శక్తిని విద్యుత్ రూపంలోకి మార్చడం విధిగాజరగాలి. ప్రపంచవ్యాప్తంగా 80 శాతం అత్యధిక పవనశక్తిని ఉత్పత్తి చేస్తున్న ఐదుదేశాల్లో జర్మనీ,అమెరికా, డెన్మార్క్, స్పెయిన్, భారత్ ఉన్నాయి. భారత్‌లో పవనశక్తిని అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రాల జాబితాలో ఏపి, గుజరాత్, కర్ణాటక, ఎంపీ, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడులు ముందున్నాయి. భారత పునరుత్పాదక శక్తి వనరుల మంత్రిత్వశాఖ లక్ష్యాల ప్రకారం 2030 నాటికి 30 జిడబ్ల్యూ పవన శక్తిని ఒడిసి పట్టడానికి ప్రణాళికలు రచిస్తున్నారు. విండ్ టర్బైన్స్ ద్వారా పవనంలో దాగిన గతి శక్తిని, తొలుత యాంత్రిక శక్తిగా మార్చడం,యాంత్రిక శక్తిని విద్యుత్తు శక్తిగా మార్చడం భారతంలో విస్తృతంగా జరుగుతున్నది. పర్యావరణ హిత, గ్రీన్, క్లీన్, తరగని, పునరుత్పాదక పవన శక్తిని వీడడం వల్ల ప్రత్యక్షంగా కార్బన్ ఉద్గారాలు తగ్గిపోయి ప్రతికూల వాతావరణ మార్పులు అదుపు చేయబడతాయి. సులభంగా, ఉచితంగా, విరివిగా అందుబాటులో ఉన్న పవన శక్తిని విద్యుత్‌గా మార్చడం వల్ల వ్యక్తిగత శక్తి స్వేచ్ఛ లభిస్తుంది. నేడు సోలార్ పవర్ ప్లాంట్ల వలె విండ్ పవర్‌ను వాడడం కూడా బహుళ ప్రచారంలోకి రావాలి. •

# తయారీ రంగ ప్రగతికి 'పీఎల్ఐ' ఓ దిక్సూచి

డి జె మోహన రావు

భారతదేశ ఆర్థిక వ్యవస్థ స్వయం సమృద్ధిని సాధించి, ప్రపంచ తయారీ రంగంలో తనదైన సుస్థిర స్థానాన్ని పొందడానికి దేశీయ తయారీ రంగాన్ని బలోపేతం చేయడం అత్యంత ముఖ్యం. ఈలక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం' (పీఎల్ఐ) ఒక వినూత్నమైన, శక్తివంతమైన ముందడుగు. 2020లో ప్రారంభించబడిన ఈ పథకం, కీలక పరిశ్రమలలో ఆవిష్కరణ, సామర్థ్యం, పోటీతత్వాన్ని ప్రోత్సహిస్తూ, భారత దేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా స్థాపించాలనే ప్రభుత్వ వ్యూహానికి మూలస్తంభంగా నిలుస్తోంది. ఇది స్వావలంబన వైపు ఒక వ్యూహాత్మక ముందడుగు. ఎలక్ట్రానిక్స్, వస్త్రాలు, ఫార్మా, ఆటోమొబైల్స్ వంటిరంగాలను లక్ష్యంగా చేసుకుని, అధిక ఉత్పత్తి, పెరుగుతున్న అమ్మకాల ఆధారంగా ఆర్థిక ప్రోత్సాహకాలను అందిస్తుంది. ఈ పనితీరు ఆధారిత విధానం దేశీయ, ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడమేకాకుండా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడానికి పరిశ్రమలను ప్రోత్సహిస్తుంది. ఇది భారత పరిశ్రమలలో నూతన ఉత్తేజాన్ని, పోటీతత్వాన్ని నింపి,'ఆత్మనిర్భర్ భారత్' కలను సాకారం చేసే దిశగా నడిపిస్తోంది. పీఎల్ఐ పథకం వెనుక స్పష్టమైన, దీర్ఘకాలిక లక్ష్యాలున్నాయి. ప్రపంచస్థాయిమౌలిక సదుపాయాలు, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, ఎగుమతులను ప్రోత్సహించడం, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, లక్షలాది ఉద్యోగఅవకాశాలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవడం. హైటెక్ పరిశ్రమలలో పెట్టుబడులు, దేశీయ సామర్థ్యాల బలోపేతం, ప్రపంచ పోటీతత్వం పెంపుపై దృష్టి పెడుతుంది. కీలక రంగాలైన ఎలక్ట్రానిక్స్, ఫార్మా, ఆటోమొబైల్స్, టెక్స్‌టైల్స్, ఆహార శుద్ధి, పునరుత్పాదక ఇంధన పరికరాలపై దృష్టి సారించడం ద్వారా భారతదేశాన్ని ప్రపంచస్థాయి ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ సంకల్పం. అమ్మకాల పెరుగుదల ఆధారంగా ప్రోత్సాహకాలివ్వడంవల్ల నాణ్యత, సామర్థ్యంపై కూడా దృష్టి సారించేలా ప్రోత్సహిస్తోంది. 1.97 లక్షల కోట్ల భారీ కేటాయింపులతో పీఎల్ఐ పథకాలు 14 కీలక రంగాలపై దృష్టి సారిస్తాయి. దేశ తయారీ సామర్థ్యం, సాంకేతిక పురోగతి, ప్రపంచ మార్కెట్లలో స్థానాన్ని పెంచడానికి ఈరంగాలను వ్యూహాత్మకంగా ఎంచుకున్నారు. దేశీయ ఉత్పత్తిని బలోపేతం చేయడం, ఎగుమతులను విస్తరించడం, ఆత్మనిర్భర్ భారత్ విస్తృత దార్శనికతకు ఇవి దోహదపడతాయి. ప్రారంభించిన అనతి కాలంలోనే పీఎల్ఐ పథకం ఆశాజనకమైన ఫలితాలనుచూపింది. 1.97 లక్షల కోట్ల భారీ కేటాయింపులకు గాను, ఆగస్టు 2024 నాటికి 1.46 లక్షల కోట్ల వాస్తవ పెట్టుబడులు వచ్చాయి. ఇది త్వరలోనే 2 లక్షల కోట్లు దాటుతుందని అంచనా. ఈ పెట్టుబడులు 12.50 లక్షల కోట్ల అదనపు ఉత్పత్తి లేదా



అమ్మకాలకు దారితీశాయి. సుమారు 9.5 లక్షల ఉద్యోగాలు సృష్టించబడ్డాయి (త్వరలో 12 లక్షలకు పెరుగుతుందని అంచనా). ఎలక్ట్రానిక్స్, ఫార్మా, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కీలక రంగాల వల్ల ఎగుమతులు 4లక్షల కోట్లను అధిగమించాయి. దేశీయ పరిశ్రమల వేగవంతమైన వృద్ధి, భారతీయ ఉత్పత్తుల ప్రపంచ పోటీతత్వం, ఉద్యోగ కల్పనలో పథకం విజయం స్పష్టంగా కనిపిస్తుంది. మొబైల్ ఫోన్ల తయారీలో విలువ జోడింపు కేవలం మూడేళ్లలో 20శాతానికిపెరిగింది. ప్రభుత్వం 2025-26లో కీలక రంగాలకు బడ్జెట్ కేటాయింపులను భారీగా పెంచింది. (ఎలక్ట్రానిక్స్,ఐటి, హార్డ్‌వేర్, ఆటోమొబైల్స్, టెక్స్‌టైల్స్ వంటివి), దేశీయ తయారీని బలోపేతం చేయడంలో నిబద్ధతను చూపింది. తయారీ, ఆర్థిక విస్తరణను ప్రోత్సహించడానికి ప్రభుత్వం సరళీకృత ఎఫ్డిఐ విధానాన్ని ప్రవేశపెట్టింది. చాలా రంగాలు ఇప్పుడు ఆటోమేటిక్ మార్గంలో 100శాతం ఎఫ్‌డిఐని అనుమతిస్తున్నాయి. 2019-2024 మధ్యబొగ్గు, కాంట్రాక్ట్ తయారీ, భీమా, టెలికాం, అంతరిక్ష రంగాలలో ముఖ్యమైన ఎఫ్‌డిఐ సంస్కరణలు అమలుచేశారు. ఈచర్యలు ప్రపంచ పెట్టుబడిదారులను ఆకర్షించడం, సామర్థ్యాలను పెంచడం, ఉత్పత్తిని పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఫలితంగా, తయారీ రంగంలో ఎఫ్‌డిఐ ఇన్‌ఫ్లో 2004-14తో పోలిస్తే 2014-2024 మధ్య69శాతం పెరిగి165 బిలియన్లకు చేరుకుంది. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానం ద్వారా భారత్ ప్రముఖ తయారీ గమ్యస్థానంగా బలోపేతం అవుతోంది. ముఖ్యరంగాలలో పీఎల్ఐ గణనీయమైన విజయాలు సాధించింది. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం నికర దిగుమతిదారు నుండి మొబైల్‌ఫోన్ల నికరఎగుమతిదారుగా మారింది. దేశీయ ఉత్పత్తి, ఎగుమతులు భారీగా పెరిగాయి, ఎఫ్డిఐ254శాతం పెరిగింది. ఫార్మారంగం వాల్యూమ్‌పరంగా మూడవ అతిపెద్ద శక్తిగా ఎదిగింది, ఎగుమతులు ఉత్పత్తిలో 50శాతం వాటా కలిగిఉన్నాయి. బల్క్‌డ్రగ్స్ తయారీద్వారా దిగుమతులపై ఆధారపడటం తగ్గింది. వైద్య పరికరాల సాంకేతిక బదలీతో స్థానికఉత్పత్తి సాధ్యమైంది. ఆటోమోటివ్ పీఎల్ఐ ద్వారా లక్ష్యాన్నిమించి 67,690 కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, హైటెక్ ఉత్పత్తుల ఉత్పత్తిని పెంచింది. పున రుత్పాదక శక్తి రంగంలో సౌరఫోటో వోల్టాయిక్ మాడ్యూళ్ల తయారీ సామర్థ్యాన్ని పెంచి, ఉద్యోగాల సృష్టి, దిగుమతుల తగ్గింపులక్ష్యంగా పెట్టుకుంది (రెండవవిడత 65గిగావాట్స్). టెలికాం ఉత్పత్తులలో 60శాతందిగుమతి ప్రత్యామ్నాయాన్ని సాధించింది. భారత్‌ను 4జి, 5జి పరికరాల ప్రధాన ఎగుమతిదారుగా మార్చింది. డ్రోన్ రంగం టర్నోవర్ ఏడురెట్లు పెరిగి, పెట్టుబడులు, ఉద్యోగ సృష్టితో ప్రపంచ అగ్రగామిగా నిలిచింది. పీఎల్ఐ పథకం విజయవంతంగా ఉన్నప్పటికీ, ప్రగతిని నిలకడగా కొనసాగించడానికి కొన్నిఅంశాలపైదృష్టిపెట్టాలి. ప్రోత్సాహకాల పంపిణీ వేగవంతంగా, పారదర్శకంగా జరగాలి. ప్రయోజనాలు పెద్ద కంపెనీలకే కాకుండా, ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలకు అందాలి. అంతర్జాతీయ మార్కెట్లలో'మేడ్ ఇన్ ఇండియా'కు గుర్తింపు కోసం నాణ్యతా ప్రమాణాలపై రాజీపడకూడదు. తయారీ కేంద్రంగా కాకుండా, ఆవిష్కరణల కేంద్రంగా ఎదగడానికి పరిశోధనా అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి. •

# ఎనిమిది పాక్ క్షిపణులు కూల్చివేత

## దాయాది దాడియత్నాలను తిప్పికొట్టిన భారత్



**న్యూఢిల్లీ, మే 9:** భారత్ చేతిలో పాకిస్థాన్‌కు మరో సారి భంగపాటు ఎదురైంది. ఉగ్రశిబిరాలపై దాడులకు ప్రతిగా డ్రోన్లు, క్షిపణులు, యుద్ధవి మానాలతో దాడికి పాక్ చేసిన ప్రయత్నాన్ని భారత బలగాలు తిప్పికొట్టాయి. విమానాశ్ర యం, సైనిక కేంద్రాలే లక్ష్యంగా ప్రయోగించిన డ్రోన్లు, ఆరు యుద్ధవిమానాలను భారత సైన్యం నేలమట్టం చేసింది. పాక్ ప్రయోగించిన 8 క్షిప ణులను నేలకూల్చింది. ఒక పాక్ పైలెట్‌ను పట్టు కుంది. భారత్‌వైపు ఎలాంటి నష్టం జరగలేదని రక్షణశాఖ ప్రకటించింది. గురువారం రాత్రి క్షిప ణులు, ఆత్మాహుతి డ్రోన్లు, యుద్ధ విమానాలతో భారత్‌లో సరిహద్దు రాష్ట్రాలైన జమ్ముకశ్మీర్, రాజస్థాన్, పంజాబ్‌లో దాడులు చేసేందుకు విఫలయత్నం చేసింది. జమ్ము విమానాశ్రయం తో పాటు సరిహద్దుల్లోని పలు సైనిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంది. దాదాపు 35నిమిషాల పాటు పాక్ చేసిన దాడులను భారత్ బలగాలు అత్యంత సమర్థంగా తిప్పికొట్టింది. జమ్ము, ఉధంపూర్, అఖ్నూర్, పూంఛ్, రాజస్థాన్‌లోని జైసల్మేర్, పోఖ్రాన్, పంజాబ్‌లోని పఠాన్‌కోట్, జలంధర్ లక్ష్యంగా పాక్ డ్రోన్లు ప్రయోగించింది. సత్వారా, సాంబా, ఆర్ఎస్ పురాల్లో క్షిపణి దాడులకు పాకిస్థాన్ ప్రయత్నించింది. జమ్ము విమానాశ్రయం సహా పలు కీలక ప్రాంతాలవైపు డ్రోన్లు వచ్చాయి. ఆ సమయంలో ఆయా ప్రాం తాల్లో భారీ ఎతున సైరన్లు మోగాయి. వెంటనే ప్రజలంతా తమ ఇళ్లలోకి వెళ్లిపోయారు. దుకాణాలను మూసివేశారు. భారత గగనతల రక్షణ వ్యవస్థ డ్రోన్లు,క్షిపణులనుకూల్చేసింది. పోఖ్రాన్ ఆర్మీ స్టేషన్‌పై డ్రోన్ల దాడికి పాక్ యత్నించగా భారత్ అడ్డుకుంది. జలంధర్‌లో పాక్ డ్రోన్లను భారత రక్షణ వ్యవస్థ సమర్థంగా అడ్డుకుంది. ఉధంపూర్ లో పాకిస్థాన్ డ్రోన్లను భారత వైమానిక దళం అడ్డుకున్నప్పుడు పేలుళ్లు వినిపించాయి. జైసల్మేర్‌లోనూ భారత వైమానిక దళం డ్రోన్లను అడ్డుకుంది. ఆ సమయంలో స్థాని కులకు పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఆకాశంలో ప్రకాశంవంతమైన కాంతి కనిపించినట్లు చెప్పారు. పాకిస్థాన్‌కు చెందిన ఒక ఎఫ్16, రెండు జేఎఫ్17 సహా 6 యుద్ధ విమానాలను భారత సైన్యం కూల్చేసింది. ఎఫ్16 పైలట్ మన సైన్యానికి చిక్కాడు. అఖ్నూర్‌లో ఎస్400 రక్షణ వ్యవస్థ ఎఫ్16 విమానాన్ని కూల్చేసింది. జమ్ము యూనివర్సిటీకి సమీపంలో 2 పాక్ డ్రోన్లను భారత్ ధ్వంసంచేసింది. జమ్ములో పలు సైనిక కేంద్రాలున్నాయి. విమానాశ్రయం వద్ద భారీ శబ్దాలు వినిపించాయని స్థానికులు తెలిపారు. పాక్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను భారత్ అడ్డుకుని కూల్చివేయడం వల్లే పేలుళ్లు వినబడి ఉండొచ్చని సమాచారం. పాక్ దాడులు చేసిన సమయంలో రాజస్థాన్‌లోని బికనీర్, పంజాబ్ లోని జలంధర్‌లో బ్లాక్ అవుట్ విధించారు. కిస్త్వార్, అఖ్నూర్, సాంబా, జమ్ము, అమృత్ సర్, జలంధర్ లలోనూ బ్లాక్ అవుట్ అమలు చేశారు. శ్రీనగర్, రాజౌరీలోనూ అదే పరిస్థితి నెలకొంది. ఆ ప్రాంతాల్లో అధికారులు పూర్తిగా విద్యుత్ సరఫరాను నిలిపేశారు. పాక్ దాడులకు భారత్ అంతే తీవ్రంగా స్పందించింది. భీకరమైన ఎదురుదాడులకు దిగింది. పాక్‌లోని మరో రెండు వైమానిక రక్షణ వ్యవస్థలను కూల్చివేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. సర్గోధా, ఫైసలాబాద్ లోని రక్షణ వ్యవస్థలను కూల్చినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పాకిస్థాన్ వాయు రక్షణ వ్యవస్థలను ధ్వంసం చేసినట్లు భారత సైనిక వర్గాలు కూడా వివరించాయి. పాక్ పంజాబ్ ప్రావిన్సులోని గగనతల ముందస్తు హెచ్చరిక వ్యవస్థ అవాక్స్‌ను భారత్ ధ్వంసం చేసింది. లాహోర్‌లో గురువారం పేలుళ్లు విని పించాయి. వాల్టన్ ఎయిర్‌పోర్టు సమీపంలోని గోపాల్ నగర్, నసీరాబాద్ ప్రాంతాల్లో ఒక్కసారిగా భారీ శబ్దాలు వినిపించడం వల్ల సైరన్ల మోత మోగింది. భయాందోళనలకు గురైన ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పొగ కమ్ముకున్న దృశ్యాలు కనిపిం చాయి. సియాల్‌కోట్, లాహోర్ విమానాశ్రయా ల్లో విమానాలను రద్దుచేశారు. ఈ పేలుళ్లు వినిపించిన ప్రాంతాల పక్కనే పాక్ ఆర్మీ కంటోన్మెంట్ ఉంది. 5 నుంచి 6 అడుగుల డ్రోన్ కూలిపోవడం కారణంగా ఈ పేలుడు సంభవించి ఉండొచ్చని స్థానిక అధికారులు వెల్లడించారు. కరాచీలోనూ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. జమ్ము, పఠాన్‌కోట్, ఉధంపూర్‌లను పాక్ డ్రోన్లు, క్షిపణులు లక్ష్యంగా చేసుకున్నాయని రక్షణశాఖ ప్రకటించింది. వెంటనే వాటిని నిర్వీర్యం చేశామని తెలిపింది. ఈ దాడుల్లో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని రక్షణశాఖ అధికార ప్రతినిధి గురువారం రాత్రి తెలిపింది. దేశ సార్వ భౌమత్వం, ప్రజల భద్రత పరిరక్షణకు పూర్తి సిద్ధంగా ఉన్నట్లు రక్షణశాఖ వెల్లడించింది. మరోవైపు దాడి చేసి భంగపడిన పాకిస్థాన్ సరిహద్దుల్లోని భారత సైనిక కేంద్రాలను పేల్చేశా మని అసత్యాలు వల్లెవేసింది. పాకిస్థాన్ సమాచా రశాఖ మంత్రి అత్తావుల్లా తరార్ మీడియా సంస్థలకు ఈ విషయం తెలిపారు. 40 నుంచి 50 మంది భారత సైనికులు చనిపో యారని వివరించారు. ఆయన వ్యాఖ్యలను భారత్ ఖండించింది. అన్ని డ్రోన్లను అడ్డుకున్నామని స్పష్టంచేసింది. ఎలాంటి నష్టం జరగలేదని వివరించింది.



## టెరిటోరియల్ ఆర్మీని కూడా
# రంగంలోకి దించండి
### ఆర్మీ చీఫ్‌కు విశేష అధికారాలు

**న్యూఢిల్లీ, మే 9:** పాకిస్థాన్ పన్నాగాలకు చెక్ పెట్టేందుకు భారత ఆర్మీ చీఫ్‌కు కేంద్ర ప్రభుత్వం మరిన్ని అధికారులను కట్టబెట్టింది. డ్రోన్లు, మిస్సైల్స్‌తో దాడులు చేసిన పాకిస్థాన్‌కు భారత్ చుక్కలు చూపించడంతో దాయాది దేశం మరో కుతంత్రానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పాక్ ఎత్తులను చిత్తు చేసేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. అవసరమైతే టెరి టోరియల్ ఆర్మీని రంగంలోకి దించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది కేంద్ర ప్రభుత్వం. టెరిటోరియల్ ఆర్మీ లోని అధికారులను, నమోదు చేసుకున్న సిబ్బం దిని పిలిచేందుకు ఆర్మీ చీఫ్‌కు అధికారం కల్పించింది కేంద్రం. రెగ్యులర్ ఆర్మీతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించింది. ఇప్పటి వరకు టెరిటోరియల్ ఆర్మీ సిబ్బంది పలు సందర్భాల్లో యుద్ధాల్లో పాల్గొన్నారు. 1962, 1965, 1971ల్లో జరిగిన యుద్ధాల్లో భారత సైన్యంతో కలిసి పనిచేశారు. ప్రకృతి వైపరీత్యా లు సంభవించినప్పుడు సేవ కార్యక్రమాలు చేశారు. ఇటీవల కేరళలో వరదలు వచ్చిన సేవలు అందించిన మాలీవుడ్ స్టార్ హీరో మోహన్ లాల్ కూడా టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్ స్థాయి అధికారే. ధోనీ, సచిన్, అనురాగ్, ఆ జాబితాలో మోహన్ లాల్‌తోపాటు టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ, కాంగ్రెస్ నేత సచిన్ పైలట్, భారత మాజీ దిగ్గజం కపిల్ దేవ్, బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్, అథ్లెట్ అభినవ్ బింద్రా సహా పలువురు సెలబ్రిటీలు టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్ స్థాయిలో ఉన్నారు. అయితే కనీస అర్హత సర్వీస్ పూర్తి చేసిన వారికి పింఛనుతోపాటు క్యాంటీన్, మెడికల్,ఎల్‌టీ అలవెన్సులు అంది స్తుంది కేంద్ర ప్రభుత్వం. టెరిటోరియల్ ఆర్మీ గురించి ఒక్క చెప్పాలంటే సైనిక రిజర్వ్ ఫోర్స్ అనిచెప్పవచ్చు. ఇందులోని వారికి అధి కారులకు రెగ్యులర్ ఆర్మీ తరహాలోనే శిక్షణ ఉం టుంది. వారంతా బయట తమ పనులు చేసు కుంటూనే వాలంటరీగా సైన్యంతో పనిచేస్తుంటారు. ప్రస్తు తం దాదాపు 50వేలమంది వరకు అలా ఉన్నట్లు సమాచారం. ఈ ఆర్మీ అధికారుల్లో పలువురు శౌర్య, విశిష్ట పురస్కారాలను అందుకున్నారు.



# మా పిఎం పిరికివాడు..
### భారత్‌తో ఎలా పోరాడగలం?: పాకిస్థాన్ ఎంపి షాహిద్ అహ్మద్


**ఇస్లామాబాద్, మే 9:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీ కారంగా 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టిన భారత్ పాక్‌లోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. ఈ పరిణామాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న దాయాది దేశం.. భారత్‌పై దాడులకు విఫలయత్నం చేస్తోంది. పాక్ దాడులను భారత బలగాలు సమర్థంగా తిప్పికొడుతున్నాయి. గగనతల రక్షణ వ్యవస్థలనూ ధ్వంసం చేశాయి. ఈ పరిణామాలతో పలువురు పాక్ ప్రజలు, రాజకీయ నాయకులు అక్కడి ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా పాక్‌కు చెందిన తెహ్రీక్-ఏ-ఇన్సాఫ్ (పిటిఐ) పార్టీ ఎంపి షాహిద్ అహ్మద్ ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. పార్లమెంట్‌లో ప్రసంగిస్తూ తమ ప్రధాని పిరికివాడని, భారత ప్రధాని నరేంద్రమోడీ పేరు పలకడానికి కూడా ఆయన భయపడుతున్నారని అన్నారు. టిప్పు సుల్తాన్ చెప్పిన కోట్‌ను ప్రస్తావిస్తూ సింహాల సైన్యాన్ని నక్క నడిపిస్తే, అవి యుద్ధంలో పోరా డలేక ఓడిపోతాయని అన్నారు. అదేవి ధంగా సరిహద్దుల్లో ఉన్న తమ సైనికులు ధైర్యంగా భారత్‌తో పోరాడాలనుకున్నా దేశ ప్రధానికే ధై ర్యం లేనప్పుడు వాళ్లు ముందడుగు ఎలా వేయ గలరని ప్రశ్నించారు. భారత్ దాడి చేసినప్పటి నుంచి ఆ దేశానికి వ్యతిరేకంగా పాక్ ప్రధాని ఒక్క ప్రకటన కూడా చేయలేదని ఎంపి షాహిద్ అహ్మద్ దుయ్యబట్టారు. ఇటువంటి పరిస్థితుల్లో సరిహద్దులో నిలబడి ఉన్న పాకిస్థాన్ సైనికులకు ప్రభుత్వం ఏం ఆదేశాలు ఇస్తుందని నిలదీశారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవా దంపై పోరు తలపెట్టిన భారత్‌ను ఇబ్బంది పెట్టేందుకు పాకి స్థాన్ గురువారం రాత్రి దాడులకు దిగింది. అం దులో భాగంగా జమ్మూ కశ్మీర్, రాజస్థాన్, పం జాబ్, హర్యానా సరిహద్దు ప్రాంతాల్లో డ్రోన్‌లను ప్రయోగించింది. అయితే, భారత సైన్యం వాటిని సమర్థంగా తిప్పికొట్టింది. ఉధంపూర్, సాంబా, జమ్మూ,అఖ్నూర్, నగ్రోటా, పఠాన్‌కోట్ ప్రాం తాల్లో పాక్ దాడి చేసిన 50 డ్రోన్లను భారత ఆర్మీ కూల్చేసింది.



## మేం జోక్యం చేసుకోం
### భారత్-పాక్ ఉద్రిక్తతలపై యుఎస్ ఉపాధ్యక్షుడు జెడి వాన్స్

**వాషింగ్టన్, మే 9:** భారత్-పాకిస్థాన్ మధ్య జరుగుతున్న సైనిక ఘర్షణలో తాము జోక్యం చేసుకోబోమని అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ తేల్చి చెప్పారు. ఫాక్స్ న్యూస్ నిర్వహిం చిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'రెండు అణుశక్తి దేశాలు ఘర్షణ పడుతూ భారీ సంక్షోభం వైపు రావడంపై మేము ఆందోళన చెందుతున్నాం. వీలైనంత తొందరగా పరిస్థితులు శాంతించాలని కోరుకుం టున్నాం. పాకిస్థాన్‌పై భారత్‌కు కొన్ని ఫిర్యాదు లున్నాయి. న్యూఢిల్లీ చర్యలకు పాక్ స్పంది స్తోంది. పరిస్థితులు తగ్గుముఖం పట్టేలా చేయాలని మేము వీరిని ప్రోత్సహించగలం. కానీ, యుద్ధంలో మాత్రం తలదూర్చం. అది మా పని కాదు. అమెరికాతో దానికి ఏమాత్రం సంబంధం లేదు' అని వాన్స్ వెల్లడించారు.
'భారత్, పాక్ ఆయుధాలు వదిలేయాలని అమె రికా చెప్పదు. కానీ, దీనికి ఉన్న ఏకైక మార్గం చర్చల ద్వారా సమస్యలను పరిష్కరిం చుకో వడం. అది ప్రాంతీయ సంక్షోభానికి దారితీ యకుండా చూసుకోవడం' అని వాన్స్ అన్నారు. గురువారం రాత్రి భారత్-పాక్ మధ్య ఘర్షణ పతాక స్థాయికి చేరింది. దీంతో పొరుగు దేశంలో నుంచి భారత్‌పైకి వచ్చిన దాదాపు 50 డ్రోన్లను సైన్యం కూల్చివేసింది.
మరోవైపు భారత్-పాకిస్థాన్ ఉద్రిక్తతలపై అమె రికా విదేశాంగశాఖ ప్రతినిధి టామీ బ్రూస్ స్పం దించారు. 'ప్రస్తుత ఉద్రిక్తతలు మరింత పెరగ కూడదన్నారు. ఇరు దేశాల మధ్య ఈ పరిస్థితి కొన్ని దశాబ్దాలుగా ఉంది. ఉగ్రదాడి తర్వాత మనం చూస్తున్నది ఆశ్చర్యమేమీ కాదు. కాకపోతే ఇవి మరింత పెరగకూడదు. చర్చలు జరగడానికి కమ్యూనికేషన్లు చాలా ముఖ్యం. అంతేకానీ, నిశ్శబ్ధంగా ఉండకూడదు. అమెరికా ఇప్పటికే గత రెండురోజుల నుంచి ఇరు దేశాల్లో వివిధ స్థాయి నాయకులతో మాట్లాడుతోంది. ఇక పాకి స్థాన్ పహల్గాం దాడిపై స్వతంత్ర దర్యాప్తును కోరుతోంది. మేము ఉగ్ర కుట్రదా రులను చట్టం ఎదుటకు తెచ్చి శిక్షించాలని కోరుతున్నాం' అని బ్రూస్ వెల్లడించారు.

# భారత్‌పై పాక్ సైబర్ దాడులు
### డాన్స్ ఆఫ్‌ది హిల్లరీ కొత్త వైరస్‌తో ప్రయోగం



**న్యూఢిల్లీ, మే 9:** పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. మంగళవారం రోజు అర్ధరాత్రి పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రస్థావరాలపై క్షిపణి దాడులు చేసింది. ఈ ఘటనలో 100 మంది ఉగ్రవాదులు హతమ వ్వగా ఆ దేశం సైతం భారత్‌పై ప్రతీకార చర్యలకు దిగింది. ఓవైపు ఎల్ఓసీ వెంట కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూనే దాడులకు పాల్పడుతోంది. అలాగే భారత్‌ను ఎలాగైనా దెబ్బ కొట్టాలనే ఉద్దేశంతో సరికొత్త సోషల్ వైరస్‌ను వ్యాప్తి చేస్తోంది. ముఖ్యంగా డ్యాన్స్ ఆఫ్ ద హిల్లరీ అనే వైరస్‌ను భారత ప్రజలపైకి ప్రయోగిస్తోంది. అయితే ఇదొక సైబర్ దాడి కాగా.. ఇది ఎక్కడ కనిపించినా దీన్ని క్లిక్ చేయొద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకార చర్యలు తీసుకుంటోంది. ఓవైపు దౌత్యపరంగా దాయాది దేశానికి చుక్కలు చూపిస్తూనే మరోవైపు మెరుపు దాడులు చేసింది. ఉగ్రస్థావరాలే లక్ష్యంగా క్షిపణి దాడులు చేయగా ఆ దేశం సైతం ప్రతిచర్యలకు పాల్పడుతుంది. ఎల్ఓసీ వెంట కాల్పులు జరుపుతూ, క్షిపణి దాడులు చేస్తూ దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తుండగా భారత్ ఆర్మీ సైతం వాటికి దీటుగా బదులిస్తోంది. మరోవైపు సరికొత్త సోషల్ వైరస్‌ను వ్యాప్తి చేస్తూ భారత ప్రజలకు చుక్కలు చూపించేందుకు ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా డ్యాన్స్ ఆఫ్ ద హిల్లరీ అనే వైరస్‌ను తాజాగా పాక్ భారత ప్రజలపైకి ప్రయోగిస్తోంది. అయితే ఇదొక సైబర్ దాడి కాగా ఇది ఎక్కడ కనిపించినా దీన్ని క్లిక్ చేయొద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత్, పాక్ ఉద్రిక్తతల వేళ దాయాది దేశం సైబర్ దాడికి ప్రయత్నిస్తోందని చెబుతున్నాయి. ముఖ్యంగా డ్యాన్స్ ఆఫ్ ద హిల్లరీ అనే వైరస్‌ను వ్యాప్తి చేస్తున్నట్లు వివరించారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ఈమెయిల్, టెలిగ్రామ్ వంటి యాప్లలో ఇది వ్యాప్తి అవుతుం డగా దీనికి సంబంధించిన లింక్ ఎక్కడ కనిపిం చినా దాన్ని క్లిక్ చేయొద్దని వివరిస్తు న్నాయి. దీనిపై క్లిక్ చేస్తే ఫోన్, ల్యాప్‌టాప్ లలో ఉన్న డేటా సహా బ్యాంకు వివరాలు వంటివి కూడా హ్యాక్‌కు గురవుతాయని పేర్కొం టున్నాయి. రహస్య సమాచారాన్ని దొంగిలిం చడానికి, డిజిటల్ పరికరాలను దెబ్బ తీయడం కోసం ఈ వైరస్ రూపొందించారు. పాకిస్థాన్‌కు చెందిన సైబర్ నేరగాళ్ల తయారు చేసిన ఈ వైరస్ హానికరమైన మాల్వేర్ అని తెలుస్తోంది. ఫోన్లలో ఏవైనా ఫైల్స్ ఓపెన్ చేయడానికి వినియోగదా రులు ప్రయత్నిస్తుంటే ఈ వీడియో, లింక్ కనిపిస్తుంది. పొరపాటున దీన్ని క్లిక్ చేశారంటే క్షణాల్లోనే వైరస్‌ను మీ ఫోన్ లేదా ల్యాప్‌టాప్‌లో ఇన్‌స్టాల్ చేస్తుంది. ఆపై హ్యాకర్లకు మీ ఫోన్‌పై పూర్తి నియంత్రణను అందజేస్తుంది. ఫోన్ లేదా ల్యాప్‌టాప్‌లో ఈ వైరస్ ఇన్‌స్టాల్ అయిందంటే బ్యాంకింగ్ పాస్‌వర్డులు, వ్యక్తిగత సమాచారన్ని హ్యాకర్లకు అందజేస్తుంది. రహస్యమైన ఫైళ్లను కూడా యాక్సెస్ చేసి లీక్ చేయగల్గుతుంది. అలాగే మీ పరికారలను స్లో చేయడం, క్రాష్ చేయడం వంటివి కూడా చేస్తుంది. ఫోన్లు, కంప్యూటర్లు వేటిలో అయినా సరే ఈ వైరస్ ఇన్‌స్టాల్ అయితే హ్యాకర్లు ఏమైనా చేయగల్గు తారు. మీ పరికరాలను మీ ఆధీనంలోంచి సులు వుగా వారి ఆధీనంలోకి తీసుకుంటారు. యాం టీవైరస్ సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ఛండీఘర్, జమ్ములో సైరన్ల మోత

### తీవ్ర స్థాయికి చేరిన ఉద్రిక్తత

**చండీఘర్, మే 9:** భారత్‌పాక్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరుకుంటున్నాయి. సరిహద్దు జిల్లాలపై పాక్ వైపు నుంచి ముప్పు పొంచి ఉండటం వల్ల అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలోనే చండీగఢ్‌లో వైమానికదళం శుక్రవారం సైరన్లు మోగించి హెచ్చరిక జారీ చేసింది. దాడులు జరిగి అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. బాల్కనీల్లోకి కూడా రావొద్దని స్పష్టం చేసింది. అటు జమ్ములోనూ శుక్రవారం ఉదయం సైరన్లు మోగాయి. ఈ తెల్లవారుజామున 4.15 గంటల ప్రాంతంలో పేలుడు శబ్దాలు వినిపించినట్లు సమాచారం. దీంతో ఆ నగరాన్ని బ్లాక్‌అవుట్ చేశారు. సరిహద్దు జిల్లాల్లో పాకిస్థాన్ నుంచి వస్తోన్న డ్రోన్లను భారత బలగాలు సమర్థంగా



కూల్చేస్తున్నాయి. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో ఓ హోటల్ ప్రాంగణంలో పాక్ డ్రోన్ శకలాలు లభ్యమయ్యాయి. అధికారులు ఆ శకలాలను పరిశీలిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో ఈ దాడి జరిగింది. బీఎస్ఎఫ్ క్యాంప్‌ను లక్ష్యంగా చేసుకొని డ్రోన్‌ను పంపగా, భద్రతా బలగాలు కూల్చేశాయి. మరో వైపు దేశవ్యాప్తంగా జరగాల్సిన సీఏ పరీ క్షలు వాయిదా పడ్డాయి. భారత్‌పాక్ నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో పరీక్షల వాయిదా నిర్ణయం తీసుకున్నట్లు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ప్రక టించింది. మే 9 నుంచి 14 వరకు జరగాల్సి న సీఏ ఇంటర్మీడియట్, ఫైనల్, పోస్ట్ క్వాలిఫికేషన్ పరీక్షలు వాయిదా పడ్డాయని, ఈ షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని తెలిపింది. దీనికి సం బంధించిన సమాచారం కోసం పరీక్షకు నమోదు చేసుకున్న అభ్యర్థులు ఐసిఎఐ వెబ్‌సైట్‌లో అధికారిక నోటీసును తనిఖీ చేసుకో వాలని సూచించింది. మునుపటి షెడ్యూల్ ప్రకారం దితి పరీక్షలు మే 2నుంచి 14 వరకు జరగాల్సి ఉంది. గ్రూప్ 1 అభ్యర్థులకు సిఎ ఇంటర్ పరీక్ష మే 3, 5, 7 తేదీల్లో, గ్రూప్ 2 పరీక్షలు మే 9, 11, 14 తేదీల్లో జరగాల్సి ఉంది. గ్రూప్ 1తుది పరీక్ష మే 2, 4,6 తేదీల్లో నిర్వహించగా, గ్రూప్ 2పరీక్ష మే 8,10,13 తేదీలలో జరగాలి.

# కీలక భద్రతా సమావేశాలు జరిపిన అమిత్ షా

**న్యూఢిల్లీ, మే 9:** ఆపరేషన్ సిందూర్‌తో భారత్, పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతు న్నాయి. పాక్ రెచ్చగొట్టే చర్యలకు దీటుగా బదులిచ్చేందుకు కేంద్రం అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. అన్ని అత్యవసర వ్యవస్థల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. ఈ క్రమంలో వరుస భేటీలు జరుగుతున్నాయి. తాజాగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా , డైరెక్టర్ జనరల్ ఆఫ్ బిఎస్ఎఫ్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ సిఐఎస్ఎఫ్, హోంశాఖలోని సీనియర్ అధికారులతో భేటీ అయ్యారు. సరిహద్దుల్లో, విమానాశ్రయాల్లో భద్రతా ఏర్పాట్లను సమీక్షిం చారు. ఈ సమావేశానికి జాతీయ భద్రతా సల హాదారు అజిత్ దోభాల్ కూడా హాజరయ్యారు. కేంద్రమంత్రి నివాసంలో ఈ భేటీ జరిగింది. చొరబాటు ఘటనలు చోటుచేసుకుంటున్న తరు



ణంలో పాక్‌తో సరిహద్దు పంచుకుంటున్న ఆయా రాష్ట్రాలు ఇప్పటికే కీలక చర్యలు చేప ట్టాయి. మనదేశంలోకి చొరబాటుకు యత్నించిన పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తిని పంజాబ్ సరిహద్దు వద్ద బిఎస్ఎఫ్‌కు చెందిన జవాన్లు హతమార్చిన సంగతి తెలిసిందే. రాజస్థాన్‌లో 1,037 కిలోమీటర్లున్న పాక్ సరిహద్దును మూసివేశారు. ఎవరైనా సరిహద్దుల వద్ద అనుమానాస్పదంగా వ్యవహరిస్తే కాల్చివేసేలా ఉత్తర్వులు జారీ చేశారు. జమ్మూకశ్మీర్‌లోని సాంబ జిల్లాలో సరి హద్దు దాటి చొరబడేందుకు పాక్ ఉగ్రవా దులు చేసిన ప్రయత్నాలను బిఎస్ ఎఫ్ తిప్పికొట్టింది. కనీసం ఏడుగురు ఉగ్రవా దులను మట్టుపెట్టి నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. పాకిస్థాన్ నేడు కూడా నియంత్రణ రేఖకు ఆవలివైపు నుంచి భారీస్థాయిలో షెల్లింగ్ కొనసాగిస్తోంది. ముఖ్యం గా ఉరి, జమ్మూకశ్మీర్ ప్రాంతాల్లో వీటి తీవ్రత ఎక్కువగా ఉంది. చాలామంది ప్రజలు ఇప్పటికే ఈ ప్రాంతాల్లో ఇళ్లు ఖాళీ చేసి వెళుతున్నారు.

## రుణాల కోసం పాకిస్థాన్ వెంపర్లాట
### 'ఎక్స్' ఖాతా హ్యాక్ అంటూ బుకాయింపు

**ఇస్లామాబాద్, మే 9:** భారత ఆర్మీ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' ఎఫెక్ట్ పాకిస్థాన్‌పై తీవ్రం గానే పడింది. దీంతో పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. భారత్‌పై దు ర్మార్గపు దాడులకు పాల్పడుతూ ఆర్థికంగా మరింత కిందికి దిగ జారిపోయింది. వాటి నుంచి బయటపడేందుకు అంతర్జాతీయ సంస్థల నుంచి రుణాల కోసం వెంపర్లాడుతోంది. తమకు ఆర్థిక సాయం చేయాలని సోషల్ మీడియా వేది కగా పోస్టుపెట్టింది. ఇందులో భారత్‌పై అక్కసు వెళ్లగక్కడంతో నెట్టింట విపరీతంగా విమర్శలు ఎదుర్కొంది. దీంతో తాము రుణాల కోసం ఏ పోస్టు చేయలేదని తమ 'ఎక్స్' ఖాతా హ్యాక్ అ యిందని ప్రకటించడం గమనార్హం. దానిని సమ ర్థించుకొనేందుకు 'ఫ్యాక్ట్ చెక్' చేసినట్లు ఆ దేశ సమాచార శాఖ ఓ పోస్టు చేసింది. **పాకిస్థాన్‌కు రుణాలు ఇవ్వొద్దు: భారత్** పాకిస్థాన్‌కు అంతర్జా తీయ సంస్థల నుంచి ఎలాంటి రుణాలు రాకుం డా అడ్డుకొనేందుకు భారత్ తీవ్రంగా ప్రయ త్నిస్తోం దని కథనాలు వస్తున్నాయి. ఇప్పటికే భారత్ విధానం ఏమిటో విదేశాంగ కార్యదర్శి విక్రంమిస్రీ స్పష్టతఇచ్చారు. అంతర్జాతీయ మాని టరీఫండ్ (ఐఎంఎఫ్)తో భేటీ కానున్న నేప థ్యంలో పాక్'పోస్టులు' ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# మహిళా అధికారుల స్థైర్యాన్ని దెబ్బతీయకండి
### కేంద్రానికి సుప్రీం బెంచ్ చురకలు

**న్యూఢిల్లీ, మే 9:** స్వల్పసేవా కమిషన్ కింద ఎంపికయిన మహిళా ఆర్మీ అధికారులకు శాశ్వత కమిషన్ నిరాకరించడంపై దాఖలయిన పిటి షన్లను సుప్రీంకోర్టు విచారించింది. వారి స్థైర్యా న్ని దెబ్బతీయవద్దంటూ భారత్ పాక్ ఉద్రిక్త పరిస్థితులను పరోక్షంగా ప్రస్తావించింది. ప్రస్తుతానికి సర్వీసునుంచి విడుదలచేయొద్దని కేంద్రాన్ని ఆదేశించింది. వారు చాలా తెలివైన అధికారులని, మీరు వారి సేవలనువేరేచోట ఉప యోగించుకోవచ్చని, ఇది కోర్టుచుట్టూ తిరగా ల్సిన సమయం కాదని, దేశానికి సేవచేయడానికి వారికంటూ మంచి స్థానం ఉందని సుప్రీం ధర్మాసనం వెల్లడించింది. విచారణలో కేంద్రం మీడియాకు తెలిపిన ఇద్దరు మహిళా అధికారుల్లో ఒకరైన కల్నల్ సోఫియా ఖురేషిగురించి ప్రస్తావించారు. ఇదే విషయంలో సోఫియా గతంలోసుప్రీంకోర్టును ఆశ్రయించారని ఇపుడు ఆమె దేశాన్ని గర్వపడేలాచేస్తున్నారన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్నకోర్టు తదుపరి విచారణవరకూ పిటిషన్లు వేసిన అధికారులను విడుదలచేయవద్దని ఆదేశాలు జారీచేసింది. ఆర్మీలో తమకూ శాశ్వత కమిషన్ అవకాశం కల్పిం చాలని మహిళా సైనిక అధికారులు కొన్నేళ్లపాటు న్యాయపోరాటంచేసారు. ఆ సందర్భంగాకల్నల్‌సోఫియా విజయపరంపర సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి వచ్చింది. ఆమె



తరపున అడిషనల్ సొలిసిటర్‌జనరల్‌ఐశ్వర్య భాటి వాదనలు వినిపించారు. వారిని షార్ట్ సర్వీస్ నుంచి విడుదల చేయడానికి సంబంధించి ఎలాంటి స్టే ఉత్తర్వులు ఇవ్వవద్దని కోర్టును కోరారు. భారత సైన్యానికి యువ అధికారులు అవసరమని, ప్రతి ఏటా 250 మందిసిబ్బందికి మాత్రమే శాశ్వతకమిషన్ మంజూరు చేస్తున్నా రన్నారు. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది ఆపరేషన్ సింధూర్‌గురించి సేవలను చూపుతూ మహిళలు ఆర్మీలో శాశ్వతకమిషన్‌కు అర్హులేనంటూ 2020 ఫిబ్రవరి 17న ఇచ్చిన తీర్పులో స్పష్టంచేసింది. అప్పటివరకూ ఆర్మీలో మహిళా అధికారుల సేవలనుషార్ట్‌సర్వీస్‌కమిషన్‌కే పరిమితంచేసారు. మహిళల శారీరక స్వభావాన్ని సామాజిక జీవన వాతావరణాన్ని సాకుగాచూపిస్తూ వారికి శాశ్వత కమిషన్ నిరాకరిస్తున్నారు. ఈ వాదనలను సమ ర్థించలేమని తాజాగా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

# ఎన్ఇపి అమలు కోసం ఏరాష్ట్రాన్ని బలవంతపెట్టలేం..
### తమిళ వ్యక్తి పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీం



**న్యూఢిల్లీ, మే 9:** జాతీయ విద్యా విధానం (ఎన్ ఈపీ) 2020 అమలుచేయాలని ఏ రాష్ట్రాన్ని బలవంతం చేయలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. ఎన్ఈపీని అమలు చేసేలా తమిళనాడు రాష్ట్రా నికి ఆదేశాలు ఇవ్వాలంటూ జీఎస్ మణి దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత ధర్మాసనం శుక్రవారం కొట్టివేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం ఏ రాష్ట్రాన్ని కూడా ఎన్ఈపీని స్వీకరించాలని సుప్రీంకోర్టు కచ్చితంగా చెప్ప లేదని జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం వివరిం చింది. రాష్ట్రాలు జాతీయ విద్యా విధానం 2020ని స్వీకరించాలా, వద్దా అనేది సంకటమైన సమస్య. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ద్వారా సుప్రీంకోర్టు పౌరుల హక్కులను పరిరక్షించడానికి ఆదేశాలు జారీ చేయవచ్చు. జాతీయ విద్యా విధానం 2020 వంటి విధానాన్ని స్వీకరించమని నేరుగా చెప్పలేదని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, జాతీయ విద్యా విధానానికి సంబంధించి రాష్ట్రం తీసుకునే ఏదైనా చర్య ప్రాథమిక హక్కును ఉల్లంఘిస్తే కోర్టు తప్పకుండా జోక్యం చేసుకుంటుందని వెల్లడించింది. అయితే, జాతీయ విద్యా విధానానికి సంబంధించి రాష్ట్రం తీసుకునే ఏదైనా చర్య ప్రాథమిక హక్కును ఉల్లంఘిస్తే కోర్టు తప్పకుండా జోక్యం చేసుకుంటుందని వెల్లడించింది. ఈ సందర్భంగా పిటిషనర్‌ను ఉద్దేశించి ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. మీరు ఎవరు? జాతీయ విద్యా విధానంతో మీకు సంబంధం ఏమిటి? ఈ విషయంలో ఎందుకు ఆసక్తి చూపుతున్నారని కోర్టు పిటిషనర్‌ను అడిగింది. తాను తమిళనాడుకు చెందినవా డినని, ఇప్పుడు ఢిల్లీలో ఉంటున్నట్లు పిటిషనర్ కోర్టుకు తెలిపారు. తమిళనాడు పాఠశాలల్లో హిందీ బోధించకపోవడం వల్ల హిందీని సుల భంగా నేర్చుకోలేకపోతున్నానని ఆయన అన్నారు. పిటిషనర్ తమిళనాడుకు చెందినవాడు కావొచ్చని, అయినప్పటికీ అతను ఢిల్లీలో నివసిస్తున్నారని, ఇక్కడ హిందీ నేర్చు కోవచ్చని జస్టిస్ పార్దివాలా అభిప్రాయపడ్డారు. ఒక రాష్ట్రం తీసుకునే ఏదైనా చర్య ఎన్ఈపీకి వ్యతిరేకంగా ఉంటే, కోర్టు జోక్యం చేసుకోవచ్చని కోర్టు చెప్పింది. అయితే ఈ పిటీషన్ లో అలాం టిదేమీ కనిపించలేదని వివరించింది. రాష్ట్రంలో ఎన్ఈపీని అమలు చేయబోమని ఇటీవల తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ చెప్పారు. త్రిభాషా సూత్రం ప్రకారం హిందీని రుద్దే ప్రయత్నమని ఆయన అన్నారు.

# తక్కువ కాలంలో ఎక్కువ కేసులు పరిష్కరించిన జడ్జి డా.జస్టిస్ కె.మన్మధరావు

## - రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్



జస్టిస్ మన్మధరావు వీడ్కోలు సభలో రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ తదితరులు

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** అనతి కాలంలోనే అత్యధికంగా 1100 కేసులకు పైబడి పరిష్కరించిన జడ్జి డా.జస్టిస్ కె.మన్మధరావు అని రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ అభినందించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తిగా సేవలు అందజేస్తున్న డా.జస్టిస్ కె.మన్మధరావు కర్ణాటక హైకోర్టుకు బదిలీపై వెళుతున్న సందర్భంగా శుక్రవారం హైకోర్టు మొదటి కోర్టు హాల్లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ వీడ్కోలు కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మధరావు సేవలను కొనియాడారు. 2021 డిశంబరు 8 న హైకోర్టు జడ్జిగా భాధ్యతలు చేపట్టిన వీరికి న్యాయ శాస్త్రము, న్యాయ వృత్తిపై ఎంతో పట్టు, అనుభం ఉండటమే కాకుండా మంచి కృషి, పట్టుదల, అంకితభావంతో న్యాయ వ్యవస్థకు గణనీయమైన సేవలు అందజేశారని ప్రశంసించారు. స్నేహశీలి, మర్యాదస్థుడు మరియు కష్టపడి పనిచేసే మనస్తత్వం ఉన్న వీరు పరిపాలనా పరంగా, పలు కమిటీల్లో సభ్యులుగా కూడా మంచి సేవలను అందజేశారన్నారు. 2014 లో డా.బి.ఆర్.అంబేద్కర్ జ్ఞాన విజ్ఞాన రత్న అవార్డును పొందిన వీరు న్యాయవ్యవస్థలోని అన్ని విభాగాల్లో చట్టపరమైన చతురతలో నైపుణ్యాన్ని ప్రదర్శించారని ప్రశంసించారు. కర్ణాటక హైకోర్టుకు బదిలీపై వెళుతున్న వీరు అంకితభావం సేవలు అందజేస్తూ కర్ణాటక హైకోర్టు ప్రతిష్టను మరింత ఇనుమడింపజేస్తారని ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. కర్ణాటకా హైకోర్టు కు బదిలీపై వెళుతున్న డా. జస్టిస్ కె.మన్మధరావు మాట్లాడుతూ అందరి సహాకారంతో ఎన్నో సంవత్సరాలుగా నిజాయితీ, క్రమశిక్షణ మరియు బలమైన కర్తవ్య భావనతో న్యాయ వ్యస్థకు గణనీయమైన సేవలు అందజేయడం జరుగుచున్నదన్నారు. న్యాయ మూర్తి పదవి గౌరవాన్ని, ప్రతిష్టను ఇనుమడించే విధంగా కేవలము 727 రోజుల్లోనే 11,972 కేసులను పరిష్కరించి వాజ్యదారులకు సంతృప్తికరమైన సేవలను అందజేయడం జరిగిందన్నారు. న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించిన వారిని ఎవ్వరినీ నిరుత్సాహపర్చకుండా ఎన్నో గంటల పాటు వారి వేదనలను ఆలకిస్తూ సంతృప్తికర స్థాయిలో వారికి తగిన న్యాయాన్ని అందజేయడం జరిగిందన్నారు.

# గిరిజన ప్రాంతాల్లో ఇక డోలీ మోతలు ఉండవు

## గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని అన్ని గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, మంచి నీరు, రోడ్లను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని గిరిజన సంక్షేమం,మహిళా శిశు సంక్షేమశాఖల మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. రాష్ట్రంలోని 9 ఐటీడీఏ పీవోలు, ఇతర లైన్ డిపార్ట్ మెంట్ల అధికారులతో కలిసి సమీక్షా సమావేశాన్ని మంత్రి శుక్రవారం విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి మాట్లాడుతూ జూన్ లో స్కూల్స్ ప్రారంభించే నాటికి అన్ని స్కూల్స్ లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అందుకు మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో రూ. 156 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించామన్నారు. 4,000 పై చిలుకు గిరిజన గ్రామాల్లోని ప్రజలకు త్రాగు నీరు అందించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారని ఇప్పటికే దాదాపు మెజారిటీ గ్రామాల్లో త్రాగు నీరు అందించామన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, త్రాగు నీరు, సాగు నీరు, రోడ్లు ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. అందుకనుగుణంగా చర్యలు తీసుకోవడంతోపాటు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తీసుకున్న చర్యలను ఈ సమీక్షా సమావేశంలో పరిశీలించామన్నారు. గిరిజన ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాల్లో కూడా ఐసీడీఎస్ కార్యక్రమాలను అనుసంధానం చేస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లో పిల్లలకు మంచి పౌష్టిక ఆహారం అందించేలా చర్యలు చేపట్టామన్నారు. 2,000 అంగన్ వాడీ కేంద్రాలు, 1268 మినీ అంగన్ వాడీ కేంద్రాలు గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్నాయన్నారు. వీటి ద్వారా గర్భిణీలకు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. పూరి గుడిసెల్లో ఉన్న వారికి పక్కా ఇళ్లు కట్టించాలి అని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారన్నారు. గ్రామాల్లో 3 సెంట్లు, మున్సిపాలిటీల్లో 2 సెంట్ల స్థలం ఇచ్చి అందులో పక్కా ఇళ్ల నిర్మాణం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.



ఆప్కో వస్త్రాలను పరిశీలిస్తున్న చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా

# గణనీయ లాభార్జన దిశగా ఆప్కో

### -చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా

**విజయవాడ, మే 9,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలోని ఆప్కో కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (చేనేత జౌళి ) ఆర్‌పి సిసోడియా అధ్యక్షతన ఆప్కో , లేపాక్షి సంస్థల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రెండు సంస్థల ప్రస్తుత పనితీరు, అభివృద్ధి అవకాశాలపై సమగ్రంగా చర్చించారు. మేనేజింగ్ డైరెక్టర్ విశ్వ సంస్థల కార్యకలాపాల ప్రస్తుత స్థితిగతులు, భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ ఆప్కో, లేపాక్షి సంస్థలు నష్టాల నుంచి లాభదాయక మార్గంలోకి వెళ్లేలా సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. అన్ని ఉత్పత్తులను ఒకే షోరూమ్‌లో అందుబాటులో ఉంచే విధంగా షోరూం సమాఖ్య పద్ధతిలో అభివృద్ధి చేయాలని సూచించారు. తద్వారా బ్రాండ్ గుర్తింపు పెరగడమే కాక, వినియోగదారులకు సమగ్ర కొనుగోలు అనుభూతి కలుగుతుందని పేర్కొన్నారు. మార్కెటింగ్ ఆధునీకరణ క్రమంలో, ప్రత్యేక మొబైల్ యాప్ అభివృద్ధి చేయడం, వాట్సాప్ ద్వారా మార్కెటింగ్ చేయడం వంటి డిజిటల్ పద్ధతులపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ మార్గాల్లో యూత్, నూతన వినియోగదారులను చేరుకోవచ్చని అభిప్రాయపడ్డారు. ఇతర ఆదాయ మార్గాల అన్వేషణలో భాగంగా షోరూంల్లో ప్రైవేట్ ప్రకటనల కోసం స్థలాన్ని అద్దెకు ఇచ్చి అదనపు ఆదాయం పొందేలా చేయాలని సూచించారు.

# తిరుమల సమాచారం

## శ్రీవారి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలి



**తిరుమల,మే 9ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని వేడుకున్నట్లు తమిళనాడు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టీస్ కెఆర్ శ్రీరామ్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఆయన కుటుంబంతో కలసి ఉదయం ప్రోటోకాల్ విఐపి బ్రేక్ దర్శనంలో ఇష్టదైవమ్ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఉద్రిక్తతల సమయంలో తిరుమల ఆలయంపై విమానాలు

**తిరుమల, మే 9ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో గత రెండురోజులుగా తిరుమల శ్రీవారి ఆలయంపై విమానాలు వెళ్ళడం ఆందోళన కలిగిస్తోంది. ఓ వైపు నోఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించాలని ఆలయ అర్చకులు, భక్తులు కోరుతున్నా అటు కేంద్రం ఇటు రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండటం, ఇప్పుడు పాకిస్థాన్‌తో ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో ఆలయంపై విమానాలు వెళ్ళడం పెద్దగా ఆందోళనకరంగా మారింది. శుక్రవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు మూడు విమానాలు వెళ్ళడంతో భక్తులు మరింత ఆందోళన రేకెత్తిస్తున్నారు.దీనిపై టిటిడి ఆలయ అధికారులు, విజిలెన్స్ వెంటనే పరిస్థితులు చక్కదిద్దాలని భక్తులు కోరుతున్నారు.సాధారణంగా వెళ్ళే విమానాలా లేక మరే విమానాలు అయినా ప్రయాణిస్తున్నాయా అనే అనుమానాలు భక్తుల్లో నెలకొంది.

## ప్రజలు సంతోషంగా ఉండాలి : బండ్లగణేష్



**తిరుమల,మే 9ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు అన్ని విధాలా అభివృద్ధిచెందేలా పథకాలు అమలుచేస్తున్నారని ఎంఎల్‌సి సోమువీర్రాజు తెలిపారు. తిరుమలలో భక్తులకు సౌకర్యాలు మెరుగపడ్డాయని, గతంలో కంటే స్వామివారి దర్శనం కూడా సంతోషంగా చేసుకునేలా టిటిడి అధికారులు చూస్తున్నారన్నారు. శుక్రవారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. అలాగే సినీనిర్మాత బండ్ల గణేష్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

## సైనికులకు, దేశ నాయకత్వానికీ దైవ బలం తోడవ్వాలని షష్ట షణ్ముఖ క్షేత్రాల్లో జనసేన పూజలు

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:**ఆపరేషన్ సిందూర్.పాకిస్థాన్ మీద చేస్తున్న ధర్మ యుద్ధానికి ప్రతి ఒక్కరి నైతిక మద్దతు అవసరమనీ, శత్రు మూకలపై పోరాడుతున్న సైన్యానికి, దేశానికి నాయకత్వం వహిస్తున్న గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకు దైవ బలం, ఆశీస్సులు ఉండేలా భగవంతుణ్ణి ప్రార్థించాలని జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. శత్రు సేనలను కట్టడి చేసి, దేశాన్ని కాపాడే గొప్ప శక్తిసామర్థ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం మన త్రివిధ దళాలకు మెండుగా ఉన్నాయి... వారి కోసం దేశమంతా ప్రార్థించే సమయమిది అన్నారు. జనసేన పార్టీ పక్షాన మంగళవారం ఉదయం షష్ట షణ్ముఖ క్షేత్రాలైన తిరుత్తణి, తిరుచెందూరు, పళని, తిరుపరం కుండ్రమ్, స్వామిమలై, పలముదిరచోళై క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు చేయించాలని పవన్ కల్యాణ్ గారు నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రతి క్షేత్రానికి ఒక శాసన సభ్యుడు, జన సైనికులను పంపించి పూజలు చేయిస్తారు. అదే విధంగా కర్ణాటకలోని కుక్కే, ఘాటీ సుబ్రహ్మణ్య క్షేత్రాలు, ఆంధ్రప్రదేశ్ లోని మోపిదేవి, బిక్కవోలులోని సుబ్రహ్మణ్య ఆలయాలు, ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర ఆలయం, పిఠాపురం శ్రీ పురుహూతిక దేవి ఆలయాల్లో పూజలు చేయించాలని శ్రీ పవన్ కల్యాణ్ తెలిపారు.

# పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలి

## రాష్ట్ర ఎంఎస్ఎంఇ మంత్రి కొండపల్లిశ్రీనివాస్

**కొత్తవలస ( విజయనగరం జిల్లా ) మే 9 ( ప్రభాతవార్త ):** ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకొని, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేసే కార్యక్రమంలో భాగంగా జిల్లాకు మొదటివిడతలో మంజూరైన నాలుగు పార్కుల్లో, మొట్టమొదటి పార్కుకు బలిఘట్టంలో శుక్రవారం శంకుస్థాపన చేశారు. సుమారు 57 ఎకరాల విస్తీర్ణంలో, దాదాపు రూ.7కోట్ల వ్యయంతో ఈ పార్కును అభివృద్ధి చేయనున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వం ఒకవైపు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూనే అభివృద్ధిపై దృష్టి పెట్టిందని అన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తోందని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచం భారతదేశంవైపు చూస్తోందని, దేశంలో ఏర్పాటయ్యే పరిశ్రమలను రాష్ట్రంలో ఏర్పాటు చేయించేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని అన్నారు. పరిశ్రమలను స్థాపించేవారికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయనున్నామని, దీనిలో భాగంగా మొదటివిడత 50 పార్కులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లాకు మొదటి దశలోనే నాలుగు పార్కులను మంజూరు చేశారని, వీటిని ఎస్.కోట, గజపతినగరం, బొబ్బిలి, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పరిశ్రమలను పెట్టేవారికి ఈ పార్కుల్లో అన్ని వసతులతో కూడిన స్థలాలను కేటాయిస్తామని, వివిధ పథకాల క్రింద 25 శాతం నుంచి 45 శాతం వరకు సబ్సిడీ, విద్యుత్ ఛార్జీల్లో, పన్నుల్లో రాయితీ, బ్యాంకులనుంచి రుణాలు తదితర ప్రోత్సాహకాలు ఉన్నాయని తెలిపారు. యువత, మహిళా సంఘాలు పరిశ్రమలను స్థాపించేందుకు ముందుకు రావాలని కోరారు. వీటివల్ల తాము ఉపాధి పొందడమే కాకుండా, మరికొంతమందికి ఉపాధి కల్పించినవారు అవుతారని మంత్రి పేర్కొన్నారు. బలిఘట్టంలో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్కులో సుమారు రూ.96 కోట్ల పెట్టుబడితో 76 చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశం ఉందని, 1500 మందికి ప్రత్యక్షంగా, 500 మందికి పరోక్షంగా ఉపాధి లభించే అవకాశం ఉందని చెప్పారు. ఎస్.కోట ఎంఎల్ఏ కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ, మొదటి దశలోనే తమ నియోజకవర్గానికి ఎంఎస్ఎంఈ పార్కును మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి, మంత్రి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

2014లోనే ఇక్కడ ఈ పార్కును ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారని, అది ఇన్నాళ్లకు కార్యరూపం దాలుస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని కోరారు.

## దేశ ప్రతిష్టను కాపాడుతున్న సైనికులకు సెల్యూట్

### కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్

**తిరుపతి,మే 9ప్రభాతవార్తప్రతినిధి:** భారత్-పాకిస్థాన్ యుద్ధవాతావరణంతో భారత దేశ ప్రతిష్టను కాపాడుతున్న సైనికులకు తలవంచి సెల్యూట్ చేస్తున్నామని కాంగ్రెస్ మాజీమంత్రి డాక్టర్ చింతామోహన్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తరపున సైనికులకు పూర్తిమద్దతు తెలియజేస్తున్నామన్నారు. గత సంవత్సర కాలంలో టిటిడి పరిపాలన భవనం వద్ద కాంగ్రెస్ పార్టీ 30సార్లు ఆందోళన చేపట్టిందన్నారు. టిటిడిలో పనిచేసే అర్చకులకు, ఉద్యోగులకు ఇళ్ళస్థలాలు ఇవ్వాలని కోరామని, అలిపిరినుండి పేరూరు వరకు ఉన్న 400 ఎకరాల్లో ఐదేసి సెంట్లు ఇవ్వాలన్నారు. తిరుమల కొండకు సిఎం చంద్రబాబు అనేక దఫాలుగా వచ్చారని, అయినా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. టిటిడిలో ఎన్ఎంఆర్‌లను రెగ్యులర్‌చేయాలన్నారు.

# దేవుని చెంత ఉచిత వివాహాలకు కల్యాణవేదిక ముస్తాబు

**తిరుమల,మే 9ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న తిరుమలకొండపై ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ఆయన చెంత పేద,మధ్యతరగతి వర్గాల యువతీయువకులు ఉచితంగా కల్యాణాలు చేసుకునేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. ఇందుకోసం తిరుమలలోనే పాపవినాశనమ్ మార్గంలో అత్యాధునిక సౌకర్యాలతో కల్యాణవేదికను నిర్మించి అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. ఇందుకు తెలుగురాష్ట్రాలనుండేగాక దేశం నలుమూలల నుండి కూడా యువతీయువకుల కుటుంబాలు ఆన్‌లైన్‌లోనే వారివారికి ఇష్టమైన తేదీల్లో బుక్‌చేసుకునేలా అవకాశం ఉంది. తిరుమలలో టిటిడి నిర్వహిస్తున్న ఉచిత వివాహాలకు నూతన వధూవరుల నుండి విశేష స్పందన లభిస్తోంది. 2016 ఏప్రిల్ 25నుండి 2025 మేనెల 1వరకు 26,214 వివాహాలు అయ్యాయి. ఇందులో పురోహితుడు,మంగళవాయిద్యంతోబాటు పెళ్ళిసమయంలో పసుపు,కుంకుమ,కంకణంను టిటిడి ఉచితంగా అందిస్తుంది.

## ఈదురుగాలులతో తిరుపతిలో నేలకొరిగిన భారీ చెట్లు, విద్యుత్ స్తంభాలు

**తిరుపతి,మే 9 ప్రభాతవార్తప్రతినిధి:** ఎండాకాలంలో వాతావరణంలో మార్పులతో గత వారంలో కేవలం అరగంటసమయం భారీ ఈదురుగాలులు,వర్షానికే తిరుపతి నగరం హడలిపోయింది.ఎక్కడబడితే అక్కడ భారీ చెట్లు నేలకొరిగి విద్యుత్‌స్తంభాలు కూలిపోయాయి. 24గంటలు పైగా విద్యుత్ సరఫరా పునరుద్దరణచేయలేని దుస్థితి నెలకొంది. అలాంటిది వరుసగా నాలుగైదు రోజులు భారీ వర్షాలు కురిస్తే తిరుపతిలో వరదనీరు ప్రవహించలేని పరిస్థితి ఉంది. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త.ప్లాస్టిక్ కవర్లతో ప్రధాన మురికికాలువలు పేరుకుపోవడం, కాలనీల్లో మురికినీటి కాల్వలు చాలావరకు వెడల్పులేకపోవడం వంటి ప్రధాన సమస్యలు నేటికీ ఎదురవుతున్నాయి. తిరుపతిపుణ్యక్షేత్రానికి వరదనీటితో ముప్పు తప్పదనే ఆందోళన సీనియర్ సిటిజన్లు, పర్యావరణ శాస్త్రవేత్తల్లో వ్యక్తమవుతోంది. ఆధ్యాత్మిక నగరంగా విరాజిల్లుతున్న తిరుపతికి వరదముప్పు పొంచి వుందా!? భారీగా వరదలు వచ్చి ఊహించనిరీతిలో వర్షాలు కురిస్తే వరదనీరు ప్రవహించడానికి సరైన కాలువలు లేక ఆక్రమణలకు గురయ్యాయి. నగరంలో చాలావరకు కాలనీలు మురికికాల్వలు ఆక్రమణలకు గురవడం, కాల్వలపైనే అపార్టుమెంట్లు నిర్మించేయడం, చెరువులు,గుంటల ప్రాంతాల్లో కాలనీలు ఏర్పడి భవనాలు వెలిశాయి.

దీంతో వరదనీరు బయటకు వెళ్ళలేని పరిస్థితి ఉంది. రెండేళ్ళ క్రిందట తిరుపతినగరంలో కురిసిన భారీ వర్షాలకు పాత రేణిగుంటరోడ్డు, తిరుచానూరురోడ్డు, లక్ష్మీపురంకూడలి ప్రాంతాల్లో ప్రధాన రోడ్లు మినీచెరువులుగా దర్శనమిస్తాయి.

# భారతసైన్యం గెలుపుకోసం దుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు

### - దుర్గమ్మ ఆలయానికి నూతన ఇఒగా వికె శీనా నాయక్



కలెక్టర్ లక్ష్మీషాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఇఓ

**ఇంద్రకీలాద్రి, మే 9, ప్రభాతవార్త** భారతదేశ రక్షణకోసం అహరహం శ్రమిస్తూ తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న భరతమాత ముద్దుబిడ్డలైన భారతసైన్యం మరింత శక్తిమంతమవ్వాలని, వారంతా క్షేమంగా జరిగే పోరులో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ శుక్రవారం దుర్గమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. దేశం క్షేమంగా వుండాలని, దేశపౌరులంతా సంతోష సౌభాగ్యాలతో వర్ధిల్లాలని దుర్గమ్మవారిని వేడుకున్నామన్నారు. దుర్గమ్మవారి ఆలయానికి నూతన ఇఒగా వికె శీనా నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కుటుంబంతో సహా దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నూతన ఇఒకు వేదపండితులు వేదాశీర్వచనాలందించారు. అనంతరం నూతన ఇఒ దేవస్థానంలోని పలు విభాగాలను పరిశీలించి, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమై భక్తులకందిస్తున్న సౌకర్యాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇఒ ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీషాను మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన టి మహేశ్వర సింగ్ రు.1లక్ష 21వేలను విరాళంగా ఇఒ వికె శీనా నాయక్‌కు అందించారు. దాతకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసి, ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## జీవ వైవిధ్య సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించే చర్యలు తీసుకుంటున్నాం: నీలాయపాలెం విజయ్‌కుమార్

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** జీవ వైవిధ్య సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించే చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య మండలి చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్, మెంబర్ కార్యదర్శి పి రామకృష్ణ తెలిపారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని ఈ నెల 22న విజయవాడలో నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. "ప్రకృతితో సామరస్యం - స్థిరమైన అభివృద్ధి అనే అంశంలో అవార్డులు, బహుమానాలు అందిస్తున్నామని తెలిపారు. జీవవైవిధ్యంపై కృషి చేస్తున్న, ఎంపిక చేసిన వ్యక్తులకు వ్యక్తిగత విభాగంలో అవార్డులు అందిస్తామని చెప్పారు. ఈ అంశంపైనే విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం, ఛాయాచిత్రాల పోటీలు కూడా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ నెల 22న జరిగే కార్యక్రమంలో స్టాళ్లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు.

## ఉగ్రవాదం అంతానికి సిపిఎం సహకారం

### - తిరుపతిలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి బేబీ

**తిరుపతి,మే 9 ప్రభాతవార్తప్రతినిధి:** భారత్ సరిహద్దుల్లో పాక్ కవ్వింపులతో భారత్ సైన్యం ధీటుగా బదులివ్వాలని, అమాయకుల ప్రాణనష్టం ఆస్తినష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిపిఎం జాతీయ ప్రధానకార్యదర్శి ఎంఎ బేబి సూచించారు. దేశ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు తగ్గించి సాధారణ జనజీవన పరిస్థితి పునరుద్దరణకు,శాంతి కోసం కేంద్రప్రభుత్వం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదం అంతానికి సిపిఎం కేంద్రానికి సహకరిస్తుందని తెలిపారు. శుక్రవారం ఉదయం తిరుపతిలోని సిపిఎం కార్యాలయంలో ఆయన మీడియాప్రతినిదుల సమావేశంలో మాట్లాడారు. తీవ్రవాదుల అణచివేత కార్యక్రమం విజయవంతం కావడంతో దేశసరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు తగ్గించాలన్నారు. తీవ్రవాదం అంతానికి, ఫెహల్గాం హంతకులను అప్పజెప్పడానికి పాకిస్థాన్‌పై వివిధ వేదికల రకాల ఒత్తిడి తీసుకురావాలన్నారు. కులగణన కేవలం బీహార్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం ప్రకటించిందన్న భావన ప్రజల్లో ఉందని తెలిపారు. కేంద్రం కులగణన చేపట్టేందుకు అవసరమైన మార్గదర్శకాలు ఇప్పటివరకు ప్రకటించకపోవడం దీనిని బలపరుస్తోందని అన్నారు.కులగణన సమగ్ర సామాజికసర్వేగా చేపట్టాలని, అందుకు అవసరమైన మార్గదర్శకాలను రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో సిపిఎం దీనిపై చర్చ లేవనెత్తుతుందన్నారు.రానున్న రోజుల్లో కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి, పశ్చిమబెంగాల్ ,అస్సాం రాష్ట్రాలలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తాము కేంద్ర కమిటీ సమావేశంలో చర్చించి ఎన్నికల ఎత్తుగడలను రూపొందిస్తామని బేబి వివరించారు.

# ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష , రూ.3లక్షల జరిమానా

### - తీర్పు వెల్లడించిన ఆర్‌ఎస్ఎస్ ఎడిజె కోర్టు న్యాయమూర్తి

**తిరుపతి కార్పొరేషన్, మే 9 ప్రభాతవార్త** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 3లక్షల జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు నిచ్చారు. ఆర్ఎస్ఎఎస్టీఎఫ్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ. శ్రీనివాస్ పర్యవేక్షణలో గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 56/2018 కేసులో ఒక ముద్దాయి అరెస్టయ్యాడు. ఇతను తమిళనాడుకు చెందిన విజయకుమార్ కాగా, ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ నాగపట్ల ఈస్ట్ బీటు, తిరుపతి డివిజన్‌లో పట్టుబడ్డాడు. ఈ కేసు విచారణ పూర్తి చేసుకోవడంతో గత నెల 22వ తేదీన న్యాయమూర్తి శిక్ష ఖరారు చేయగా, ఇతను కోర్టుకు హాజరు కాలేదు. దీంతో అతనిపై నాన్ బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ)ను జారీ చేశారు. పోలీసులు ఇతనిని పట్టుకుని, శుక్రవారం న్యాయమూర్తి ముందు హాజరు పరిచారు. న్యాయమూర్తి స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 3లక్షల జరిమానాను ఖరారు చేస్తూ తీర్పునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులో అతి విలువైన సహజ సంపద అయిన ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడమే కాకుండా, అడవిలోకి అక్రమ ప్రవేశం చేసిన నేరస్తులకు కూడా ఇది ఒక హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు అధికారులు తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా సహకరిస్తున్న కోర్టు సిబ్బందిని అభినందించారు.

## తెలుగు జవాన్ మురళీ నాయక్ వీరమరణం పట్ల మాజీ సిఎం వైయస్ జగన్ దిగ్భ్రాంతి

**విజయవాడ మే 9 ప్రభాతవార్త ప్రతినిధి:** జమ్ముకాశ్మీర్‌లో తెలుగు జవాన్ మురళీ నాయక్ వీరమరణం పట్ల మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. మురళీనాయక్ వీరమరణంపై. దేశభద్రతలో తన ప్రాణాలను ఘణంగా పెట్టి వీరమరణం పొందిన మురళీనాయక్ త్యాగాన్ని మరువలేం. మురళీనాయక్ కుటుంబీలకు ప్రగాఢ సానుభూతి అంటూ జగన్ తన "ఎక్స్" ఖాతాలో పోస్టు చేసారు. జమ్ముకాశీర్మర్‌లో తెలుగు జవాన్ మురళీ నాయక్ వీరమరణం చెందడంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మురళీనాయక్ కుటుంబానికి ఆయన సంతాపం ప్రకటించారు.

శోకతప్తులైన వారి కుటుంబీకులకు వైయస్ జగన్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దేశభద్రతలో తన ప్రాణాలను పణంగా పెట్టి వీరమరణం పొందిన మురళీనాయక్ త్యాగాన్ని మరువలేమన్నారు.

# ఈ నెల 13 న యుటిఎఫ్ ఆధ్వర్యంలో డి.ఎస్.సి. అవగాహన సదస్సు




**కాకినాడ టౌన్, మే 09, ( ప్రభాతవార్త ) :**
ఈనెల 13 వ తేదీ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సూర్య కళామందిరంలో డి.ఎస్.సి. అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం కాకినాడ యుటిఎఫ్ హోమ్ లో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి. రవి చక్రవర్తి, పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి. ప్రభాకర వర్మ లు మీడియా తో మాట్లాడారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ ఆశయాలు గా కలిగిన యుటిఎఫ్ ఉపాధ్యాయుల శ్రేయస్సు, ప్రభుత్వ విద్యా రంగం పరిరక్షణ కోసం కృషి చేస్తూ సామాజిక సేవా, సహాయ కార్యక్రమాలు, విద్యా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తుందన్నారు. దానిలో భాగంగా డి.ఎస్.సి. కొరకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు ఈనెల 13 వ తేదీ మంగళవారం మధ్యాహ్నం గం 3.00ల నుండి కాకినాడ సూర్యకళామందిరంలో అవగాహన క్లాసులు ఏర్పాటు చేసామన్నారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షల శిక్షణా నిపుణులు, పూర్వ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు మరియు ఆయన బృందం హాజరై వివిధ అంశాలను బోధిస్తారని తెలిపారు. అదేవిధంగా సదస్సు కి హాజరైన వారికి లక్ష్మణరావు సౌజన్యంతో రూపొందించిన "విద్యా మనో విజ్ఞాన శాస్త్రం" స్టడీ మెటీరియల్ ఉచితంగా అందచేస్తామన్నారు. ఈ సందర్భంగా మెటీరియల్ బుక్ ఆవిష్కరించారు. వివరములకు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు టి. రామలక్ష్మి (9959562666), కె. పెద్దిరాజు (9652677889) లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి. రవి చక్రవర్తి, జి. ప్రభాకర వర్మ లతో పాటు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కెవివి నగేష్, నాయకులు కె.ఈశ్వరరావు, కాంట్రాక్టు లెక్చరర్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

# రైతుల వద్ద ఉన్న మిగులు ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి

**- అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే బత్తుల**



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, మే 09, ( ప్రభాతవార్త ) :**
రాజానగరం నియోజకవర్గంలోని వరి పండించిన రైతులు వద్ద మిగులు ధాన్యం వివరాలు సేకరించి వెంటనే కొనుగోలుకు ఏర్పాటు చేయాలని రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కోరుకొండ ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే బలరామకృష్ణ, వ్యవసాయ శాఖ అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లికార్జునరావు, మూడు మండలాలకు చెందిన వ్యవసాయ శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరామకృష్ణ మాట్లాడుతూ రైతులు వద్ద ఇంకా మిగిలి ఉన్న ధాన్యం వివరాలు సేకరించి వెంటనే కొనుగోలుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతుల వద్ద ఉన్న చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేయడానికి ఎంత టార్గెట్ అవసరమవుతుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని రైతులు వారికి ఉపయోగపడే వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమం గురించి చర్చించారు. అదేవిధంగా రైతుల అవసరాలకు అనుగుణంగా అధికారులు అందుబాటులో ఉండి తగిన విధంగా సేవలందించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ ఎంపీడీవో అశోక్ కుమార్ , మూడు మండలాల వ్యవసాయ అధికారులు సిబ్బంది కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

**- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్**

**నిడదవోలు, మే 09, ( ప్రభాతవార్త ) :**
రాష్ట్రంలోని నిరుద్యోగులందరికీ కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని మంత్రి కందుల దుర్గేష్ యువతకు భరోసానిచ్చారు. శుక్రవారం నిడదవోలులోని స్థానిక వెలగపూడి దుర్గాంబ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వికాస, జేకేసీ సంస్థ ఆధ్వర్యంలో తలపెట్టిన మెగా జాబ్ మేళా కు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ నేడు నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాకు దాదాపు 42 కంపెనీలు హాజరయ్యాయని , ఆయా కంపెనీల్లో 2000కు పైగా ఉద్యోగాల కల్పనకు అవకాశముందన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న జాబ్ మేళాలో ఐటీ రంగానికి చెందిన కంపెనీలు అధికంగా వచ్చాయని, తదుపరి విడతలో జరిగే జాబ్ మేళాలో టూరిజం, అతిథ్య రంగాలకు సంబంధించిన కంపెనీలను ఆహ్వానిస్తామన్నారు. అప్పుడు హోటల్, హాస్పిటాలిటీ మేనేజ్ మెంట్ చదివిన యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ మధ్య కాలంలో రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఇన్ టూరిజం కోర్సులు ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. యువత వద్దకే ఉద్యోగాలు తెచ్చేందుకు జిల్లా పరిధిలో వికాస సంస్థ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల సహకారంతో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. మెగా జాబ్ మేళాలు యువతకు సువర్ణావకాశంగా అభివర్ణించారు. పీఎం, సీఎం, డిప్యూటీ సీఎంలు యువతకు ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ముందుకు వెళు_న్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 16 వేలకు పైగా పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించామని



గుర్తుచేశారు. ఐదేళ్లలో రాష్ట్రంలో 20 లక్షల మంది యువత కు ఉద్యోగాల కల్పన కోసం ఐదుగురు మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసిన విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, వికాస పీడి కె.లచ్చారావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జీవీడి మురళి, మాజీ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ ఇంచార్జి బూరుగుపల్లి శేషారావు, ఎస్వీఆర్ కే బాలుర కళాశాల ప్రిన్సిపల్ డా. కె.జ్యోతి, ఎస్వీడీ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డా. రుద్ర, కూటమి నాయకులు పి. నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# జయహో.. ఆపరేషన్ సింధూర్ - మంత్రి సుభాష్

**కోనసీమ బ్యూరో, మే 09, ( ప్రభాతవార్త ) :**



ఆపరేషన్ సింధూర్ పేరుతో ఉగ్రవాద నిర్మూలనే లక్ష్యంగా భారతీయ సాయుధ దళాలు చేస్తున్న దాడులను చూస్తుంటే చాలా గర్వంగాఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఉగ్రదాడిలో మతం చూసి ప్రాణాలు తీయడం ఎంతో బాధాకరం. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారధ్యంలో, సహకారంతో దెబ్బకు దెబ్బ తీసిన ఆర్మీ జవాన్లకు సలాం. ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్ స్థావరాలని ధ్వంసం చేసిన ఆర్మీ జవాన్లకు ఉద్యమ నమస్కారాలు తెలిపారు.ఎంతో సాహసో పేతంగా ఆర్మీ జవాన్లు చేపట్టిన ఈ ఆపరేషన్ ఉగ్రవాదుల గుండెల్లో సింహస్వప్నంలా నిలిచింది. కోట్లాదిమంది భారతీయులు గర్వంగా తలపైకెత్తుకుని భారత్ కు జేజేలు పలుకుతున్నారు. త్రివిధ దళాలకు అండగా నిలుద్దాం. రాబోయే రోజుల్లో భారతదేశం వైపు చూడాలంటే ఉగ్రవాద సంస్థల గుండెల్లో వణుకు పుట్టి భయపడే పరిస్థితి ఉండాలన్నారు. ఇప్పటివరకు ఎన్నో అక్రమాలు చేసిన పాకిస్తాన్ ను వదిలిపెట్టాం.. ఇకనుంచి వదిలిపెట్టే ప్రసక్తే లేదు.. ఖబర్దార్ పాకిస్తాన్ ద్రోహుల్లారా.. మా దేశమంతా ఒకేసారి "జై భారత్ "అనే నినదిస్తే ఆ శబ్దానికే సగం చస్తారు అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వృద్ధురాలి ప్రేమకు ముగ్ధులైన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



**పిఠాపురం, మే 09, ( ప్రభాతవార్త ) :**
గత సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విజయాన్ని కాంక్షిస్తూ వేగులమ్మ అమ్మవారికి మొక్కులు మొక్కి... తన పింఛను సొమ్ముతో మొక్కులు చెల్లించింది. పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం కొత్త ఇసుకపల్లికి చెందిన వృద్ధురాలు పోతుల పేరంటాలు పింఛను సొమ్ము దాచుకొని అమ్మవారికి రూ.27వేల విలువైన గరగ చేయించి ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న పవన్ కళ్యాణ్ పేరంటాలను శుక్రవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయానికి పిలిపించుకొని ఆమెతో ముచ్చటించారు. తనపై చూపిన మమకారానికి ముగ్ధులయ్యారు. పేరంటాలతో కలసి భోజనం కూడా చేశారు. ఆత్మీయంగా పలుకరిస్తూ స్వయంగా భోజనం వడ్డించారు. చీరను బహూకరించారు. పింఛను సొమ్ముతో మొక్కులు చెల్లించిన విషయం తెలుసుకుని ఆర్థిక సాయం అందించారు. పేరంటాలును క్యాంపు కార్యాలయంలోకి ఆత్మీయంగా ఆహ్వానించిన పవన్ కళ్యాణ్, తిరుగు ప్రయాణానికి ఏర్పాటు చేసిన వాహనం వరకు స్వయంగా వచ్చి మరీ సాగనంపారు.


**The DRP ANNAVARAM MMACS Ltd**
Regd. NO. AMC/EGDT/DCO/2019/65
D.No. 9-11-130, Gandhinagar, Kakinada -4, cell: 74167 63488

ఈ క్రింది ఉదహరించిన ఖాతాదారులు బంగారు నగలపై మా సొసైటీలో అప్పు తీసుకొని సకాలంలో బకాయిలు చెల్లించని కారణంగా సొసైటీ నిబంధనల ప్రకారం ది. 23.05.2025 శుక్రవారం ఉదయం 11 గం.లకు మా సొసైటీ ఆవరణలో వేలం వేసి బకాయిలు వసూలు చేసుకుందామని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

| Sl.No | A/c No. | Name of the person & Address | Grams |
|---|---|---|---|
| 1. | JL - 224 | **Pappu Nandhini Kumari**, 16-23-38, Water Tank St., Dairy Form Centre, Kakinada - 533 001 | 74 grams |
| 2. | JL - 393 | **Pappu Srinivas**, 6-23-38, Water Tank St., Dairy Form Centre, Kakinada - 533 001 | 8.1 grams |
| 3. | JL - 440, 471 | **Thalada Sujatha**, 9-11-31, Elivin Peta Gandhi Nagar, Kakinada - 533 004 | 33.7 grams |
| 4. | JL - 280, 478 | **S. Sirisha** 1-169, SC Peta, Thodangi, Kothapeta - 533 408 | 30.1 grams |
| 5. | JL - 236 | **Yara Rajesh** 11-171, Dibbalapalem, Yeleswaram - 533479 | 33.8 grams |
| 6. | JL - 507 | **Nalla Sudharani**, 3-16, Chikala vari veedhi, Sarpavaram, Kakinada - 533 006 | 41.550 grams |

కాకినాడ, 10-5-2025



# బాబీని సన్మానించిన వాకర్స్ హెల్త్ క్లబ్ సభ్యులు

**అమలాపురం టౌన్ , మే 09, ( ప్రభాతవార్త ) :**
ఆంధ్రప్రదేశ్ యూనియన్ అఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ అధ్యక్షులుగా ఎన్నికైన మండేల బాబిని అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ సభ్యులు వారి స్వగృహంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలోక్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్, కార్యదర్శి బూరగాయల శివరామకృష్ణ, కోశాధికారి పివిఆర్ నాయుడు,



జిల్లా గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు గోకరకొండ నాగేంద్రరావు, బులెటిన్ ఎడిటర్ పుత్సా కృష్ణ కామేశ్వర్, వలవల నాయుడు, యర్రమిల్లి సత్యనారాయణ మూర్తి, గుర్రం రామకృష్ణ, మోకా వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు చిన్నారి ఆరోగ్యం కార్యక్రమం ప్రారంభం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, మే 09, ( ప్రభాతవార్త ) :**
"ఆహార నిస్సహాయత నివారణ, సరైన ఆరోగ్యం కోసం తూర్పు గోదావరి జిల్లాలో "చిన్నారి ఆరోగ్యం " కార్యక్రమాన్ని శనివారం శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రము లో శ్రీకారం చుట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ప్రకటనలో తెలియచేసారు. రాష్ట్ర పర్యటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఇతర ప్రజా ప్రతినిధులు సమక్షంలో ఈ కార్యక్రమాన్నీ ప్రారంభించనున్నట్లు తెలిపారు. గతంలో జిల్లాలో విజయవంతంగా చేపట్టిన " బంగారు కొండ " కార్యక్రమానికి మరింత మెరుగులు దిద్ది చిన్నారి ఆరోగ్యం కార్యక్రమం రూపకల్పన చెయ్యడం జరిగిందని పేర్కొన్నారు.

# అన్నిమతాలువారు దేశంకోసం ప్రార్ధనలు చేయాలి - బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి



**కొత్తపేట, మే 09, ( ప్రభాతవార్త ) :**
భారత్ - పాకిస్థాన్ దేశాలమధ్య జరుగుతున్న యుద్ధవాతావరణంలో శత్రుసైన్యాన్ని,శత్రుదేశాన్ని అంతమొందించే కార్యాచరణలో భాగంగా మన దేశం బాగుండాలి.మన దేశంకోసం పోరాడుతున్న వివిధ దళాలవార్కి ఆర్మీ వారందరూ ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలని మన భారత పౌరులకు ఎటువంటి ప్రాణహాని కలగకుండా దేశప్రజలందరూ సర్వ జనులు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ మనమందరం ఈ విపత్కర సమయంలో మత విశ్వాసాల ప్రకారం హిందూ ఆలయాలు, చర్చిలు, మసీదుల లోను భారతదేశానికి విజయం చేకూరాలని యుద్ధసమయంలో ప్రతిఒక్కరూ పూజలు, ప్రార్ధనలు చేయాలని భారతీయ జనతా పార్టీ తరుపున కోరుచున్నానని పాలూరి తెలిపారు.

# జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్లు పంపిణీ



**కె. గంగవరం, మే 09, ( ప్రభాతవార్త ) :**
రామచంద్రపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు కె.గంగవరం మండల జనసేన పార్టీ అధ్యక్షులు చిర్రా రాజకుమార్ ఆధ్వర్యంలో గంగవరం, సుందరపల్లి, ఊడిమూడి, తమ్మాయపాలెం, కూళ్ళ, మల్లవరం, కోటపల్లి గ్రామాలలో క్రియాశీలక సభ్యత్వం కిట్లను పంపిణీ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాజ్ కుమార్ కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తాడాల జానకిరామ్, దేవరపల్లి చక్రి, సలాది రామ్ ప్రసాద్, దాకరపు బన్నీ, అధిక సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్ లో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే

**రావులపాలెం, మే 09, ( ప్రభాతవార్త ) :**
ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం ప్రజాదర్బార్ ను శుక్రవారం రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుండి అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు. ప్రజాదర్బార్ కార్యక్రమంలో 230 అర్జీలు ప్రజల వద్ద నుండి స్వీకరించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజా వినతులు,సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునే విధంగా సంబంధిత శాఖల అధికారులకు అర్జీలను అందజేస్తున్నట్లు చెప్పారు. రావులపాలెం కు చెందిన ఒక మహిళ సమస్యను ఎమ్మెల్యే సత్యానందరావు కు విన్నవించుకోగా హుటాహుటిన పంచాయితీ



కార్యదర్శిని పిలిపించి తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గుత్తుల పట్టాభిరామారావు, మాసాబత్తుల ఆనందరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజారావు

**పిఠాపురం, మే 09, ( ప్రభాతవార్త ) :**
పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మేరుగు రాజారావు గెలుపొందారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు శుక్రవారం ఎన్నికలు జరిగాయి. ప్రధాన కార్యదర్శిగా సీనియర్ న్యాయవాది పి.ఆర్.ప్రసాదరావు, కోశాధికారిగా జి.రాజా ఎన్నికయ్యారు. ఇప్పటికే బార్ అసోసియేషన్ పాలక మండలిలో ఉపాధ్యక్షుడిగా ముమ్మిడి రామకృష్ణ,జాయింట్ సెక్రటరీగా ముమ్మిడి శ్రీనివాస్,స్పోర్ట్స్ సెక్రటరీగా ఎం.వీ.వీ.ఎన్.సత్యనారాయణ, లైబ్రరీ సెక్రటరీగా జీ.ఎస్.భాస్కరాచార్యులు, లేడీ రిప్రజంటేటివ్



గా ఎం. సత్యవాణీశ్రీ,సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సరిదే నాగేశ్వరరావు, సీహెచ్.ప్రేమ్ జీ,జూనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రావుల రమేష్, జీ.పీ.వీ సత్యనారాయణ, మహిళా సభ్యురాలిగా అల్లాడ గీత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కోశాధికారి పదవులకు శుక్రవారం ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది బత్తిన లక్ష్మణ దొర వ్యవహరించారు.

# రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి - జెసి రాహుల్ మీనా

**గండేపల్లి, మే 09, ( ప్రభాతవార్త ) :**
గండేపల్లి మండలం నాయకంపల్లి గ్రామంలో రీ సర్వే పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. రీ సర్వే లో ప్రభుత్వ భూములను పరిశీలించారు. సర్వే పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రైతులు అధికారులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, సర్వేయర్ లు, విఆర్ఓ లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# అదిగో అరుంధతి శ్రీ సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవారికి అరుంధతి నక్షత్ర దర్శనం

**అన్నవరం, మే 09, ( ప్రభాతవార్త ) :**
శ్రీ సత్యదేవుని దివ్య కళ్యాణ మహోత్సవాలలో భాగంగా శుక్రవారం వైదిక బృందం ఆద్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజాము నుండి సుప్రభాత సేవ, వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం వైదిక బృందం ఆద్వర్యంలో ప్రధాన ప్రవేశ స్థాలీపాక హోమం జరిగింది. అనంతలక్ష్మి అమ్మవారు ధివ్య కళ్యాణ మహోత్సవంతో పుట్టిళ్ళు వదిలి మెట్టింట అడుగు పెట్టిన సందర్భంగా ఈ ప్రవేశ స్థాలీపాక హోమం చేపట్టుట జరుగుతుందని వేద పండితులు తెలియజేస్తున్నారు. హోమం అనంతరం నూతన దంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవారికి, వైదిక బృందం అదిగో అరుంధతి అంటూ ధివి వైపు చూపిస్తూ,



అరుంధతి నక్షత్ర దర్శనం చేయించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు కోట సుబ్బయ్య, సుదీర్, విశ్రాంత వ్రత పురోహిత ప్రముఖులు నాగాభట్ల కామేశ్వర శర్మ, వేద పండితులు ఆలయ అధికారులు పాల్గొన్నారు. వైభవంగా రావణ వాహన సేవ : శ్రీ సత్యదేవుని దివ్య కళ్యణ మహోత్సవాలలో భాగంగా మూడవ రోజైన శుక్రవారం రాత్రి గ్రామంలొ రావణ వాహన ఊరేగింపు మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా స్వామి, అమ్మవారిని కొండపై నుంచి పల్లకీలో కొండ దిగువ తొలిపావంచాల వద్దకు తోడ్కొని వచ్చారు. అక్కడ ప్రత్యేక అలంకరణ తో సిద్ధంగా ఉన్న రావణ బ్రహ్మ వాహనంపై స్వామి, అమ్మవారిని ఆశీనులు గావించి వివిధ ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టిన అనంతరం ప్రధాన రహదారి గూండా మేళతాళాలు, భాజా బజంత్రీల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపైన, కొండదిగువ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. రావణా బ్రహ్మ వాహనంపై ఊరేగిన స్వామిని, జగన్మాతను దర్శించు కొనుటకు భక్తులు, గ్రామస్తులు ప్రధాన రహదారికి ఇరువైపులా బారులు తీరారు. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం - యువనేత బండారు సంజీవ్



**ఆత్రేయపురం, మే 09, ( ప్రభాతవార్త ) :** క్రీడలు ద్వారా మానసిక ఉల్లాసము శారీరిక దారుఢ్యంతో పాటు దేశ ప్రతిష్ట ను సాధించ వచ్చునని యువ నాయకులు బండారు సంజీవ్ అన్నారు. శుక్రవారం ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామంలో యువత ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను యువ నాయకులు బండారు సంజీవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ర్యాలి గ్రామానికి చెందిన టిడిపి, జనసేన,బీజేపీ నాయకులు యువ నాయకుడు బండారు సంజీవ్ ను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ర్యాలీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం నిర్వహణ లేక చిట్టి అడివిని తలపించేలా ఉండేది. విద్యార్థులకు పాఠశాల విద్యార్థులకు అనుకూలంగా లేకపోవడంతో గ్రామస్తులు క్రీడా ప్రాంగణం దుస్థితిని బండారు సంజీవ దృష్టికి తీసుకు వెళ్లడంతో యువ నాయకుడు సంజీవ్ సొంత నిధులతో హై స్కూల్ క్రీడా ప్రాంగణన్ని సొంత నిధులుతో అభివృద్ధి చేశారు. చిట్టడవిని తలపించేలా ఉన్న క్రీడామైదానాన్ని అభివృద్ధి చేసి టోర్నమెంట్ నిర్వహించుకునేలా కృషిచేసిన సంజీవ్ సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. మైదానంలో టోర్నీ ఏర్పాటు చేసిన యువతను ఈ సందర్భంగా బండారు సంజీవ్ అభినందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మద్దూరి సుబ్బారావు, మెర్ల నాగేశ్వర రావు, బందెల వెంకన్న, పాలింగి రవిచంద్ర, మెర్ల నాగయ్య, బండారు బాబి, రాకేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## రబీ సీజన్లో ధాన్యం సేకరణ 3.30 లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, మే 09, ( ప్రభాతవార్త ) :** తూర్పు గోదావరి జిల్లాలో రబీ 2024 -2025 సీజన్ లో ధాన్యం సేకరణ 3.30 లక్షల మెట్రిక్ టన్నులను లక్ష్యంగాఅంచనా వేయడం జరిగిందని జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్. చిన్న రాముడు శుక్రవారం ప్రకటనలో తెలిపారు.ఈ నెల 9నాటికి ధాన్యం సేకరణకు సంబంధించి 39,856 లు (ఎఫ్ టీ వో) కూపన్ లను జనరేట్ చేయుట జరిగినదన్నారు. అందుకుగాను ఇప్పటి వరకు 24,798 మంది రైతుల నుండి 2,86,684,840 మెట్రిక్ టన్నుల దాన్యం కొనుగోలు చెయ్యడం జరిగిందన్నారు.31,582 ఎఫ్.టి. ఓ లకు సంబంధించిన రూ.550 కోట్ల 26 లక్షలు రైతుల బ్యాంకు ఖాతాలలో జమచేసామన్నారు. ధాన్యం సేకరణ విషయంలో రైతులు తమ ధాన్యాన్ని 17% తేమ వరకు ఆరబెట్టుకోవాలి. జిల్లాలో ధాన్యం కొనుగోలు నిమిత్తమై ఇప్పటివరకు 62 లక్షల గోనెసంచులు, రైతులు వినియోగించుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర కామన్ వెరైటీ కు క్వింటాల్ రూ. 2300/- లు "గ్రేడ్ ఏ" కు క్వింటాల్ కు రూ. 2320/- లు చెల్లిస్తు మన్నారు. రబీ 2024-25 సీజన్లో ఎండల వలన రైతులు ఇబ్బంది పడకుండా ఇంటి వద్ద నుండే వాట్స్ యాప్ నంబరు



- జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు

7337359375 ద్వారా షెడ్యూలింగ్ చేసుకునే సదుపాయాన్ని కల్పించడం జరిగినది. అందుకు గాను 981 రైతులు ద్వారా వాట్స్ యాప్ నంబరు 7337359375 ద్వారా షెడ్యూలింగ్ చేసుకుని 12,817 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు.రబీ 2024-25 సీజను లో 2833 వాహనాల కు జీపీఎస్ పరికరాలు అమర్చి ధాన్యం రవాణాకు ఉపయోగించడం జరిగిందన్నారు. అంతే కాకుండా రైతులు తమ దాన్యం యొక్క తేమ శాతాన్ని బ్లూటూత్ ఫంక్షనాలిటీ ద్వారా తమ మొబైలు ఫోన్ లకు మెసేజ్ రూపంలో పంపి సదుపాయం కూడా కల్పించడం జరిగినది. రైతులకు తాము అమ్మిన ధాన్యం సొమ్ము 24 నుండి 48 గంటలలో రైతుల ఖాతాలలో జమ చేయడం వలన రైతు సేవా కేంద్రాలలో మత్రమే ధాన్యం విక్రయించదానికి మొగ్గు చూపుచున్నారు. అందుకు గాను ప్రధాన కార్యాలయం వారు తొలుత 2,30,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం ఇచ్చినప్పటికీ, మండలాల యొక్క వ్యవసాయ అధికారుల ద్వారా ఇంకనూ రైతుల వద్ద ధాన్యం ఉందని తెలుసుకుని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళిన పిదప మరియొక 30,000 మెట్రిక్ టన్నుల టార్గెట్, తదుపరి ఇంకొక 50,000 మెట్రిక్ టన్నుల టార్గెట్ ఇవ్వడం జరిగిందన్నారు. ధాన్యం టార్గెట్ పెంచడం ద్వారా ఇప్పటి వరకు అదనంగా 3,302 మంది రైతులు లబ్ది పొందారన్నారు. ఈ విషయమై జిల్లా వ్యాప్తంగా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రతి మహిళ ఆర్థిక స్వాలంబన సాధించాలి - ఎమ్మెల్యే వరుపుల



**శంఖవరం, మే 09, ( ప్రభాతవార్త ) :** ప్రతి మహిళ ఆర్థిక స్వాలంబన సాధించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్య ప్రభ పేర్కొన్నారు.శంఖవరం గ్రామంలో బిసి కార్పొరేషన్ ఈ డబ్ల్యూ ఎస్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణా తరగతులను శాసనసభ్యురాలు వరుపుల సత్య ప్రభ రాజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల కుట్టు మిషన్ల శిక్షణ తరగతులను మహిళా శాసనసభ్యులుగా ప్రారంభించడం ఎంతో గర్వంగా ఉందని మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, మహిళా సాధికారత సాధనలో భాగంగా వారికి ఈ కుట్టు మిషన్ శిక్షణా తరగతులను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందనీ, మహిళలు క్రమం తప్పకుండా ఈ శిక్షణా తరగతులకు హాజరై, విజయవంతంగా శిక్షణ పూర్తి చేయాలన్నారు . అనంతరం అర్హులైన రైతులకు సబ్సిడీపై అందిస్తున్న ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు, రోటోవేటర్లు తదితర వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని, రైతులు సత్ఫలితాలను సాధించాలన్నారు . ముందుగా గ్రామంలో పూల వర్షంతో ఘన స్వాగతం పలికారు ముందుగా టిడిపి నేత పర్వత సురేష్ బద్ది రామారావు వెన్న శివ మేడిశెట్టి సూర్య కిరణ్ మేకల కృష్ణ ప్రసంగించారు ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, యాళ్ల జగదీష్, మండల తెలుగు యువత అధ్యక్షులు కీర్తి సుభాష్,, జనసేన జిల్లా ప్రోగ్రామింగ్ కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం, మండల అధ్యక్షులు గాబు సుభాష్,ఉల్లి వీరభద్రరావు,, గాబు కృష్ణ, పిర్ల అప్పారావు, కేలంగి జనార్ధన్, బుర్రా వాసు,, బొమ్మిడి సత్యనారాయణ, వెంకటరమణ మండల అభివృద్ధి అధికారి ప్రసాద్, మండల వ్యవసాయ శాఖ అధికారి గాంధీ, వెలుగు ఏపిఎం శ్రీనివాస్, పశు వైద్యాధికారి కాకర్ల ప్రసాద్, ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## సత్యదేవుని సన్నిధిలో చిన రాజప్ప



**అన్నవరం, మే 09, ( ప్రభాతవార్త ) :** మాజీ హోం మంత్రి, పెద్దాపురం నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మకాయల చిన రాజప్ప శుక్రవారం అన్నవరం రత్నగిరికి విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన సత్యదేవున్ని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఆయనకు దేవస్థానం చైర్మన్ ఐవి రోహిత్, ఇఓ వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. స్వామి వారి దర్శణం అనంతరం ఆస్థాన వేద పండితులు వేదాశీర్వచనం గావించగా, ఇఓ, చైర్మన్ లు స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు.

## శ్రీ భావనారాయణ స్వామి ఆలయంలో బిజెపి నేతలు ప్రత్యేక పూజలు



**కాకినాడ రూరల్, మే 09, ( ప్రభాతవార్త ) :** ఆపరేషన్ సింధూర్ కు సంఘీభావంగా సర్పవరం శ్రీ రాజ్యలక్ష్మి సమేత శ్రీ భావనారాయణ స్వామి ఆలయంలో కాకినాడ పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంబాల మాట్లాడుతూ పహాల్గంలో జరిగిన ఉగ్రవాదులు దాడికి ప్రతీకారంగా ప్రధాని మోడీ సారధ్యంలో భారత దేశ ఆర్మీ,త్రివిధ దళాలు ఉగ్రవాద ప్రేరేపిత పాకిస్తాన్ కు తగిన రీతిలో దీటైన దాడులు చేయడం పట్ల దేశ ప్రజలంతా నరేంద్ర మోడీ వెంట ఉన్నారని అన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆదేశాల మేరకు ప్రత్యేక పూజలు చేయడం జరిగిందని, మనోధైర్యంతో ముందుకు సాగుతున్న భారతీయ సైనికులకు దేశ ప్రజల ఆశీస్సులు తో ప్రధాని నిర్ణయంతో ప్రజలంతా ఏకీభవిస్తున్నారని అసెంబ్లీ కన్వీనర్ పితాని లీల అన్నారు. ఈ కార్యక్రమంలో పాలిక శివ, పెంకె అరుణ ప్రకాష్, కోమర్తి మురళి, త్రిమూర్తులు, గుబ్బల సత్యనారాయణ, శ్రీనివాసు, రామలక్ష్మి, సూర్యనారాయణ బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంపీ సానా సతీష్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్ఎంసి ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్



**కాకినాడ రూరల్, మే 09, ( ప్రభాతవార్త ) :** కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ విష్ణువర్ధన్ శుక్రవారం ఎంపీ సానా సతీష్ బాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన ప్రిన్సిపాల్ తో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు మాట్లాడుతూ కాకినాడలో ఆర్ఎంసి మెడికల్ కళాశాల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం తరపున పూర్తిస్థాయిలో సహకరిస్తామని అన్నారు.

## సాన క్యాంప్ ఆఫీసులో ప్రజాదర్బార్



**కాకినాడ టౌన్ , మే 09, ( ప్రభాతవార్త ) :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతివారం నిర్వహించిన ప్రజాదబ్బాలను ఈ వారం శుక్రవారం నిర్వహించారు ఈ ప్రజా దర్బార్ కు కాకినాడ పార్లమెంటు నియోజకవర్గం సంబంధించి వచ్చిన ప్రతి అర్జీని ఎప్పటికప్పుడు వెంట వెంటనే పరిష్కరించేందుకు సాన కార్యాలయంలో ఉన్న సిబ్బందితోపాటు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు, మాజీ జెడ్పిటిసి నులుకుర్తి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకె శ్రీనివాస్ బాబా, అరిగల్ శ్రీనివాస్ (బున్ని), వేటుకూరి నాగమణి, చింతపల్లి అర్జున్, యల్ల రాజా, తలాటం హరీష్, న్యూటన్ ఆనంద్, ఈ ప్రజా దర్బార్ లో పాల్గొని వెనువెంటనే సమస్యలు పరిష్కరించే అర్జీదారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో సాన సతీష్ ఫౌండేషన్ ద్వారా తలాటం హరీష్ డీఎస్సీ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో కార్యాలయ సిబ్బంది మేక లక్ష్మణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అనాథ పిల్లల సంక్షేమానికే నా జీతం : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**పిఠాపురం, మే 09, ( ప్రభాతవార్త ) :** పిఠాపురం నియోజకవర్గ ప్రజలు ఎంతో నమ్మకంతో నన్ను శాసనసభ్యుడిగా గెలిపించారని,వారి ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధితో పాటు సమస్యలను పరిష్కరించడం తన బాధ్యతని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.పిఠాపురం ప్రజలు ఇచ్చిన అధికారం ద్వారా వచ్చిన జీతాన్ని అక్కడే వినియోగించాలని ఆయన నిర్ణయించుకున్నారు.ఇందులో భాగంగానే నియోజకవర్గం పరిధిలోని తల్లిదండ్రులు లేని బిడ్డల భవిష్యత్తు కోసం ఆ మొత్తం ఇస్తున్నట్టు ఆయన తెలిపారు.పదవి ఉన్నంతకాలం వచ్చే జీతం మొత్తాన్ని ఆ బిడ్డల సంక్షేమానికి వినియోగించనున్నట్టు స్పష్టం చేశారు.శుక్రవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పిఠాపురం నియోజకవర్గానికి చెందిన 42 మంది అనాథ పిల్లలకు పవన్ కళ్యాణ్ తన వేతనం నుంచి ఒక్కొక్కరికీ నెలకి రూ. 5 వేల చొప్పున రూ. 2,10,000 ఆర్థిక సాయం అందించారు.జీతంలో మిగిలిన మొత్తాన్ని కూడా వారి బాగోగులు చూసేందుకే ఖర్చు చేయనున్నట్టు ప్రకటించారు.శుక్రవారం అందుబాటులో ఉన్న 32 మందికి పవన్ కళ్యాణ్ స్వయంగా సాయాన్ని అందజేశారు.మిగిలిన పది మందికీ జిల్లా యంత్రాంగం ద్వారా ఆ మొత్తాన్ని అందిస్తామని తెలిపారు.ప్రతి నెలా ఈ సాయం వారి ఇళ్ల వద్దే అందించేలా ఏర్పాట్లు చేశారు.ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని శాసన సభ్యుడిగా ఎన్నికైన తర్వాత వేతనం తీసుకోకూడదని నిర్ణయించుకున్నాను.ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలన్న భావనతోనే వేతనం తీసుకున్నాను. వేతనం రూపంలో తీసుకున్న ఆ మొత్తాన్ని నన్ను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గం పరిధిలో కన్నవారు దూరమైన పిల్లల భవిష్యత్తు కోసం, వారి చదువుల ఖర్చు చేయాలనుకున్నాను. ప్రభుత్వం, పదవి ఉన్నంతకాల జీతం మొత్తం అనాథ బిడ్డల సంక్షేమానికి వినియోగిస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజ, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, పాడా ప్రాజెక్ట్ డైరెక్టర్ చైత్ర వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

## మాక్ డ్రిల్ ప్రజల భద్రతపై అవగాహన



**కోనసీమ బ్యూరో, మే 09, ( ప్రభాతవార్త ) :** ఆపరేషన్ సింధూర్, భారత్ పాక్ ఉద్రిక్తతల నేపథ్యం లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఎస్ .యానాం లో పోలీసు, రెవెన్యూ , మెరైన్ మరియు వేదాంత కంపెనీ అధికారుల మాక్ డ్రిల్ - ప్రజల భద్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం, సంఘ విద్రోహ చర్యలను అడ్డుకోవడం, శాంతిభద్రతలు కాపాడటం, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడం ఈ డ్రిల్ యొక్క ప్రధాన లక్ష్యం అని రూరల్ సీఐ ప్రశాంత్ అన్నారు. అగ్ని ప్రమాదాలు, పేలుళ్లు, అనుమానాస్పద వస్తువులు కనిపించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, సైరన్ మోగినప్పుడు ఎలా స్పందించాలి అనే విషయాలపై ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు, ఇతర శాఖల సమన్వయంతో చేపట్టే చర్యలను వివరించారు. ప్రజలు భయపడకుండా అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుమానాస్పదంగా ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు. ఈ మాక్ డ్రిల్ లో ఎస్.ఐ ఉప్పలగుప్తం, రెవెన్యూ అధికారులు , వేదాంత కంపెనీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం



**శంఖవరం, మే 09, ( ప్రభాతవార్త ) :** ప్రయాణికులు, పేద ప్రజలకు ఉపశమనం కలిగించేలా వాసవి క్లబ్ %-% కత్తిపూడి శాఖ మజ్జిగ చలివేంద్రం విజయవంతంగా నిర్వహిస్తున్నారు. క్లబ్ సభ్యుల నిస్వార్థ సేవాభావంతో, ప్రజల సహకారంతో ప్రతి రోజూ ఈ చలివేంద్రం నిర్వహించబడుతుందని వాసవి క్లబ్ అధ్యక్షుడు ఉప్పల బాబి తెలిపారు , ప్రజలకోసం పెరుగు మజ్జిగ, తేనెలు కలిపిన నీరు, నిమ్మకాయ పానీయాలు వంటివి అందజేస్తున్నారు. ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు, బడి పిల్లలు, రిక్షా కార్మికులు, కూలీలు ఈ చలివేంద్రం సేవను , వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు ఈ ప్రయత్నంలో యువత, మహిళలు కూడా ముందుకు వచ్చి సహకరించడమే కాక, ఇతరులకు ప్రేరణగా నిలుస్తున్నారని వారు తెలిపారు. స్థానిక ప్రజలు వాసవి క్లబ్కు ధన్యవాదాలు తెలియజేస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు ఇంకా విస్తరించాలనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ కొత్త సిద్దు ట్రెజరర్ కట్ట బసవయ్య క్లబ్ సభ్యులు పాల్గొన్నారు

## స్టాక్ యార్డ్ లలో అవసరమైన ఇసుక నిల్వలు ఉంచాలి


**కోనసీమ బ్యూరో, మే 09, ( ప్రభాతవార్త ) :** నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా స్టాక్ యార్డ్లకు ఇసుకను తరలిం చాలని కమిటీ సభ్యులకు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సూచించారు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ మరియు కమిటీ అధ్యక్షులు ఆర్ మహేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాల రుతుపవన సమయంలో భవన నిర్మాణానికి అవస రమైన ఇసుక నిల్వలను స్టాక్ యాడ్ లలో ఉంచాలని సూచించారు పట్టా భూము లలో ఇసుక తవ్వకాలు నిర్వహించేందుకు పర్యా వరణ అనుమతులు ఐదు చోట్ల రావడం జరిగిందని, వెంటనే ఇసుక త్రవ్వకాలు భూయజమానుల ద్వారా కానీ టెండర్ల ద్వారా కానీ నిర్వహించి స్టాక్ యార్డులకు తరలించేందుకు చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు.



కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం జొన్నాడ, గోపాలపురం స్టాక్ యార్డ్ ల వద్ద, వాహనాల పా ర్కింగ్ ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా చూసుకోవాల న్నారు. స్టాక్ యాడ్లు వద్ద వాహనాలు రాక పోకలకు అనువుగా సుస్థిరమైన మార్గాలు ఏర్పాటు చేయా లన్నారు. పొడగట్లపల్లి రీచ్లో ఇసుక ను కాకినాడ జిల్లా భవన నిర్మాణ అవసరాలకు కేటాయించడం జరిగింద న్నారు. జిల్లాలో 20 మెట్రిక్ టన్నులు లోడుకి మించి తిరుగుతున్న వాహనాలపై కేసులు బనాయించాలని డి టి ఓ కు ఆదేశించారు. జిల్లా ఆర్ అండ్ బి ఇంజనీర్లు జిల్లాలో ఉన్న బలహీనమైన బ్రిడ్జిలు స్థితి గతులపై నివేదికలు రూపకల్పన చేసి ఆయా బ్రిడ్జిల వద్ద పరిమితికి మించి వాహనాలు రాకపోకలు సాగించకుండా నిషేధిత చర్యలు చేప ట్టాలన్నారు. అక్రమ ఇసుక తవ్వకాలపై నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు పీ.శ్రీకర్,డి అఖిల, కే మాధవి, గనులు భూగర్భ శాఖ సహాయ సంచాలకులు ఎల్ వంశీధర్ రెడ్డి, ఆర్డీవో డి శ్రీనివాసరావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్సీ సిహెచ్ ఎన్వి కృష్ణారెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ బి. రాము, రియాల్టీ ఇన్స్పెక్టర్ టి. సుజాత తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీ స్త్రీలకు పోషకాహార భోజనం వితరణ



**రౌతులపూడి, మే 09, ( ప్రభాతవార్త ) :** రౌతులపూడి సి. హెచ్. సి కి వైద్యం కోసం విచ్చేసిన గర్భిణీ స్త్రీలకు ప్రతి నెల 9వ తేదీన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ యోజన పథకం ద్వారా పోషకాహార భోజన వితరణ అందిస్తున్నారు. స్థానిక దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్విరామం గా కొనసాగిస్తున్నారు. దీనిలో భాగంగా స్థానిక కూరగాయల వ్యాపారస్తుడు యడ్ల బుజ్జి కుటుంబీకులు శుక్రవారం గర్భిణీ స్త్రీలకు భోజన వితరణ అందించారు. దీనిపై వారు ఆనందంవ్యక్తం చేశారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# పాతవే.. కొత్తగా !



ఏళ్ల ఇష్టపడి కొనుక్కున్న జీన్స్.. రెండుమూడు ఉతుకులకే రంగు మారిపోతుంటాయి. తెలుపు డ్రెస్సులూ, చీరలూ అంతే, నిర్వహణ లోపం వల్ల పసుపు రంగులోకి వస్తుంది. మరి వీటన్నింటికీ కొత్త లుక్ ఇవ్వడానికి ఇప్పుడంతా డై చేస్తున్నారు. ఒకే తరహా డైయింగ్‌లో కొత్తదనం ఏముంటుంది? వీటిలో చాలా రకాలు ఉన్నాయి. అవేంటంటే.. డైలాగనుకునే దుస్తుల్ని ఓ వస్త్రంతో, అక్కడక్కడ గట్టిగా ముడుపులు వేయాలి. తర్వాత రంగునీటిలో ముంచి తీయాలి. దీనివల్ల వస్త్రం అంతా ఒకే రంగు రాకుండా... గుండ్రంగా అక్కడక్కడ డిజైన్లు వస్తాయి. దీన్ని 'టై అండ్ డై' అంటారు. .. మళ్లీ కలర్స్‌ను ఇష్టపడుతున్నారిప్పటి తరం అమ్మాయిలు. అలాంటి వాళ్లు... రెండు మీకు రంగుల్ని కలిపి... దుస్తులకు పైభాగం అంతా ఒకటి... కింద ఇంకోటి వేస్తే సరి. మల్టీకలర్ దుప్పటా లేదా టాప్ సులువుగా తయారవుతుంది. దీన్ని 'ఓంబ్రే డై' అంటారట. మనకు నచ్చిన డిజైన్లను... చెక్కపై చెక్కించుకుని స్టాంప్స్ ఫ్యాబ్రిక్‌పై ముద్రించినా, బ్రష్ లేదా కుంచెతో నచ్చిన ఆకారాల్ని గీసిన కొత్త లుక్ మీ సొంతమవుతుంది. దీన్ని 'బ్రష్ లేదా బ్లాక్స్ డై' అంటారు. దుస్తులను మడిచి... దానికి క్లిప్పులూ, రబ్బర్ బ్యాండ్ల సహాయంతో బిగుతుగా కట్టి ఉంచాలి. □

# ముత్యమంత మొటిమే కదా?



**అందంగా మెరిసే ముఖంపై చిన్న మొటిమ వచ్చినా అమ్మాయిలకు ముచ్చెమటలు పోస్తాయి. ఇందుకు హార్మోన్ల ప్రభావంతో పాటు అధిక జిడ్డు, దుమ్మూధూళీ, ఆహారపుటలవాట్లు.. వంటి ఎన్నో కారణాలు.** అలాగని వీటిని తగ్గించుకోవడానికి ఖరీదైన క్రీములు వాడుతున్నారా? అవేం అక్కర్లేదు..ఇంట్లోని పదార్థాలతో ఈ చిట్కాలు పాటించి చూడండి.

✦ దాల్చిన చెక్కలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు మొటిమలకు కారణమైన బ్యాక్టీరియాని చంపేస్తాయి. రెండు చెంచాలు తేనె, కాసిన్ని పాలు, చెంచా దాల్చిన చెక్కపొడి కలుపుకోవాలి. దీన్ని ముఖానికి పూతలా వేసి పావు గంట తరవాత గోరువెచ్చని నీళ్లతో ఇలా చేయడంవల్ల మొటిమలు తగ్గడమే కాదు, మచ్చలూ పోతాయి. ✦ జిడ్డుని తొలగించి మొటిమలు రాకుండా బొప్పాయి అడ్డుకుంటుంది. బాగా పండిన బొప్పాయి గుజ్జులో పంచదార, పెరుగు కలిపిముఖానికి రాసి మృదువుగా మర్దన చేయాలి. అపై గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకోవాలి. రెండు చెంచాల నారింజ తొక్కల పొడికి తగినన్ని పాలు చేర్చి ముఖానికి రాసి ఇరవై నిమిషాల తరవాత కడిగేయాలి. వీటితో మొటిమలు తగ్గడమే కాదు చర్మం కొత్త మెరుపుతో కనిపిస్తుంది. ✦ కలబంద గుజ్జులో కాస్త నిమ్మరసం తేనె కలిపి రోజూ రాసి ఆరనివ్వండి ఇలా పదిహేను రోజులు చేస్తే క్రమంగా మొటిమలు తగ్గుముఖం పడతాయి. □

# ఆమె సేవలకు గుర్తింపుగా ఎన్నో అవార్డులు



'ప్యాడ్‌మ్యాన్'గా పేరొందిన అరుణాచలం మురుగనాథమ్ గురించి మనం విన్నాం. తమ ప్రయత్నాలతో నెలసరిని సౌకర్యంగా మార్చిన 'ప్యాడ్ విమెన్'లూ కొందరున్నారు. అయితే ఈ 'ప్యాడ్ గ్రాండ్‌మా' రూటే సెపరేటు! ఎలాంటి సామాజిక సమస్యైనా చేయి చేయి కలిపినప్పుడే మార్పు సాధ్యమని నమ్మిన ఆమె.. తాను ప్రారంభించిన నెలసరి యజ్ఞంలో దేశవ్యాప్తంగా ఎంతోమందిని భాగస్వాముల్ని చేసింది. తన ఎన్జీవో ద్వారా వివిధ రాష్ట్రాల్లో సహజసిద్ధమైన నెలసరి ఉత్పత్తుల తయారీ కేంద్రాల్ని ప్రారంభించి.. అక్కడి మహిళలకు ఉపాధి కల్పించడమే కాదు.. నెలసరి సమయంలో ఆరోగ్యంగా, సౌకర్యంగా ఉండేలా కృషి చేస్తోంది. అంతేకాదు.. నెలసరిపై ఈ సమాజంలో ఉన్న అపోహల్ని, మూఢనమ్మకాల్ని బద్దలుకొట్టేందుకు పాటుపడుతోంది. ఈ దశాబ్దాల ప్రయత్నమే ఇటీవలే భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక 'ఫ్రెడ్ ఆఫ్ ఎన్ఐడీ' అవార్డు అందుకునేలా చేసింది. ఈ నేపథ్యంలో ఈ 'ప్యాడ్ దాదీ' గురించి తెలుసుకుందాం..

**నానమ్మ తీరు నచ్చేది కాదు! .......**

కర్ణాటకకు చెందిన సంప్రదాయ కుటుంబంలో పుట్టిపెరిగింది లక్ష్మి. ఆమె కుటుంబంలో పట్టింపులు, నమ్మకాలు ఎక్కువ. చిన్నతనంలో ఎక్కువగా నానమ్మ దగ్గర ఉన్న ఆమె.. అక్కడే పుష్పవతి అయింది. అయితే రుతుచక్రం, నెలసరి, ఈ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఈ విషయాలేవీ అప్పటికి ఆమెకు తెలియవు. ఏ సందేహమొచ్చినా తన బామ్మను అడిగేది. ఆమె పాత కాలపు వ్యక్తి కావడంతో నెలసరికి సంబంధించి అనేక మూఢ నమ్మకాలు ఉండేవి.. అవి తనకు నచ్చేవి కావు అంటోంది. లక్ష్మి.

'నాటి తరానికి చెందిన మా నానమ్మ నెలసరి సమయంలో నాకు బోలెడన్ని ఆంక్షలు పెట్టేది. ఈ పని చేయకూడదు, ఈ వస్తువు ముట్టుకోకూడదు.. అని చెబుతుండేది. పొరపాటున ఈ విషయంలో ఏదైనా సందేహం వచ్చి అడిగినా ఆమె చెప్పే సమాధానంతో నా మనసు మరింత ఆందోళనకు గురయ్యేది. మహిళల జీవితంలో నెలసరి అనేది సహజంగా చోటు చేసుకునేదే ఇదే మూఢనోరణిలో ఉండిపోవాలను కోలేదు. సౌకర్యంగా ఆస్వాదించేలా చేయాలనుకున్నాను. ఈ ఆలోచనే పెద్దయ్యాక నెలసరిపై పోరాటం చేసేందుకు, ఈ అంశంపై అవగాహన పెంచేందుకు దోహదం చేసింది. అంటూ తన ఫస్ట్ పీరియడ్ అనుభవాల్ని నెమరు వేసుకుంది లక్ష్మి. నెలసరి విషయంలో ఇప్పటికీ నెలసరి సమాజంలో సానుకూల మార్పులొస్తున్నా.. కొన్ని దశాబ్దాలకు పూర్వం పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉండేవి. ప్రతి మహిళ జీవితంలో ఇది సహజంగా జరిగే ప్రక్రియే అయినా దీన్నో సమస్యగా చూసేవారంతా! ఇలాంటి ఆలోచనల్లో మార్పు తీసుకొచ్చేందుకు తొలుత పెయింట్ బ్రస్ పట్టుకున్నా. మహిళల ప్రత్యుత్పత్తి వ్యవస్థ, నెలసరి, ప్రెగ్నెన్సీ, అబార్షన్లు, ప్రసవం.. తదితర అంశాలపై బొమ్మలు గీసి.. కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన తరగతులు ఏర్పాటుచేసి ఈ బొమ్మల్ని చూపిస్తూ వాళ్లలో అవగాహన కల్పించా. ఇలా దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ 2000లో ప్రతిష్ఠాత్మక అవార్డు అందుకున్నా. 2001లో తన ఫ్రెండ్‌తో కలిసి స్వచ్ఛంద సంస్థను నెలకొల్పింది.

**అదే మా ప్యాడ్ ప్రత్యేకత....** నెలసరిపై అవగాహన కల్పించడంతో పాటు పర్యావరణహిత శ్యానిటరీ ఉత్పత్తుల్ని తయారుచేయడం ఈ ఎన్జీవో ముఖ్యోద్దేశం. మొదట్లో నాడా తరహా రీయూజబుల్ శ్యానిటరీ ప్యాడ్స్‌ని రూపొందించాం. ఈ తర్వాత మహిళల అవసరాల దృష్ట్యా డిజైన్‌లో పలు మార్పులు చేర్పులు చేశాం. మహిళా సౌకర్యార్థం ప్యాడ్ డిజైన్లకు తుది రూపొచ్చాక 2011 ప్రాజెక్ట్ ఉగార్ పేరుతో ప్రత్యేక ఇనిషియేటివ్‌ని ప్రారంభించాం. దేశవ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక తయారీ యూనిట్లను ఏర్పాటుచేసి.. అక్కడి స్వయం సహాయక బృందాల సహకారంతో ఈ రీయూజబుల్ ప్యాడ్ల ఉత్పత్తిని పెంచాం. ఎలాంటి రసాయనాలు వాడకుండా పూర్తి స్థాయిలో కాటన్ మెటీరియల్‌తో రూపొందించిన ఈ ప్యాడ్లను 'ఉగార్ ప్యాడ్స్' పేరుతో గ్రామీణ ప్రాంతాల మహిళలకు అందించడం మొదలుపెట్టాం. దీనికి మంచి స్పందన రావడంతో ఇదే డిజైన్‌ను అనుసరించి పలు సంస్థలు, ఎన్జీవోలూ సహజసిద్ధమైన రీయూజబుల్ ప్యాడ్లను రూపొందించడం మొదలుపెట్టాయి.



అలాగని వాళ్లు మా డిజైన్‌ను వాడుకోవడంపై ఎలాంటి చట్టపరమైన పరిమితులు పెట్టలేదు. ఎందుకంటే ఇలాగైనా రీయూజబుల్ ప్యాడ్స్ దేశవ్యాప్తంగా ఉన్న గ్రామీణ మహిళలకు చేరువవుతాయన్నది మా ఆలోచన. అంటోన్న లక్ష్మి.. ఆయా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు, స్వయం సహాయక బృందాల్లో పనిచేసే మహిళలకు ఈ న్యాచురల్ ప్యాడ్స్ తయారీపై అవగాహన కల్పిస్తున్నారు.

**'ప్యాడ్ గ్రాండ్‌మా'గా :...** ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో అక్కడి స్వచ్ఛంద సంస్థలతో మమేకమై.. ప్యాడ్ల తయారీ యూనిట్లను ఏర్పాటుచేస్తూ.. వేలాది మంది గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు లక్ష్మి.. ఈ న్యాచురల్ ప్యాడ్లను లక్షల మందికి చేరువ చేస్తున్నారు. ఇక తన ఎన్జీవో వేదికగా 'పికిల్స్ డిజైన్ స్టూడియో'ను ప్రారంభించి.. వివిధ ప్రాంతాలకు చెందిన డిజైనింగ్ విద్యార్థుల ప్యాడ్ల తయారీని నేర్పుతున్నారు. అంతేకాదు.. పురుషులకూ ఆయా అంశాలను అవగాహన పెంచుతున్నారామె. ఇలా ఆటు సహజసిద్ధమైన శ్యానిటరీ ప్యాడ్‌లను మహిళలకు చేరువ చేసే బొమ్మల రూపంలో సంబంధిత అవగాహన కల్పిస్తున్న లక్ష్మి ఏ.. ప్రపంచవ్యాప్తంగా నెలసరి పేదరికంపై పోరాడుతున్న స్వచ్ఛంద సంస్థలెన్నో స్ఫూర్తి నింపుతోంది. ఈ క్రమంలోనే వారూ లక్ష్మి తరహాలోనే బొమ్మల రూపంలో పీరియడ్స్‌పై అవగాహన కల్పిస్తుండడం విశేషం. ఈ నెలసరిని ప్రతి మహిళకూ అనుకూలంగా మార్చేందుకు కృషి చేస్తూ సమాజంలో మారు తున్న లక్ష్మి 'ప్యాడ్ గ్రాండ్‌మా'గానూ పేరు పొందారు. ఆమె సేవలకు గుర్తింపుగా పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు వచ్చాయి. ఇటీవలే ప్రతిష్టాత్మక 'ఫ్రెడ్ ఆఫ్ ఎన్ఐడి' అవార్డునూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదు అందుకున్నారీ ప్యాడ్ దాదీ. □

# వదులు దుస్తులే ఫ్యాషన్





బయట ఎండలు దంచేస్తున్నాయ్. ఈ ఉక్కబోతకు వదులు దుస్తుల్లో ఉండే సౌకర్యం.. దేన్లోనూ ఉండదు కదా! మరి బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు టాప్‌లూ, లెగ్గింగ్‌లూ ఒంటికి బిగుతుగా అనిపించవూ! పైగా శుభకార్యాలు ఏమైనా వచ్చినా పట్టు చీరలూ, ఓణీలాంటివి ఈ సీజన్‌లో అసౌకర్యంగా ఉంటాయి. ఇలాంటప్పుడు కఫ్తాన్ దుస్తులే ఫ్యాషన్. రకరకాల డిజైన్లలో, వదులుగా, సౌకర్యంగా ఉండే ఈ కఫ్తాన్ ఫ్యాషన్ ఎప్పటికీ ట్రెండే. అందుకే నేటితరం అమ్మాయిలు అటు ఇష్టం. ఇటు సౌకర్యానికే తగ్గట్టు వీటికే ఓటేస్తున్నారు. ట్రెండీగా, ఫ్యాషనబుల్‌గా కనిపించాలనుకుంటే వింటేజ్ స్టైల్, కొంచెం పాష్‌గా, అధునాతనంగా మెరవాలనుకున్నప్పుడు మ్యాక్సీను ఎంచుకుంటే సరి. గ్లామర్‌గా కనిపించాలనుకున్నప్పుడు ఆఫ్ షోల్డర్ డిజైన్ సరిగ్గా నప్పుతుంది. మీరు కనుక కొంచెం ఎత్తు తక్కువ. ఉంటే, అలాంటప్పుడు మిడీ కఫ్తాన్ డ్రెస్ ఉత్తమ ఎంపిక షార్ట్ డ్రెస్‌లో మీరు ఎత్తుగా కనిపిస్తారు. ఫ్యాషనబుల్ గానూ, ఆకర్షణీయంగానూ ఉంటారు. ఒకవేళ అందంగా, ట్రెండీగా కనిపించానుకుంటే అబ్‌స్ట్రాక్ట్ డిజైన్ కఫ్తాన్ గౌను వేసుకుంటే సరి







# రెడ్ రోవర్ ఆట!



పిల్లలు రెండు బృందాలుగా ఏర్పడాలి. ఒకరి చేతులు ఒకరు పట్టుకుని వరుసలో నిలబడాలి. వారికి ఎదురుగా రెండో బృందమూ అలానే నిల్చోవాలి. అయితే రెండింటి మధ్య 20 అడుగులు దూరం ఉండాలి. మొదటి టీమ్ నుంచి ఎవరో ఒక 'రెడ్ రోవర్ రెడ్ రోవర్ లెట్ రామ్ (ఏదో ఒక పేరు) ఓవర్ అని అరవాలి. పిలిచిన వ్యక్తి వచ్చి రెండో టీమ్‌లో చేతుల జతను విడగొట్టాలి. అలా వాళ్లు ఆ చైన్‌ను బ్రేక్ చేయగలిగితే ఓడిపోయిన టీమ్ నుంచిఒకర్నివాళ్ల గ్రూపులోకి తెచ్చుకోవచ్చు. అలా చేయలేకపోతే వాళ్లే ఆ గ్రూపులో చేరాల్సి ఉంటుంది. అలా చివరికి ఒకరుమిగిలేదాకా ఆడుకుంటూ ఉండాలి. ఈ ఆట పిల్లల్లో ఉత్సాహాన్నీ ఐకమత్యాన్నీ పెంచుతుంది. □

# సప్త క్షయ వ్యాధి సంక్రమణ

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

ఒక వ్యక్తికి చిన్నగా, నెమ్మదిగా పెరిగే ఏరోబిక్ బాసిల్లే అయిన మైకోబాక్టీరియమ్ ట్యూబర్క్యులోసిస్ సంక్రమించిన పుడు ఎటువంటి లక్షణాల్ని కల్గి ఉండరు. మరియు క్షయని వ్యాప్తి చేయలేరు. అయితే వారు చికిత్స పొందకపోతే భవిష్యత్‌లో వ్యాధి బారిన పడడమో లేదా వ్యాప్తి చెందించడంలో తోడ్పడుతారు. ఆక్టివ్ క్షయ వ్యాధి ఉన్న వ్యక్తి నుండి మాత్రమే టిబి బ్యాక్టీరియా వ్యాపిస్తుంది. దీన్నే ఇన్‌ఆక్టివ్ క్షయ, క్రియరహిత క్షయ, ఎటిబిఐ, గుప్త క్షయవ్యాధి సంక్రమణ అని అంటారు. ఎల్‌టిబి అనేది ఒక వ్యక్తికి సరైన తర్వాత సంభవించే క్లినికల్ సింద్రోమ్ అనీ చెప్పాలి. వీరు వ్యాధిని ప్రసారం చేయరు ప్రజారోగ్యానికి హాని కల్గించరు. 40% మంది ప్రాథమిక క్రియశీల క్షయవ్యాధితో, 60% మంది సప్త సంరక్షణను అభివృద్ధి చేస్తున్నారు. ప్రపంచ జనాభాలో నాల్గవ వంతు ప్రజలు సప్తక్షయ వ్యాధితో బాధ పడుతున్నారు. ఇది వ్యాధి యొక్క క్లినికల్ లక్షణాలు కల్గి ఉండక మైక్రోబాక్టీరియల్ ఆంటిజెన్‌కు రోగ నిరోధక సున్నితత్వం కల్గి ఉంటుంది. ఇది ఒక లక్షణం లేని స్థితి. ఆరోగ్యకరమైన వ్యక్తులు కూడా జీవితకాలం సప్తక్షయవ్యాధిని కల్గి ఉంటారు. ఇది నిద్రాణంగా ఉందా లేదా చురుకుగా మారుతుందా అనేది హోస్ట్ యొక్క ప్రతిఘటన మరియు సూక్ష్మ జీవుల ఎరులెన్స్ మధ్య సమతుల్యం బట్టి చికిత్స లేకుండానే సంక్రమణ పరిష్కరించ బడుతుందా అని నిర్ణయిస్తుంది. ప్రపంచ జనాభాలో 1/3 ప్రజలు సప్తక్షయ వ్యాధితో బాధపడుతున్నారు. ప్రతిసెకనుకు ఒక కేసు నమోదు అవుతుంది. ప్రతి 10మందిలో ఒకరు మాత్రమే క్రియాశీల క్షయని అభివృద్ధి చేస్తారు. ఆసియా, ఆఫ్రికాలో 80% యుఎస్‌లో 5-10% పాజిటివ్‌గా ఉన్నారు. డయాబెటిక్ రోగుల్లో ఇది ఆక్టివ్ క్షయగా 18% మారుతుంది. హెచ్ఐవి రోగుల్లో 10% సప్తక్షయ వ్యాధి ప్రతి సంవత్సరం ఆక్టివ్ క్షయగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. యుస్‌లో 13 మిలియన్ల మంది గుప్త క్షయవ్యాధిని కల్గి ఉన్నారు. సప్తక్షయ వ్యాధి సంక్రమణ ఉన్న ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధిని అభివృద్ధి చేయకపోయినా, చికిత్స లేకుండా 5-10% సోకిన వ్యక్తులు వారి జీవితకాలంలో క్షయవ్యాధిని అభివృద్ధి చేస్తారు. క్షయ ఇన్ఫెక్షన్ సోకిన 2-8 వారాల్లో మాక్రోఫేజెస్ 'ప్రత్యేక రోగ నిరోధక కణాలు) టి.బి. బాసిల్లె చుట్టూ చేరి అవరోధ కవచాన్ని ఏర్పరచడంతో ఇది నియంత్రణలో ఉంటుంది. దీన్నే సప్త క్షయ ఇన్ఫెక్షన్ అంటారు. ఇది కొన్ని సంవత్సరాల వరకు (40-50సం॥) జీవించగలదు. ఒక వ్యక్తి తెలియకుండానే సప్త క్షయవ్యాధిని కల్గి ఉంటాడు. ఆక్టివ్ క్షయవ్యాధి ఉన్న వ్యక్తి నుండి మాత్రమే టిబి బ్యాక్టీరియా వ్యాపిస్తుంది. ఒకటికి సప్త క్షయవ్యాధి ఉంటే వారికి ఆక్టివ్ అంటువ్యాధైన క్షయవ్యాధి ఉండదు. ఇది ఆక్టివ్ క్షయగా మారాలంటే బ్యాక్టీరియా చురుకుగా మారాలి. ఆక్టివ్ టి.బి.తో వ్యాధి లక్షణాలుంటేనే పరిక్షిస్తారు. అయితే క్షయవ్యాధి ఎప్పుడూ ఊపిరితిత్తుల్లో స్థిర పడదు. క్షయవ్యాధి వ్యాప్తి మెదడు, కిడ్నీలు, కీళ్ళు వంటి ఇతర అవయవాల్లో చేరే అవకాశం ఉంది. ఎల్‌టి.బి. వ్యాధి ఉన్న వ్యక్తి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చు. ఇది మైక్రోబ్యాక్టీరియమ్ కాంప్లెక్స్ ఆంటిజెన్‌లకు నిర్దిష్ఠ రోగనిరోదక ప్రతిస్పందనను గుర్తించడం ద్వారా నిర్వహించబడుతుంది. 10% మందిలో టిబిఐ క్రియశీల టి.బి. వ్యాధికి కారణమవుతుంది. ఇది మెక్సీక్ ఫిలిఫైన్స్, వియత్నం, ఇండియా, చైనా, హైతీలో ఎక్కువగా కన్పిస్తుంది. భారతదేశంలో 40% సప్తక్షయ వ్యాధిగ్రస్తులుంటే 21-48% మంది యుక్తవయస్కులే ఉండడం గమనార్హం. □

# హనుమ సుగుణాలు

ఆధ్యాత్మికం

హనుమ మాతృభక్తి పరాయణుడు, మనం ఆ సుగుణాన్ని అలవరచుకుంటే వృద్ధాశ్రమాలే ఉండవు. పావని ప్రభుభక్తిపరుడు. ప్రభువంటే రాజు, యజమాని, హనుమకి ప్రభువు సుగ్రీవుడు, సుగ్రీ వాజ్ఞకు తిరుగులేదు. సీతజాడ కనిపెట్టమని ఆదేశించగా.. ఆంజనేయుడు సముద్రాన్ని దాటి, సీతమ్మ జాడ కని పెట్టాడు. అటు రామకార్యాన్ని, ఇటు రాజాజ్ఞను నెరవేర్చాడు. ఆ కార్యదీక్షను, ధైర్యసాహసాలను అలవరచుకోవాలి. ఆంజనేయ స్వామి-స్వామిభక్తి ప్రపూర్ణుడు. స్వామి అంటే ఎవరు? సాక్షాత్తు శ్రీరాముడు. తన వినయం, విధేయత, భక్తి, సేవలతో స్వామిని అలరించాడు. ఆంజనేయుడిపట్ల అంత నమ్మకం ఉన్నందునే తన అంగుళీకాన్ని ఇచ్చి పంపాడు రాముడు. అతడే కార్యసాధకుడన్న మహావిశ్వాసం రాముడిది. అడుగడుగునా ఎదురైన ఆటంకాల్నన్నిటినీ అధిగమించాడు. సీతా మహాసాధ్విని కలిసి, ఆనవాలును చూపాడు. ఆ తల్లిని ఓదార్చాడు. తిరిగి రాముని చేరుకుని, ధైర్యం చెప్పి, రావణ సంహారంలో ఎన్నో విధాల సహకరించాడు. సీతారాములను కలిపాడు. అంతేనా వారిని తన హృదయంలో స్థిరపరచుకున్న భక్తాగ్రేసరుడు అంజనీ పుత్రుడు. పరోపకారానికి, లోకశ్రేయస్సుకి మరో రూపం ఆంజనేయుడు. లక్ష్మణుని బతికించడానికి ఏకంగా సంజీవని పర్వతాన్నే పెకలించుకుని వచ్చాడు. దుష్టసంహారం చేసి, జగత్తుకు ఎనలేని మేలు చేకూర్చాడు. నిత్యం రామనామ స్మరణతో భూలోకాన్నే పునీతం చేశాడు. రామభక్త హనుమంతుని ఆరాధనతో ఇన్నీ సద్గుణాలు అలవడతాయి. □



# ఆకర్షిస్తున్న డుకన్ డైట్

బరువు తగ్గడానికి మనలో చాలామంది ఏవేవో ప్రయత్నాలు చేస్తుంటాం కదా! వాటిలో ఎక్కువమంది ఆకర్షిస్తోందీ డుకన్ డైట్. ఎందరో తారలు దీన్ని ప్రయత్నించడంతో మనవాళ్ల చూపూ దీనిపై పడింది. ఇంతకీ ఏమిటీ డైట్? ఎక్కువ ప్రొటీన్, తక్కువ మొత్తం కార్బోహైడ్రేట్.. ఈ డైట్ ప్రధాన సూత్రం. ఇంకా ఇది నాలుగు దశల్లోనూ సాగుతుంది. అవేంటంటే.. ఎక్కువ ప్రొటీన్, తక్కువ మొత్తం కార్బోహైడ్రేట్స్.. ఈ డైట్ ప్రధాన సూత్రం, ఇంకా ఇదినాలుగు దశల్లోనూ సాగుతుంది, అవేంటంటే.

**అటాక్ ఫేజ్..** ఇది వారం రోజులు ఉంటుంది. ఈ సమయంలో లీన్ ప్రొటీన్‌కే ప్రాధాన్యమివ్వాలి. అంటే స్కిన్‌లెస్ చికెన్, గుడ్లు, చేప, సోయాలతో పాటు కొవ్వులేని పాలు, పెరుగు, చీజ్ వంటివి తినొచ్చు. రోజులో నూనె స్పూనుకి మించకూడదు. కూరగాయలు, పండ్లు, కొవ్వులు, చక్కెరలను అసలు దగ్గరికి రానివ్వకూడదు. అందుకే స్పూను వరకూ ఓట్ బ్రాన్ తొనొచ్చు. వీటితోపాటు రోజూ 8 గ్లాసుల నీరు తప్పనిసరిగా తాగాలి.

**క్రూయిజ్ ఫేజ్:** ఇది 12 నెలల వరకూ ఉంటుది. ఈ సమయంలో పిండి పదార్థాలు లేని కాయగూరలు, ఆకుకూరలు, దుంపలు, మష్రూమ్స్, ఉల్లి, బ్రకలీ, క్యాలీఫ్లవర్ వంటి వాటిని ప్రాధాన్యమివ్వాలి. ఒకరోజు లీన్ ప్రొటీన్ డైట్ తీసుకుంటే మరోరోజు కాయగూరలను తీసుకోవాలి. ఓట్ బ్రాన్, రెండు స్పూన్ల నూనెనీ తీసుకోవచ్చు. పండ్లు, బంగాళదుంప, మొక్కజొన్న, గోధుమ, వరి, బార్లీ, మిల్లెట్లు, చక్కెర వంటివి తినకూడదు.



**కన్సాలిడేషన్ ఫేజ్:** బరువు తగ్గడం మొదలయ్యాక ఇది ప్రారంభమవుతుంది. అరకేజీ తగ్గిన ప్రతిసారి దీన్ని పాటించాలి. ఇది అయిదురోజులు ఉంటుంది. ఈ సమయంలో లీన్‌ప్రొటీన్లు, పిండిపదార్థాలు లేనికాయగూరలతోపాటు కార్బొహైడేట్స్ కొవ్వు ఉన్న పదార్థాలు, ఒక పండునీ తీసుకోవచ్చు. ఒకరోజు రైస్, నిచ్చన ఆహారాలు తీసుకోవచ్చు. రెండు స్పూన్ల ఓట్ బ్రాన్ రోజూ తప్పనిసరి అయితే తీపిపదార్థాలు, అరటి, ద్రాక్ష, చెర్రీస్‌కి అనుమతి ఉండదు. ఈ సమయంలో రోజూ కనీసపం 25 నిమిషాలు ఏదైనా వ్యాయామం తప్పనిసరి.

**స్టెబిలైజేషన్ ఫేజ్:** కోరుకున్నంత బరువు తగ్గగానే క్రూయిజ్ ఫేజ్‌ని పక్కన పెట్టి, ఈ దశ కొనసాగిస్తూ వెళ్లొచ్చు. ఇక్కడ మరీ నోరు కట్టుకోవాల్సిన పని ఉండదు. లీన్ ప్రొటీన్లను వారానికోసారి తీసుకోవచ్చు. వారంలో 2-3 సార్లు అన్నం, తీపి పదార్థాలు, రోజూ పండ్లు, కాయగూరలు తినొచ్చు. అయితే రోజూ 3 స్పూన్ల ఓట్ బ్రాన్ తప్పనిసరి. నచ్చినవన్నీ తినమన్నారు దాని ఇష్టానుసారం లాగిస్తే బరువు పెరుగుతారు. □

# సొరకాయ చెక్కు పాటోలి

ఒక కప్పు శనగపప్పు నానపెట్టి, బరకగా గ్రైండ్ చేసి పక్కన పెట్టాం. సొరకాయ తొక్కను కడిగి, సన్నగా తరగాలి. కడాయిలో గరిటెడు నూనె వేసి, మినప్పప్పు, ఆవాలు, జీలకర్ర చెంచా చొప్పున, అల్లం తరుగు, ఎండుమిర్చి, కరివేపాకు, నానిన శనగపప్పు వేయాలి. పప్పు సగం ఉడికిన తర్వాత సొరకాయ చెక్కు కూడా వేసి మగ్గనివ్వాలి. చివర్లో కొంచెం కొత్తిమీర, తగినంత ఉప్పు వేస్తే సరిపోతుంది. ఆరోగ్యాన్నిచ్చే సొరకాయ చెక్కుతో రుచకరమైన పాటోలి మీరూ ప్రయత్నించండి. □

# 'థగ్ లైఫ్' ఆడియో లాంచ్ వాయిదా



ఉలగనాయగన్ కమల్ హాసన్, విజనరీ డైరెక్టర్ మణిరత్నం మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ థగ్ లైఫ్. భారీ తారాగణంతో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా సిద్ధమవుతోంది. జూన్ 5న ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో మే 16న భారీస్థాయిలో ఆడియో లాంచ్ ఈవెంట్‌ని నిర్వహించాలని టీమ్ భావించింది. అయితే, ప్రస్తుతం దేశ సరిహద్దుల్లో ఏర్పడిన పరిస్థితుల నేపథ్యంలో ఈ వేడుక వాయిదా వేసినట్లు చిత్ర బృందం తెలియ జేసింది. ఈ మేరకు కమల్‌హాసన్ ఆర్ట్ కెన్ వెయిట్ఇండియా కమ్స్ ఫస్ట్ అంటూ స్టేట్‌మెంట్ రిలీజ్ చేశారు. మన దేశ సరిహద్దుల్లో చోటు చేసుకున్న పరిణామాలు, ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, మే 16న నిర్వహించాల్సిన థగ్ లైఫ్ ఆడియో లాంచ్ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని నిర్ణయం తీసుకున్నాము. మన దేశాన్ని రక్షించడంలో మన సైనికులు అప్రతిహత ధైర్యంతో ముందుండి పోరాడుతున్న వేళ ఇది వేడుకలకు సమయం కాదని భావిస్తున్నాం. ఇది సంఘీభావానికి సమయమని నమ్ముతున్నాను. కొత్త తేదీని త్వరలో సముచితమైన సమయంలో ప్రకటిస్తాం. ఈ సమయంలో మన దేశాన్ని కాపాడుతూ అప్రమత్తంగా ఉన్న మన సైనికుల గురించి మనం ఆలోచించాలి. పౌరులుగా మనం సంయమనంతో, సంఘీ భావంతో స్పందించాలి అని కమల్ హాసన్ తెలియ జేశారు.

# 'కర్మణ్యేవాధికారస్తే' ట్రైలర్ రిలీజ్

బ్రహ్మాజీ, శత్రు, మాస్టర్ మహేంద్రన్ కీలక పాత్రల్లో నటించిన లేటెస్ట్ మూవీ కర్మణ్యేవాదికారస్తే. క్రైం ఇన్వెస్టిగేషన్ జానర్‌లో రూపొందిన ఈ సినిమా ట్రైలర్ నేడు(గురువారం) రిలీజైంది. 2.38 నిమిషాలు ఉన్న ఈ ట్రైలర్లో ఫైట్స్, గన్ ఫైరింగ్, రొమాన్స్, థ్రిలింగ్ వంటి సన్నివేశాలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. మూవీ ట్రైలర్లో బీజీఎమ్ హైలెట్గా నిలుస్తోంది. ఈ సినిమాలో ముఖ్యపాత్రల్లో బ్రహ్మాజీ, శత్రు,బెనర్జీ తదితరులు కనిపించనున్నారు. క్రైమ్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ చిత్రాన్ని డి ఎస్ ఎస్ దుర్గా ప్రసాద్ ఉషస్విని ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. అమర్ దీప్ చల్లపల్లి డైరెక్టర్‌గా చేస్తున్నారు.ఈ చిత్రానికి సంబంధించి ట్రైలర్‌ను చిత్ర బృందం విడుదల చేశారు.ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ ప్రభు ముఖ్య అతిథిగా హాజరై టీమ్‌కి విషెస్ చెప్పారు. హీరో మాస్టర్ మహేంద్ర మాట్లాడుతూ, నాకు సినిమా చేయటం అంటే చాలా ఇష్టం. కానీ ఏదో ఒక కేరక్టర్ చేశాం అని అన్నట్లుగా కాకుండా మంచి కథలు చేయాలని నాకు అనిపిస్తుంది.అలా అనుకుంటున్న టైంలోనే ఈ సినిమాని నాకు చెప్పారు డైరెక్టర్. ఈ సినిమాలో నా క్యారెక్టర్ చాలా డిఫరెంట్‌గా వుంటుంది. ఫస్ట్ హాఫ్ ఒక బాడీ లాంగ్వేజ్ ఉంటుంది, సెకండ్ హాఫ్‌లో ఒక బాడీ లాంగ్వేజ్ ఉంటుంది.నాకు సినిమా తప్ప ఇంకా ఏమి తెలియదు. నాలాగా సినిమానే ప్రపంచం అనుకునే వాళ్ళకి ఇలాంటి ఒక డైరెక్టర్ అండ్ ప్రొడ్యూసర్ దొరకడం చాలా కష్టం. సినిమా మీద వున్న నమ్మకంతో ప్రొడ్యూసర్ గారు ఈ సినిమాను ముందుకు తీసుకువెళ్లారు. బ్రహ్మాజీని చిన్నప్పటి నుంచి చూస్తూ పెరిగాను.ఈ సినిమాలో ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా హ్యాపీగా వుంది. థ్యాంక్ యూ అన్నారు. బెనర్జీ మాట్లాడుతూ, 'కర్మణ్యే వాదికారిస్తే అనేది ఒక పాజిటివ్ అండ్ పవర్ ఫుల్ ఎమోషనల్ టైటిల్. టైటిల్‌తోనే ఫస్ట్ పాజిటివ్ వైబ్ కనిపించింది, ఆ తర్వాత ఇప్పుడు పోస్టర్స్ చూస్తుంటే మరింత పెరిగింది. బ్రహ్మాజీ, శత్రు, మహేంద్ర అండ్ హీరోయిన్స్ వీళ్ళందరూ కూడా చాలా బాగా చేశారు. ట్రైలర్ చాలా బాగుంది. ట్రైలర్ చూస్తుంటే ఈ సినిమాలో ఇన్ డెప్త్ స్టోరీ ఉన్నట్లు అనిపిస్తుంది. ఈ సినిమాలో కొత్త వాళ్ళు చేశారా లేదా పాత వాళ్ళు చేశారా అనేది కాకుండా ఎంత బాగా చేశారు అనేది ఈ సినిమాలో కనిపిస్తుంది. సినీ ఇండస్ట్రీలో కొత్త జనరేషన్ వాళ్లు చాలా చక్కగా ప్రోగ్రెసివ్‌గా చేస్తున్నారు. కరోనా తరువాత సినిమాలు థియేటర్ వరకు వెళ్లడం కష్టమైపోతుంది అలానే సినిమాలు చచ్చి పోతున్నాయి. కొన్ని సినిమాలు మాత్రం చిన్నవి పెద్దవి అన్న తేడా లేకుండా మంచి సక్సెస్‌ని అందుకుంటు న్నాయి. ఈ సినిమా కూడా అలాగే సక్సెస్ అవుతుంది అని నేను అనుకుంటున్నాను. టీమ్ అందరికీ ఆల్ ద బెస్ట్ అని అన్నారు. హీరోయిన్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. మా సినిమాని సపోర్ట్ చేయడానికి వచ్చిన మీడియా మిత్రులకు చాలా థ్యాంక్స్. ఈ స్టేజ్ నాకు చాలా స్పెషల్ ఎందుకంటే ఇది నా ఫస్ట్ డెబ్యూ సినిమా. నన్ను నమ్మి నామీద నమ్మకంతో ఇలాంటి ఒక చాలెంజింగ్ రోల్ ఇచ్చినందుకు డైరెక్టర్ అండ్ ప్రొడ్యూసర్ ఇద్దరికీ చాలా థాంక్స్. మహేందర్‌తో కలిసి నటించడం చాలా బాగుంది. మా సినిమాని అందరూ సపోర్ట్ చేయాలి ఎందుకంటే ఒక మంచి సినిమా నీముందుకు తీసుకు వస్తున్నాం. ట్రైలర్ కూడా చాలా బాగుంది సో ప్లీజ్ సపోర్ట్ అవర్ ఫిలిం అని అన్నారు. బ్రహ్మాజీ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ముందుగా ఒక విషయం గురించి మాట్లాడుకోవాలి. అదే ఆపరేషన్ సింధూర్.. ఇలాంటి ఒక స్పెషల్ రోజున పాత్రికేయ మిత్రులను కలవడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా కాన్సెప్ట్ చాలా బాగుంటుంది. శత్రువులు ఎక్కడో ఉండరు మన చుట్టూనే మన ఇంట్లోనే ఉంటారు అని ఒక చక్కటి కాన్సెప్ట్‌తో డైరెక్టర్ ఈ సినిమాని మన ముందుకు తీసుకు వస్తున్నారు. ఈసినిమా స్టార్ట్ చేసిన కొత్తలో సినిమా మీద ఒపీనియన్ చాలా తక్కువగా ఉండేది కానీ రోజురోజుకీ షూటింగ్ టైంలో ఈ కంటెంట్ చూస్తే చాలా ఆశ్చర్యంకలిగింది. కంటెంట్ ఏంటి ఇంత బాగుంది అనిపించింది. ఇందులో చాలా థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉన్నాయి. క్లైమాక్స్ చాలా అద్భుతంగా డిజైన్‌చేశారు. డైరెక్టర్అండ్‌ప్రొడ్యూసర్ ఇద్దరు కూడా ఎంతో ఫ్యాషన్ ఉన్న వ్యక్తులు.



# 'శుభం'లో నన్ను ఆదరించినందుకు థాంక్స్

ప్రముఖ కథానాయిక సమంత నిర్మాతగా మారుతూ నిర్మించిన తొలిచిత్రం శుభం. హారర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కిన ఈ చిత్రం ఈ శుక్రవారం ప్రేక్షకులను ఆకట్టుకుంటూ విజయపథంలోకి దూసుకెళుతోంది. ఈ చిత్రంలో ముఖ్య పాత్రదారుల్లో ఒకరిగా నటించిన గవిరెడ్డి శ్రీనివాస రావు తన ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆయన మాట్లాడుతూ, శుభం చిత్రం ఘనవిజయం సాధించడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. ముఖ్యంగా సినిమాతో పాటు అన్ని పాత్రలను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు. ముఖ్యంగా నా పాత్రను కూడా ఆడియన్స్ బాగా ఆదరిస్తున్నారు. ప్రతి ఒక్కరూ నా పాత్ర గురించి మాట్లాడుకుంటుంటే ఎంతో ఆనందంగా ఉంది. నా పాత్రతో అందరూ కనెక్ట్ అవుతున్నారు. బాగా ఎంజాయ్ చేస్తున్నారు. త్వరలోనే ప్రతి థియేటర్‌కు వెళ్లి ప్రేక్షకులను నా యూనిట్‌తో పాటు కలవబోతున్నాను. నాకు ఇంత మంచి పాత్రను ఇచ్చిన సమంతకి, దర్శకుడికి నా ధన్యవాదాలు. భవిష్యత్‌లో ప్రేక్షకులను మరిన్ని మంచి పాత్రలతో అలరిస్తాను అన్నారు.



# ఒకప్పటి హీరో ఇప్పుడు బుల్లితెరకు ఫేమస్

సాధారణంగా సినీరంగంలో ఒకరికి ఒకరు బంధువులు అవుతారని వింటుంటాం. ఒకే ఫ్యామిలీకి చెందిన పలువురు ప్రముఖులు ఇండస్ట్రీలో తమకంటూ సెపరేట్ ఇమేజ్ క్రియేట్ చేసుకున్నారు. కొందరు హీరోహీరోయిన్లుగా.. మరికొందరు సహాయ నటులుగా స్థిరపడితే.. ఇంకొందరు సింగర్స్ అవుతుంటారు. కానీ ఈ స్టా మధ్య ఉండే బంధుత్వం గురించి ఎప్పుడూ బయటకు రాదు. ప్రస్తుతం ఇండస్ట్రీలో ఒకరికి ఒకరు బంధువులు అవుతున్నారని తెలిసి నెటిజన్స్ ఆశ్చర్యపోతున్నారు. ఇప్పుడు బుల్లితెరపై వరుస సీరియల్స్ ద్వారా ప్రేక్షకులను అలరిస్తున్నారు సాయి కిరణ్. కానీ ఒకప్పుడు ఇండస్ట్రీలో క్రేజీ హీరో.. హీరోగానే సినీప్రయాణం స్టార్ట్ చేసిన సాయి కిరణ్ ఆ తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్టుగా మారారు. ప్రస్తుతం సీరియల్స్‌లో తండ్రి, మామ పాత్రలు పోషిస్తున్నారు. కానీ మీకు తెలుసా.. సాయి కిరణ్ ప్రముఖ సింగర్ సుశీలమ్మకు దగ్గరి బంధువు అంట. ఈ విషయాన్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు సాయి కిరణ్. తరుణ్ నటించిన నువ్వే కావాలి సినిమాతో హీరోగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఆ తర్వాత ప్రేమించు మూవీతో నటుడిగా మంచి మార్కులు కొట్టేశాడు. తెలుగులో పలు చిత్రాల్లో నటిస్తూ కెరీర్ మంచి ఫాంలో ఉండగానే క్యారెక్టర్ ఆర్టిస్టుగానూ కనిపించాడు. ఆ తర్వాత కొన్నాళ్లపాటు సినిమాలకు దూరమైన సాయి కిరణ్ సెకండ్ ఇన్నింగ్స్‌లో సీరియల్స్ చేస్తున్నాడు. గతేడాది తన తోటి నటిని రెండో పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. సాయి కిరణ్ తండ్రి రామకృష్ణ ఇండస్ట్రీలో ఫేమస్ సింగర్. పి. సుశీలమ్మ సాయి కిరణ్‌కు నానమ్మ వరుస అవుతుందట. తన తండ్రికి సుశీలమ్మ పిన్ని అని.. అలా తనకు నానమ్మ అవుతుందని చెప్పుకొచ్చాడు సాయి కిరణ్. గుప్పెడంత మనసు సీరియల్లో మహేంద్ర పాత్రతో మరింత ఫేమస్ అయ్యాడు.




# 'శక్తిమతి' మోషన్ పోస్టర్ విడుదల

ప్రొడ్యూసర్ వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ, 1947 నుండి ఒక లైన్ తీసుకొని డెవలప్ చేసి నాకు చెప్పారు, మా డైరెక్టర్ రామకృష్ణ, అది నాకు నచ్చి సినిమా తీశాను. ఈ జనరేషన్ వాళ్ళు తప్పకుండా చూడాల్సిన సినిమా. ఆగస్టులో మీ ముందుకు రాబో తుంది. డైరెక్టర్ డి. రామకృష్ణ మాట్లాడుతూ, మా గురువు వి.వి. వినాయక్ చేతుల మీదుగా మోషన్ పోస్టర్ లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. మా ప్రొడ్యూసర్ వెంకటేష్ గౌడ్, సినిమాని కాంప్రమైజ్ కాకుండా తీశారు. ప్రజెంట్ సంగీత యువ సంచలనం భీమ్స్ చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. భాను మాస్టర్ చక్కటి కొరియోగ్రఫీ ఇచ్చారు. ఇందులో దాదాపు 30 నిమిషాలు విఎఫ్ఎక్స్ ఉంది, దాని వల్ల మాకు చాలా టైమ్ పట్టింది, ప్రస్తుతం డబ్బింగ్ పనిలో ఉంది. పోస్ట్ ప్రొడక్షన్ మొత్తం ఫినిష్ చేసుకొని ఆగస్టులో మీ ముందుకు వస్తున్నందుకు ఆనందంగా ఉంది. మీ అందరూ మమ్మల్ని ఆదరిస్తారు అని కోరుకుంటున్నాము అన్నారు. హెబ్బా పటేల్, సుమన్, శ్రావణ్,శ్రీధర్ తదితరులు నటించిన ఈ చిత్రానికి నిర్మాత: వెంకటేష్ గౌడ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పి.రమణ రెడ్డి సంగీతం: భీమ్స్ లిరిక్స్: కె కల్పన మాణిక్ కెమెరా: కె చిట్టి బాబు, ఆర్ట్ డైరెక్టర్: మూర్తి పి ఆర్ ఓ: బి. వీరబాబు ఎడిటర్: పి.రామకృష్ణ స్టోరీ స్క్రీన్ ప్లే డైరెక్షన్: డీ: రామకృష్ణ.



# కంగన ఖాతాలో మరో క్రేజీ ప్రాజెక్ట్

నేషనల్ అవార్డు విన్నర్ కంగనా రనౌత్ టాలెంట్ గురించి కొత్తగా చెప్పనక్కర్లేదు. ఇప్పటికే ఎన్నో సినిమాలతో నటిగా తనను తాను ప్రూవ్ చేసుకున్న కంగనా నుంచి రీసెంట్‌గా ఆడియన్స్‌ను ఇంప్రెస్ చేసే సినిమాలేవీ రాలేదు. ఎమర్జెన్సీ సినిమాపై ఎన్నో ఆశలు పెట్టుకుని ఆ సినిమా చేస్తే ఆ సినిమా కంగనా ఆశలపై నీళ్లు చల్లింది. భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీగా ఈ సినిమాలో కంగనా కనిపించింది. ఈ సినిమాలో కంగనా నటనకు మంచి ప్రశంసలు వచ్చినప్పటికీ సినిమా మాత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. ఆ సినిమా తర్వాత కంగన నుంచి మరో సినిమా వచ్చింది లేదు. అయితే ఇప్పుడు కంగన ఓ హాలీవుడ్ సినిమాలో నటిస్తుందని తెలుస్తోంది. బ్లెస్డ్ బి ది ఈవిల్ అనే హాలీవుడ్ సినిమాలో కంగన ఛాన్స్ అందుకున్నట్టు సమాచారం. హార్రర్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ సినిమాలో కంగన టైలర్ పోజీ, స్కార్లెట్ రోజ్ స్టాలోన్ తో కలిసి స్క్రీన్ ను షేర్ చేసుకోనుంది. లయన్ మూవీస్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఈ సమ్మర్‌లోనే న్యూయార్క్‌లో మొదలవనుంది. ఈ సినిమా షూటింగ్ ఎక్కువ భాగం యూఎస్ఏలోనే జరుగుతుందట. గతంలో టైలింగ్ పాండ్, న్యూ మీ సినిమాలకు దర్శకత్వం వహించిన అనురాగ్ రుద్ర ఈ బ్లెస్డ్ బి ది ఈవిల్ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమా కోసం పలువురు టాప్ టెక్నీషియన్లు పని చేస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం రాజకీయాల్లో బిజీగా ఉన్న కంగన కొత్తగా ఏ బాలీవుడ్ సినిమానూ ఒప్పుకుంది లేదు.







# మైత్రీ మూవీ మేకర్స్ చిత్రం టైటిల్ అనౌన్స్‌మెంట్

ఉస్తాద్ రామ్ పోతినేని కథానాయకుడిగా టాప్ ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్‌లో ఓ సినిమా రూపొందుతోంది. మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి విజయం తర్వాత యంగ్ అండ్ టాలెంటెడ్ మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. హీరోగా రామ్ 22వ చిత్రమిది. మే 15న రామ్ పోతినేని పుట్టినరోజు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన కొత్త సినిమా టైటిల్ అధికారికంగా అనౌన్స్ చేయడంతో పాటు గ్లింప్స్ కూడా విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఇందులో సాగర్ పాత్రలో రామ్ పోతినేని, మహాలక్ష్మి పాత్రలో భాగ్యశ్రీ బోర్సే కనిపించనున్నారు.రామ్ జంటగా భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాలో రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేష్ ఇతర తారాగణం. ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ్ నూని, మ్యూజిక్: వివేక్ మెర్విన్, సీఈవో: చెర్రీ, ప్రొడక్షన్ హౌస్: మైత్రి మూవీ మేకర్స్, ప్రొడ్యూసర్స్: నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్, కథ, కథనం, దర్శకత్వం: మహేష్ బాబు పి.



# 'వీడీ 14' కొత్త పోస్టర్ లాంచ్

హీరో విజయ్ దేవరకొండ, డైరెక్టర్ రాహుల్ సంకృత్యన్, ప్రెస్టీజియస్ బ్యానర్స్ మైత్రీ మూవీ మేకర్స్, టీ సిరీస్ కాంబోలో రూపొందుతున్న క్రేజీ మూవీ వీడీ 14. ఈ సినిమా బ్రిటీష్ కాలం నేపథ్యంతో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కనుంది. విజయ్ సరసన రశ్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తోంది. నవీన్ యెర్నేని, వై రవిశంకర్, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. హీరో విజయ్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా స్పెషల్ పోస్టర్‌తో శుభాకాంక్షలు తెలియజేశారు మేకర్స్. ఈ పోస్టర్‌లో ధ్యానముద్రలో ఉన్న విజయ్ దేవరకొండ స్టిల్ ఆసక్తి కలిగిస్తోంది. బ్రిటీష్ పాలన కాలం నేపథ్యంగా వచ్చిన చిత్రాల్లో ఇప్పటిదాకా ఎవరూ తెరకెక్కించని కథాంశంతో వీడీ 14 ఒక పవర్ ఫుల్ మూవీగా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందనే నమ్మకాన్ని మేకర్స్ వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభించబోతున్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా ఈ సినిమా రూపొందుతోంది. నటీనటులు: విజయ్ దేవరకొండ, తదితరులు టెక్నికల్ టీమ్: పీఆర్ఓ: జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్), బ్యానర్స్: మైత్రీ మూవీ మేకర్స్, టీ సిరీస్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై రవిశంకర్, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్. రచన, దర్శకత్వం: రాహుల్ సంకృత్యన్.



# జగ్గయ్యపేటను ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

## -ఎంపి కేశినేని చిన్ని, ఎంఎల్‌ఏ రాజగోపాల్



జగ్గయ్యపేట మండల పరిధిలోని ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న విజయవాడ ఎంపి కేశినేని చిన్ని

**జగ్గయ్యపేట, మే 9, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యతనిస్తుందని, ఈనేపథ్యంలోనే జగ్గయ్యపేటను ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), జగ్గయ్యపేట ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని వేదాద్రి గ్రామంలో 700ల ఎకరాలు, జయంతిపురం గ్రామంలో ఏపిఐఐసి ల్యాండ్ 498 ఎకరాల ప్రభుత్వ భూములు 313 ఎకరాలను జిల్లా కలెక్టర్ లక్ష్మీశా, ఆర్డీఓ బాలకృష్ణలతో కలిసి ఎంపి, ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దటానికి మంచి పరిణామమని, తద్వారా యువతకు ఉద్యోగాల కల్పన, నియోజకవర్గ అభివృద్ధి జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

అయితే కొసమెరుపు ఏమిటంటే 2014 ఎన్నికల సందర్భంలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు జగ్గయ్యపేటకు విచ్చేసిన సందర్భంలో రాష్ట్ర సరిహద్దుగావున్న జగ్గయ్యపేటను ఇండస్ట్రియల్ హబ్‌గా మారుస్తానని, ఆంధ్రా-కర్నాటక బోర్డర్‌లో ఇలాగే ఇండస్ట్రియల్ హబ్ అద్భుతంగా రూపొందిందని వాగ్దానంచేశారు. తదనంతరం అధికారంలోకి వచ్చినా కేవలం అమరావతిపైన మాత్రమే దృష్టి నిలిపి ఇతర ప్రాంతాల అభివృద్ధిని విస్మరించటంతో ప్రజలు 2019 ఎన్నికల్లో తిరస్కరించిన విషయం తెలిసిందే. నేడు తిరిగి అధికారంలోకి వచ్చిన పరిస్థితుల్లో సిఎం ఇచ్చిన హామీ గురించి నేతలు మర్చిపోయారు. కొత్తగా విజయవాడ ఎంపి, జగ్గయ్యపేట ఎంఎల్‌ఏ మళ్లీ అదే వాగ్దానాన్ని కొత్తగా ప్రతిపాదిస్తూ ప్రకటించటంతో ఈప్రాంతవాసులను ఆశ్చర్య చకితులయ్యారు.

## బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం

**రాపూరు (నెల్లూరు), మే 9, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహుని బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ శుక్రవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో బాగంగా ఉదయం స్వామి,అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించి, స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూలాంగి సేవ నిర్వహించారు. అనంతరం స్వామి,అమ్మవార్లను, గరుత్మంతుడి చిత్రపటన్ని తిరుచ్చిపై వుంచి ఆలయంలో గిరి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ధ్వజస్థంబం వద్ద బ్రహ్మోత్సవాలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలంటూ నూతన వస్త్రంపై వున్న గరుత్మంతుని చిత్రపటానికి పూజలు నిర్వహించి ధ్వజస్థంబంపై ఎగురవేశారు. ఈ సందర్భంగా ధ్వజస్థంబం వద్ద స్వామి ప్రసాదంగా వుంచిన కోడి ముద్దల కోసం భక్తులు పోటీపడ్డారు. పిల్లలు లేని వారు, అనారోగ్య సమస్యలు, మానసిక ప్రశాంతత లేని వారు ఈ కోడి ముద్దలు స్వీకరిస్తే వారి సమస్యలు పరిష్కారమైతాయని భక్తుల నమ్మకం. ఈ కార్యక్రమంలో సేవా కమిటీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, ఆలయ డిప్యూటీ కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, ఆలయ సీనియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, గోనుపల్లి సర్పంచ్ గోతాటి నారాయణమ్మ, సేవా కమిటీ సభ్యులు రంగినేని వెంకటరమణయ్య, పీర్ల సోమయ్య, బొట్టా హజరత్ నాయుడు, తోట క్రిష్ణయ్య, శ్రీశైలం భార్గవ రామ్, కిన్నెర నరసింహా రావు,పెమ్మసాని సుగుణమ్మ, మోమిడి నరసింహులు, బోగులు బాస్కర రెడ్డి, బోతల శివ నాగేశ్వర రావు, దాసరి బాస్కర నాయుడు, యం.నవక్రిష్ణ చౌదరి, ఈతముక్కల యోగేశ్వర రావు తదితరులు వున్నారు.స్వామి వారి పూజా, కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామిల ఆధ్వర్యంలో తిరుమల వేదపాఠశాల పంచరాత్ర ఆగమ పండితులు రామానుజాచార్యులు
పర్యవేక్షణలో అర్చక స్వాములు గుండ్లూరు శశి స్వామి, మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వినోద్ స్వామి,మోక్షజ్ఞ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.

# ఆపరేషన్ సింధూర్ కు మద్దతుగా రాష్ట్ర సచివాలయ ఉద్యోగులు సంఘీభావ ర్యాలి



**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:**పహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా భారత త్రివిధ ధళాల సారధ్యంలో చేపట్టిన ``ఆపరేషన్ సింధూర్‌కు మద్ధత్తుగా శుక్రవారం అమరావతి రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల అధికారులు,ఉద్యోగులు,పలు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు.సచివాయం మొదటి భవనం నుండి ప్రధాన గేటు వరకూ ఈసంఘీభావ ర్యాలీ నిర్వహించారు.జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పహల్గామ్ లో గత నెలలో పాక్ ఆక్రమిత కాశ్మీర్ పరిధిలోని పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు మన దేశానికి చెందిన 26మంది అమాయక పర్యాటకులను అతికిరాతకంగా కాల్చిచంపిన నేపధ్యంలో దానికి ప్రతీకారంగా భారత ప్రభుత్వం త్రివిధ దళాల సంయుక్త ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్ చేపట్టి సుమారు 100 మందికి పైగా ఉగ్రవాదులను వారి స్థావరాలను నేలమట్టం చేయడం జరిగింది. ఆతదుపరి భారత్‌పాకిస్థాన్ ల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపధ్యంలో పాక్ కవ్వింపు చర్యలను మన దేశ త్రివిద దళాలకు చెందిన సైనికులు గత నాలుగు రోజులుగా పెద్దఎత్తున సమర్ధవంతంగా తిప్పి కొట్టడం జరుగుతోంది. భారతదేశ త్రివిద దళాల పోరాటానికి సంఘీభావంగా రాష్ట్ర సచివాలయ అధికారులు, ఉద్యోగులు ``జయహో ఆపరేషన్ సింధూర్,జై జవాన్,జై భారత్,భారత్ మాతాకి జై వంటి నివాదాలతో ర్యాలీ నిర్వహించారు.అంతేగాక పాక్ కాల్పుల్లో అమరుడైన రాష్ట్రానికి చెందిన ``అగ్నివీర్ మురళీ నాయక్ అమర్ రహే అంటూ ఉద్యోగులు పెద్దఎత్తున నినదించారు.

అంతేగాక ఉగ్రవాదులను పూర్తిగా తుదిముట్టించేందుకు భారత త్రివిద సైనిక దళాలు పాక్ కవ్వింపు చర్యలను తిప్పికొట్టేందుకు అహర్నిశం పాటుపడుతున్న కృషికి దేశం యావత్తు వారి వెంట నిలిచింది.అందుకు అనుగుణంగా రాష్ట్ర సచివాలయ అధికారులు, ఉద్యోగులు,ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పెద్దఎత్తున ఈర్యాలీలో పాల్గొన్నారు.

## జవాను మురళీ నాయక్‌కు సీఎం చంద్రబాబు నివాళి

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:**పాకిస్తాన్ తో జరుగుతున్న యుద్దంలో సత్యసాయి జిల్లా కల్లితండాకు చెందిన జవాను మురళీ నాయక్ వీర మరణం పొందడం తీవ్ర వేదనను కల్గించిందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. "ఎక్స్' ఖాతా వేదిక జవాను మురళీ నాయక్ సీఎం చంద్రబాబు నివాళి అర్పించారు.దేశ రక్షణ కోసం ప్రాణాలు విడిచిన మురళీ నాయక్ వీర మరణం తెలుగు ప్రజలకే కాక దేశ ప్రజలందరికీ స్ఫూర్తి దాయకమన్నారు సీఎం.పాకిస్తాన్ తో యుద్దంలో మురళీ నాయక్ ప్రదర్శించిన ధైర్యసాహసాలకు బిగ్ సెల్యూట్ మురళీ నాయక్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుడ్ని ప్రార్ధిస్తున్నాను మురళీ నాయక్ కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి మురళీ నాయక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుంది. ఆ కుటంబానికి అన్ని వేళల్లో రాష్ట్రప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.ఇక భారత్ పాకిస్థాన్ యుద్ధ భూమిలో వీరమరణం పొందిన తెలుగు జవాన్ మురళీ నాయక్ కుటుంబాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోన్‌లో పరామర్శించారు. దేశ రక్షణలో పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన మురళినాయక్ ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు

# తెలంగాణ ప్రభుత్వ కార్యక్రమాలు దేశానికి దిశానిర్దేశం

## బెంగళూరు సదస్సులో విడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 9:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలు, అనుసరిస్తున్న విధానాలు దేశానికి దిశానిర్దేశం చేస్తున్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు. సామాజిక న్యాయంతో పాటు ఇతర అంశాల్లో తెలంగాణ మాడల్‌ను కేంద్ర ప్రభుత్వం కూడా అనుసరించాల్సి న పరిస్థితి ఉందన్నారు.బెంగుళూరు వేదికగా శుక్రవారం జరిగిన 'ది హిందూ హడిల్-2025' కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. పెట్టుబడుల కోసం ప్రపంచ దేశాలు చైనా ప్లస్ వన్ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్న తరుణంలో దానిని అందిపుచ్చుకోవాలన్న ఆలోచనతో అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్టు వివరించారు. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాల అమలుతో పాటు అభివృద్ధి ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని వాటిని సమగ్రంగా తెలియజేశారు.

మారుతున్న పరిస్థితులకు అను గుణంగా తమ ప్రభుత్వం విద్య, ఉపాధి, మౌలిక సదుపాయాల కల్పనా రంగాలపై దృష్టి సారించింది. అందులో భాగంగా అనేక వినూత్న ప్రణాళికలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ప్రపంచ దేశాల్లోని అగ్రగామి నగరాలతో పోటీ పడాలన్నదే మా ఆలోచన.అందులో భాగంగానే నెట్ జీరో సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. దేశంలోనే మొట్టమొదటిదిగా ఫ్యూచర్ సిటీకి రూపకల్పన చేశాం. ఎలక్ట్రిక్ వాహనాలపై పన్ను రద్దు చేశామన్నారు.. 360 కి.మీ మేరకు రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించడమే కాకుండా తెలంగాణలో ప్రాంతాల వారిగా పారిశ్రామికీకరణకు సన్నద్ధమయ్యామని పేర్కొన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు లోపలి పరిధిలో పారిశ్రామిక పార్కులు, ఐటీ, ఎలక్ట్రిక్ వాహనాలు, అటోమొబైల్ ఇండస్ట్రీ, ఇతర పరిశ్రమలను ఆకర్షించే విధంగా మౌలిక సదుపాయాల కల్పించాలన్నదే ప్రయత్నం. డ్రైపోర్టు నిర్మాణం వంటి అనేక ప్రణాళికలకు రూపకల్పన చేశామన్నారు. రాష్ట్రానికి 2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను సాధించాం, ఇవన్నీ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చుతాయన్నారు. మా ప్రభుత్వం సహేతుకమైన ప్రణాళికలతో పెట్టుబడులను ఆకర్షించేందుకు, పరిశ్రమలు, ఐటీ కంపెనీలు, ఇతర రంగాలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తుంద న్నారు. ప్రతి అంశాన్ని అందిపుచ్చుకుంటూ ముందుకు వెళ్లాలన్నదే ప్రయత్నం. ఇటీవల జపాన్ దేశ పర్యటన సందర్భంగా తెలుసుకున్న విషయాల మేరకు ఆ దేశానికి అవసరమైన మానవ వనరులను సమకూర్చడానికి వీలుగా తెలంగాణలో జపనీస్ భాషను నేర్పించాలని సంకల్పించామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య ఉద్యోగ, రాజకీయ సర్వే దేశానికి ఒక మోడల్‌గా నిలిచింది. ఈ సర్వే సమాజాన్ని మరింత సమర్థవంతంగా గుర్తించి సేవలు అందించడంలో దోహదపడుతుందన్నారు. ఇది కేవలం బీసీల కోసమే కాదు.ఈ సర్వే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ ప్రజలకూ ఉపయోగపడుతుందన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు తెలంగాణ ముందడుగు వేసింది. కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ మాడల్‌ను అమలు చేయాలి.ఈ రకంగా అనేక కోణాల్లో తెలంగాణ రైజింగ్ మొదలైందన్నారు. తెలంగాణలోని వేర్వేరు రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఐసోలేషన్ గా సాగుతున్న విద్యను ఇంటిగ్రేట్ చేయడం ద్వారా పిల్లల్లో సోషలైజేషన్ ప్రక్రియకు చేపట్టాం, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఒక కీలకమైన నిర్ణయమన్నారు. జనాభాలో దాదాపు 60 శాతమున్న వ్యవసాయ కుటుంబాలకు అండగా ఉండేందుకు అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే రాష్ట్రంలో 25 లక్షలకు పైగా రైతులకు 21,617 కోట్ల రూపాయల మేరకు రుణమాఫీ చేశాం. రైతులకు ఏటా 12 వేలు ఇన్ పుట్ సబ్సిడీగా ఇస్తున్నాం. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం.

దేశంలోనే అత్యధికంగా వరి ఉత్పత్తి చేసే రాష్ట్రం కనీస మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తున్నాం. అలాగే 67 లక్షల సభ్యులున్న స్వయం సహాయక సంఘాల మహిళలకు వెయ్యి మెగావాట్ల సోలార్ ఉత్పత్తిని అవకాశం, పాఠశాలల నిర్వహణ, యూనిఫామ్ వంటి బాధ్యతలన్నీ వారికే అప్పగించాం. ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 59 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. నిరుద్యోగ యువతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ అనేక నిర్ణయాలు తీసుకున్నామన్నారు.. స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, టాటా టెక్నాలజీస్ సహకారంతో రాష్ట్రంలోని 105 ఐటీఐలను ఏటీసీలుగా మార్చుతున్నాం. ఇవన్నీ యువతకు ఉద్యోగ అవకాశాలు, ఉపాధి మార్గాలను చూపించడంలో భాగంగా చేపట్టామన్నారు డీలిమిటేషన్‌కు మేము వ్యతిరేకం కాదు. కానీ ముందు కేంద్ర ప్రభుత్వం ఆ ప్రక్రియకు సంబంధించి అన్ని పార్టీలతో సంప్రదింపులు జరిపి అందుకు ప్రాతిపదికను స్పష్టంగా వెల్లడించాలి. అన్ని రాష్ట్రాలకు సమన్యాయం కావాలన్నదే మా డిమాండ్. అభివృద్ధి సాధిస్తున్న రాష్ట్రాలను శిక్షించకూడదు. ఇది సామాజిక, రాజకీయ న్యాయానికి సంబంధించిన అంశం. అందుకే చర్చ జరగాలని అడుగుతున్నామని చెప్పారు.

### సైనికులకు అందరం మద్దతు తెలపాలి

ఈ కార్యక్రమంలో తొలుత ముఖ్యమంత్రి మాట్లాడుతూ, మొదటగా నేను భారతీయ సైన్యానికి సెల్యూట్ చేస్తున్నాను. దేశాన్ని రక్షించడంలో అహర్ని శలు కృషి చేస్తున్నారు. దేశ రక్షణ కోసం నిరంతరం కాపలాకాస్తోంది. ఈ సమయంలో అందరం సైనికులకు మద్దతు తెలపాలి అని పిలుపునిచ్చారు

# మనదేశ పోరాటం.. న్యాయపోరాటం

## అందాలపోటీలు వాయిదా వేయండి

## తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్ (ముషీరాబాద్), మే 9, ప్రభాతవార్త:** పాకిస్థాన్‌పై మనదేశం చేస్తున్న పోరాటం న్యాయపోరాటమని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. భారత జవాన్లు నిర్వహిస్తున్న ఆపరేసన్ సంధూర్‌కు సంఘీభావంగా శుక్రవారం సాయంత్రం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఇందిరాపార్కు చౌరస్తా నుండి అశోక్‌నగర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిధిగా హాజరై కవిత మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాల మీద మనం యుద్ధం చేస్తూ ఉంటే పాకిస్తాన్ మన సివిల్ ఎయిర్‌ఫోర్స్ మీద దాడి చేస్తున్నారని ఆరోపించారు. మన భారతదేశ సైనికులకు అండగా ప్రతి రాష్ట్రంలో ప్రతి ప్రాంతంలో సంఘీభావ ర్యాలీలు జరగాలని, దేశంకి, సైనికులకు తోడుగా మనం కూడా నిలబడాల్సి న అవసరం ఉందని అన్నారు. ఒకవైపు యుద్ధం జరుగుతూ ఉంటే మరోవైపు మిస్‌వరల్డ్ పోటీలు జరపటం సరికాదని, ఐపీఎల్ ఎలాగైతే వాయిదా వేశారో అదే విధంగా అందాల పోటీలను కూడా వాయిదా వేయాలని ఆమె సూచించారు. ఒక వైపు యుద్ధం జరుగుతూ, ప్రపంచ దేశాలన్నీ మనకు అండగా నిలుస్తున్నాయని, ఇటువంటి సమయంలో మనం కూడా విజ్ఞత ప్రదర్శించి, అందాల పోటీలు వాయాల్సి న అవసరం ఉందని అన్నారు. మేనిఫెస్టో హామీలను అమలుచేయమని ప్రజలు కోరుతూ ఉంటే, ఆ హామీలు నెరవేర్చలేని ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసే విధంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిపాలన చేతకాకపోతే, ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవటం చేతకాకపోతే రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చకుండా, తక్షణమే ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ , బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, జాగృతి నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సైనికులకు సంఘీభావంగా ర్యాలీ నిర్వహిస్తున్న జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత

## మురళి త్యాగం వెలకట్టలేనిది

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్ నివాళి

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** దేశం కోసం ప్రాణాలర్పించిన మురళీ నాయక్ త్యాగం, ధైర్యం మరువలేనిది, వెలకట్టలేనిదని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో నివాళులు అర్పించారు. దేశ రక్షణలో ప్రాణాలర్పించిన వీర జవాన్ మురళీ నాయక్ మృతి ఆయన కుటుంబ సభ్యులకు తీరనిలోటని మహేష్ కుమార్ గౌడ్ సంతాపం వ్యక్తం చేశారు. సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితాడ పంచాయతీకి చెందిన మురళీనాయక్ యుద్ధభూమిలో మరణించారన్న వార్త దిగ్భ్రాంతికి గురి చేసిందని ఆయన పేర్కొన్నారు. మురళీనాయక్ తలితండ్రులు కోరినట్లు జిల్లా కేంద్రంలో, గోరంట్లలో కల్లితాడలో ఆయన విగ్రహం ఏర్పాటు చేసి భారతమాత రక్షణకోసం ప్రతి ఒక్కరు అంకితభావంతో నిలిచేందుకు స్ఫూర్తి పొందాలని ఆయన కోరారు. వీర మరణం పొందిన మురళీ నాయక్ కి నివాళులు అర్పిస్తున్నాఅని పేర్కొన్నారు మురళీ నాయక్ కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి అని తెలిపారు. మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ అదేవున్ని ప్రార్ధిస్తున్నా అని ఆయన పేర్కొన్నారు.

## సివిల్ సర్వీసెస్ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ ఒకరోజు వేతనం విరాళం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మే 9 :** దేశ భద్రతకు అంకితమైన మన సైనిక బలగాలు పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై సాహసోపేతంగా ఆపరేషన్ సిందూర్ నిర్వహిస్తున్న సందర్భంలో, వారి సేవా నిరతికి ఉడతా భక్తిగా తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ ఒక రోజు వేతనం విరాళంగా ప్రకటించింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వం, మార్గదర్శనంలో, తమ ఒకరోజు వేతనాన్ని నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు విరాళంగా ఇవ్వనుంది. దేశభక్తిని ప్రేరణగా చేసుకుని, సైనికుల పట్ల గౌరవ భావంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కె.చంద్రమోహన్, జనరల్ సెక్రటరీ ఏ. భాస్కరరావు ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రభుత్వానికి ఈ మేరకు అధికారికంగా లేఖను అందించనున్నట్లు వారు తెలిపారు.

## మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయండి

### విశ్వహిందూ పరిషత్ డిమాండ్

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త :** భారత్-పాక్‌ల మధ్య యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో మిస్ వరల్డ్ పోటీలను తెలంగాణ ప్రభుత్వం రద్దు చేయాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. శత్రుదేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్,టర్కీ,కెనడా వంటి దేశాల ప్రతినిధులతో అందాల పోటీలు ఎలా నిర్వహిస్తారని విహెచ్‌పి జాతీయ స్పోక్స్ పర్సన్ డాక్టర్ రావి నూతల శశిధర్ శుక్రవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. హైదరాబాద్‌లో రక్షణ రంగం సంస్థల చుట్టూ(డిఆర్‌డిఓ,డిఆర్‌డిఎల్) నివాసాలు ఏర్పాటు చేసుకున్న చేసుకున్న అక్రమ చొరబాటుదారులను తెలంగాణ ప్రభుత్వం వెంటనే అరెస్ట్ చేసి వెనక్కి పంపాలని డిమాండ్ చేశారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

## నెలాఖరులోగా ప్రెస్ అకాడమీ భవన్ ప్రారంభిస్తాం

## రెవెన్యూ హౌజింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు నెలసరి పెన్షన్, తీవ్ర అనారోగ్యం, ప్రమాదాలకు గురై వృత్తి నిర్వహించలేని స్థితిలో ఉన్న జర్నలిస్టులకు శుక్రవారం నాంపల్లిలోని ప్రెస్ అకాడమీ కార్యాలయంలో చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలైన జర్నలిస్టులకు, వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామన్నారు. మండల, నియోజకవర్గ స్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులను ఆదుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మంచిని మంచిగా, నిజాన్ని నిర్భయంగా సమాజానికి తెలియజేయడంలో ఎంతోమంది జర్నలిస్టులు ఆణి ముత్యాలుగా పనిచేస్తున్నారన్నారు. జర్నలిస్టు వృత్తిని నమ్ముకుని జీవితం మొత్తం ఆ వృత్తికే అంకితమైనవాళ్లు ఎంతోమంది ఉన్నారన్నారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ప్రెస్ అకాడమీ భవనాన్ని చిన్నచిన్న మరమ్మతులు పూర్తి చేసుకుని ఈ నెల చివరిలోగా ప్రారంభిస్తామన్నారు. విడతల వారీగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.42 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీని జర్నలిస్టుల సంక్షేమం కోసం అకాడమీ ఖర్చు పెడుతుందని, జర్నలిస్టుల సంక్షేమానికి ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై వచ్చిన వడ్డీ ఆధారంగా ఇప్పటివరకు రూ.22 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 597 మందికి రూ.1 లక్షతోపాటు అయిదు సంవత్సరాల వరకు, నెలకు రూ.3 వేల పెన్షన్, వారి పిల్లలకు ట్యూషన్ ఫీజుల కింద 1 నుండి 10వ తరగతి వరకు చదివే పిల్లలకు నెలకు 1,000లను గరిష్టంగా ఇద్దరికి అందిస్తామన్నారు. ఇప్పటి వరకు ఈ ఖాతాలో మొత్తం రూ. 8,98,39,000లు ఆర్థిక సహాయం అందించామన్నారు.

ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురామరెడ్డి మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టు వృత్తి అత్యంత కీలకమైనదని తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు అంది స్తున్నారని, గడిచిన రెండు రోజులుగా రెండు దేశాల మధ్య ఏం జరుగుతుందో అన్న ఆతృతతో ఎదురుచూస్తున్న ప్రజలకు తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు చేర వేస్తున్నారన్నారు. ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన జర్న లిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, జర్నలిస్టుల సంక్షేమానికి నిధులను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



శుక్రవారం నాంపల్లిలోని ప్రెస్ అకాడమీ కార్యాలయంలో చెక్కులు అందజేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

## 17 నెలల పాలనలో రూ.17లు విడుదల చేయలేదు!

### ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుంటే తీవ్రపరిణామాలుముఖ్యమంత్రికి లేఖ రాసిన ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** ఫీజుల బకాయిలు చెల్లించక పోవడంతో రాష్ట్రంలోని అన్నీ డిగ్రీ కాలేజీల వార్షిక పరీక్షలు కాలేజీ యాజమాన్యాలు బహిష్కరిస్తున్నా ముఖ్యమంత్రి అసలు పట్టించు కోవడంలేదు.దీంతో విద్యార్థులు ఒక విలువైన సంవత్సరాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు,రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన రాసిన లేఖను మీడియాకు విడుదల చేస్తూ..డిగ్రీ కళాశాలలకు సుమారు రూ.800 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో 6 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచడంలో పడింది. కొత్త ప్రభుత్వం వచ్చిన 17 నెలల్లో ఫీజు రియింటర్స్‌మెంట్ కింద 17 రూపాయలు కూడా విడుదల చేయలేదని విమర్శించారు. డిగ్రీ పరీక్షలు నిర్వహించాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని వేడుకునే దుస్థితి రావడం అన్యాయం.'ప్రస్తుతం అనీ మ్షన్లను నిలిపివేయగా, కొన్నిచోట్ల కళాశాలలకు తాళం వేసి ఇప్పటికి సెలవులు ప్రకటించారు. పరీక్షలు బహిష్కరిస్తున్నారు. పరీక్షలు బహిష్కరించడం కాలేజీ మూసివేయడం విద్యాశాఖ చరిత్రలో ఇదే మొదటిసారి. ఇది ఒక రకంగా ప్రభుత్వం ఫెయిల్ అయినట్టు లెక్క. ఇంత జరుగుతుంటే తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం సరైందికాదు' అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కాలేజీ యాజమాన్యాలు ఫీజులు కట్టాలని విద్యార్థులపై వత్తిడి తెస్తున్నారన్నారు.



## ఆర్‌టిఐ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా జి.చంద్రశేఖర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 9:** రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషన్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా డా. జి చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. రాజ్‌భవన్ దర్బార్‌హాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జి.చంద్రశేఖర్ రెడ్డిచే రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ శర్మ పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణ రావు, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, రాష్ట్ర రైతు కమీషన్ చైర్మన్ కోదండ రెడ్డి. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు, డీజీపీ జితేందర్, రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుమిదిని, విజిలెన్స్ కమీషనర్ ఎంజి గోపాల్, సీఎంఓ అధికారులు శేషాద్రి, శ్రీనివాస రాజు, మాణిక్ రాజ్, శ్రీనివాసులు, రాజ్ భవన్ కార్యదర్శి దాన కిషోర్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మహేష్ దత్ ఎక్కా, సీనియర్ ఐఏఎస్ అధికారులు రఘునందన్ రావు, బుద్ద ప్రకాష్, వినయ్‌కృష్ణారెడ్డి, అడిషనల్ డిజి మహేష్ భగవత్ తదితరులు హాజరయ్యారు. డా. చంద్రశేఖర్‌రెడ్డి ఈ పదవిలో మూడు సంవత్సరాలపాటు లేదా 65 యేళ్ల వరకు ఉంటారు.

# క్లైమాక్స్‌కు ఐపిఎల్ లీగ్

## ప్రతీ మ్యాచ్ నిర్ణాయకమే
## వీటికి ప్లేఆఫ్స్ బెర్త్ కన్ఫమ్!



**న్యూఢిల్లీ:** ఉత్కంఠభరితంగా సాగుతోన్న ఐపిఎల్-2025, 18వ సీజన్ క్లైమాక్స్‌కు చేరింది. అయితే భారత్, పాక్ మధ్య ఉద్రిక్త వాతావరణం నేపధ్యంలో శుక్రవారం నుండి జరగాల్సిన అన్ని మ్యాచ్‌లు వాయిదా పడ్డాయి. అయితే ఇప్పటి వరకూ జరిగిన మ్యాచ్‌ల్లో జట్లు పరిస్థితిని చూస్తే గుజరాత్ టైటాన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్స్‌కు అగ్రస్థానాల్లో ఉన్నాయి. డిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ చివరి అవకాశాలను ఆశిస్తున్నాయి. ఇప్పటికే చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ పోటీ నుండి నిష్క్రమించాయి. ఇక ప్రతి మ్యాచ్ ఫలితం ఇప్పుడు కీలకం కాగా, నెట్ రన్ రేట్ కీలక పాత్ర పోషించనుంది. ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించేందుకు జట్లు తమ మిగిలిన మ్యాచ్‌లలో గెలవాల్సిన అవసరం ఉంది. ప్రతి మ్యాచ్ ఇప్పుడు నిర్ణాయకంగా మారింది. ప్రస్తుతం 1వ స్థానంలో ఉన్న గుజరాత్ ప్లేఆఫ్స్ 98.2 అర్హత శాతంగా ఉంది.

ఇక టాప్ 2 ఫినిష్‌కు సంబంధించి 73.6గా ఉంది. మిగిలిన మ్యాచ్‌లను ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఈ నెల 11, లక్నో సూపర్ జెయింట్స్‌తో 14న, చెన్నై సూపర్ కింగ్స్‌తో 18న ఆడనుంది. కాగా ఈ మ్యాచుల్లో 1 విజయం సాధిస్తే ప్లేఆఫ్స్‌కు సరిపోతుంది. 2 విజయాలు టాప్ 2 ఫినిష్ చేయవచ్చు. అలాగే 2వ స్థానంలో ఉన్న బెంగళూరు ప్లేఆఫ్స్ అర్హత శాతం 99.1గా ఉంది. టాప్ 2 ఫినిష్ 69.0గా ఉంది. మిగిలిన మ్యాచ్‌లను లక్నోతో ఈ నెల 9న హైదరాబాద్‌తో 13న, కోల్‌కతాతో 17న ఆడనుంది. ఈ మ్యాచ్‌ల్లో 1 విజయం సాధిస్తే ప్లేఆఫ్స్‌కు ఖచ్చితంగా వెళ్తుంది. 2 విజయాలు ఉంటే టాప్ 2 ఫినిష్‌ను దాదాపుగా నిర్ధారిస్తాయి. 3వ స్థానంలో ఉన్న పంజాబ్ ప్లేఆఫ్స్ అర్హత శాతం 88.0గాఉంది. టాప్ 2 ఫినిష్‌కు అయితే 37.6గా ఉంది. మిగిలిన మ్యాచ్‌లను ముంబైతో 11న, రాజస్థాన్‌తో 16న ఆడనుంది. పంజాబ్ 2 విజయాలు సాధిస్తే ప్లేఆఫ్స్‌కు ఖచ్చితంగా వెళుతుంది. 1 విజయం బలమైన నెట్ రన్ రేట్ ఉంటే టాప్ 2 ఫినిష్‌కు సహాయపడుతుంది. 4వ స్థానంలో ఉన్న ముంబై ప్లేఆఫ్స్ అర్హత శాతం 69.9 ఉంది. ఇక టాప్ 2 ఫినిష్ అయితే 13.3గా ఉంది. మిగిలిన మ్యాచ్‌లను పంజాబ్‌తో 11న, డిల్లీతో 15న ఆడనుంది. వీటిలో 2 విజయాలు సాధిస్తే ప్లేఆఫ్స్‌కు దాదాపుగా వెళ్తుంది, టాప్ 2 ఫినిష్‌కు రెండు విజయాలు అవసరం. ఇక 5వ స్థానంలో ఉన్న ఢిల్లీ ప్లేఆఫ్స్ అర్హత శాతం 42.6గా ఉంది. ఇక టాప్ 2 ఫినిష్‌కు వస్తే 5.2 ఉంది. మిగిలిన మ్యాచ్‌ల్లో పంజాబ్‌తో 8న జరగాల్సిన మ్యాచ్ రద్దు కాగా, గుజరాత్‌తో 11న, ముంబైతో 15న ఆడనుంది. 3 విజయాలు ప్లేఆఫ్స్ ఆశలను నిలుపుతాయి. 6వ స్థానంలో ఉన్న కోల్‌కత్తా ప్లేఆఫ్స్ అర్హత శాతం 1.2గా ఉండగా, టాప్ 2 ఫినిష్ కష్టమే. మిగిలిన హైదరాబాద్, బెంగళూరుతో ఆడాల్సి ఉంది. వీటిలో రెండు మ్యాచ్‌లలో విజయం సాధించింది, ఇతర జట్ల ఫలితాలు అనుకూలంగా ఉండాలి అప్పుడే ప్లే ఆఫ్స్‌కి అర్హతసాధించే అవకాశముంది. 7వ స్థానంలో ఉన్న లక్నో ప్లేఆఫ్స్ అర్హత శాతం 0.7గా, టాప్ 2 ఫినిష్ 0.0గా ఉంది. మిగిలిన బెంగళూరు, గుజరాత్, హైదరాబాద్‌లతో ఆడ నుండగా, ఈ అన్ని మ్యాచ్‌లలో విజయం సాధించాల్సి ఉంటుంది.



## ఇటాలియన్ ఓపెన్‌లో
## మూడో రౌండ్‌కు ఒసాకా, జబీర్

**న్యూఢిల్లీ:** ఇటాలియన్ ఓపెన్-2025లో బడోసా, క్విటోవా నిష్క్రమించడంతో ఒసాకా మరియు జబీర్ మూడో రౌండ్‌కు చేరుకున్నారు. తొమ్మిదో సీడ్ పౌలా బడోసా, రెండుసార్లు వింబుల్డన్ ఛాంపియన్ పెట్రా క్విటోవా గాయాల కారణంగా వైదొలగడంతో నవోమి ఒసాకా, ఓన్స్ జబీర్‌లు రోమ్‌లో జరిగిన ఇటాలియన్ ఓపెన్ మూడో రౌండ్‌కు చేరుకున్నారు. 27 ఏళ్ల బడోసా వెన్నునొప్పి కారణంగా వైదొలిగిన తర్వాత జపాన్‌కు చెందిన ఒసాకా స్విస్ లక్కీ లూజర్ విక్టోరిజా గొలుబిక్‌ను 6-2, 6-3 తేడాతో ఓడించింది. ప్రపంచ నంబర్ 2 క్రీడాకారిణి లేకపోవడం ఫ్రెంచ్ ఓపెన్‌కు ముందు ఆమె ఫిట్‌నెస్‌పై మరిన్ని సందేహాలను లేవనెత్తింది. అదేవిధంగా కాలు సమస్య కారణంగా క్విటోవా వైదొలగాల్సి వచ్చింది, కాబట్టి మూడుసార్లు గ్రాండ్ స్లామ్ ఫైనలిస్ట్ జబీర్ వాక్ ఓవర్ ద్వారా ముందుకు సాగాడు. దీంతో తదుపరి ఆరో సీడ్, ఇటాలియన్ జాస్మిన్ పావోలిని లేదా క్వాలిఫైయర్ లులుసన్‌తో తలపడతాడు. 35 ఏళ్ల క్విటోవా, మొదటి రౌండ్‌లో ఇరినాకామెలియా బేగ్‌ను ఓడించడం ద్వారా ప్రసూతి సెలవు నుండి తిరిగి వచ్చిన తర్వాత తన తొలి విజయాన్ని సాధించింది.

## ఖేలో ఇండియాలో తెలంగాణ జోరు
### రెండు స్వర్ణాలు, రెండు కాంస్యాలు



**న్యూఢిల్లీ:** ఖేలోఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ ప్లేయర్ల పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. బీహార్‌లోని గయా వేదికగా జరుగుతున్న వేర్వేరు ఈవెంట్లలో రెండు స్వర్ణాలు సహా రెండు కాంస్యాలు దక్కించుకుంది. పురుషుల 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లే ఈవెంట్‌లో సుహాస్ ప్రీతమ్ 2:11:00 సెకన్ల టైమింగ్‌తో పసిడి దక్కించుకున్నాడు. అదే దూకుడు కొనసాగిస్తూ 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లోనూ సుహాస్ 2:10:56 సెకన్లతో కాంస్యం ఖాతాలో వేసుకున్నాడు. మహిళల 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో శ్రీనిత్య 2:24:44 సెకన్లతో స్వర్ణం సొంతం చేసుకుంది. మరోవైపు సైక్లింగ్ క్రైరిన్ ఈవెంట్‌లో యువ సైక్లిస్ట్ తనీశ్ కుమార్ కాంస్యం దక్కించుకున్నాడు. కాగా ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల ఐదవ రోజున బీహార్, జమ్మూ మరియు కాశ్మీర్ ఖేలో ఇండియా యూత్‌గేమ్స్ 2025 బీహార్‌లో తమ మొదటి బంగారు పతకాన్ని గెలుచుకు న్నాయి. సెపక్ తక్రా క్వాడ్ టీమ్ బాలుర ఫైనల్‌లో ఆతిథ్య రాష్ట్రం మణిపూర్‌పై విజయం సాధించగా, జమ్మూ మరియు కాశ్మీర్ బాలుర వాలీబాల్ టైటిల్‌ను గెలుచుకుంది. అలాగే బాలికల క్వాడ్ జట్టు మణిపూర్ చేతిలో వరుస గేమ్‌లలో ఓటమి చెందింది, కానీ హర్షిత్‌కుమార్, పార్థసారథి, తన్మయ్ రాజ్, అంకిత్ కుమార్, సిద్ధాంత్ కుమార్ మరియు అన్షు కుమార్‌లతో కూడిన బాలుర కలయిక 17-15, 15-11 తేడాతో వరుస గేమ్‌లలో విజయం సాధించడానికి ఎక్కువ సమయం పట్టలేదు. జమ్మూ కాశ్మీర్ బాలుర వాలీబాల్ జట్టు 35-33, 19-25, 25-17, 25-21తేడాతో సుదీర్ఘ పోరాటంలో విజయంసాధించింది. తొలి మ్యాచ్‌లో ఓటమి పాలైన తమిళనాడు పశ్చిమ బెంగాల్‌ను 31తేడాతో ఓడించిబాలికల కిరీటాన్ని కైవసం చేసుకుంది.





## బిడబ్ల్యూఎఫ్ సెమీఫైనల్‌కు ఉన్నతి
### కెనడాతో తలపడనున్న ఆయుష్

**న్యూఢిల్లీ:** బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బిడబ్ల్యూఎఫ్) వరల్డ్ టూర్ సూపర్ 300 ఈవెంట్‌లో భారత్ యువ క్రీడాకారిణి ఉన్నతి హుడా సెమీఫైనల్‌కు చేరుకుంది. శుక్రవారం జరిగిన ఈ పోటీలో ఉన్నతి చైనీస్ తైపీకి చెందిన హంగ్ యిటింగ్‌ను ఓడించింది. గత సంవత్సరం సయ్యద్ మోడీ ఇండియా ఇంటర్నేషనల్ సెమీ ఫైనల్లో పివి సింధు చేతిలో ఆమె ఓడిపోయింది. ఉన్నతి తదుపరి ఫైనల్‌లో స్థానంకోసం జపాన్‌కుచెందిన టాప్‌సీడ్‌మరియు ప్రపంచ8వ ర్యాంకర్ టోమోకా మియాజాకితో తలపడనుంది. 2023 ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత అయిన 20 ఏళ్ల ఆయుష్, సీనియర్ కిదాంబి శ్రీకాంత్‌ను 21-16, 15-21, 21-17 తేడాతో తీవ్రంగా పోరాడిన రెండవ రౌండ్ పోరులో ఓడించాడు. తదుపరి పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో ఆయుష్ శెట్టి ఏడో సీడ్ కెనడా ఆటగాడు బ్రియాన్ యాంగ్‌తో తలపడతాడు.

## ఆర్చరీలో భారత్‌కు చేజారిన కాంస్యం
### రికర్వ్‌లో పురుషుల జట్టుకు నిరాశ



**న్యూఢిల్లీ:** ప్రపంచ కప్ ఆర్చరీ స్టేజ్-2 టోర్నమెంట్‌లో భారత్ రికర్వ్ పురుషుల, మహిళల జట్టు పతకం సాధించడంలో వైఫల్యం చెందారు. బొమ్మదేవర ధీరజ్, అతానుదాస్, తరుణ్‌దీప్ రాయ్ లతో కూడిన భారత్ పురుషుల జట్టు తృటిలో కాంస్య పతకాన్ని చేజార్చుకుంది. దీపికకుమారి, అంకిత, అన్షిక కుమారిలతో కూడిన భారత్ మహిళల జట్టు మాత్రం రెండో రౌండ్‌లోనే వెనుదిరిగింది. కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత్ ప్లేయర్లు మధుర, రిషబ్ యాదవ్ సెమీ ఫైనల్‌కు చేరుకుని పతకాల వేటలో నిలిచారు. అమెరికా జట్టుతో కాంస్య పతక మ్యాచ్‌లో భారత్ పురుషుల జట్టు 3-5 సెట్ పాయింట్లతోఓడింది. తొలిసెట్‌ను అమెరికా 57-56తో నెగ్గి 2 పాయింట్లు సాధించింది. రెండో సెట్ 56-52తో అమెరికా ఖాతాలోనే వెళ్లడంతో ఆధిక్యం 4-0కు పెరిగింది. మూడో సెట్‌ను భారత్ 55-54తో గెలిచి 2 పాయింట్లు సంపాదించింది. నాలుగో సెట్‌లో రెండు జట్లు 56-56తో సమంగా నిలిచాయి. దాంతో రెండు జట్లకు ఒక్కో పాయింట్ దక్కింది. దీంతో ఓవరాల్‌గా అమెరికా 5-3తో విజయాన్ని ఖరారు చేసుకుని కాంస్యం దక్కించుకుంది. అంతకు ముందు భారత్ జట్టు 5-4తో (53-51, 55-58, 55-56, 54-53, 29-27) కజకిస్తాన్‌పై గెలిచింది. నాలుగు సెట్ల తర్వాత రెండు జట్లు 4-4తో సమంగా నిలిచాయి. దీంతో షూట్ ఆఫ్ నిర్వహించగా, భారత్ పై చేయి సాధించింది. క్వార్టర్ ఫైనల్లో భారత్ 6-0తో (58-56, 57-56, 55-53)తో ఇటలీపై నెగ్గింది. అయితే సెమీ ఫైనల్లో టీమిండియా 4-5తో (51-54, 50-56, 56-55, 55-53, 25-26) షూట్ ఆఫ్‌లో ఫ్రాన్స్ చేతిలో ఓడిపోయింది. ఇక తొలి రౌండ్‌లో బై పొంది నేరుగా రెండో రౌండ్ మ్యాచ్ ఆడిన భారత్ మహిళల జట్టు 4-5 (49-50, 52-54, 52-45, 55-48, 26-27)తో షూట్ ఆఫ్‌లో మెక్సికో చేతిలో పరాజయం చెందింది.

# డిఫెన్స్ స్టాక్స్ పరుగులు

**ముంబై, మే 9:** ఉగ్రవాదులను ఏరిపారేయడమే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను జీర్ణించుకోలేని పాకిస్థాన్ దుస్సాహసానికి ఒడిగడు తోంది. రెచ్చగొట్టే ధోరణిని ప్రదర్శిస్తోంది. జమ్మూ విమానాశ్రయంతోపాటు సరిహద్దుల్లోని పలు సైనిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని గురువారం దాడులకు యత్నించింది. ఈ ప్రయత్నాలను భారత్ సమర్థంగా తిప్పి కొట్టింది. 8 డ్రోన్లను, 3 ఫైటర్ జెట్లను కూల్చేసింది. ఈక్రమంలో రెండు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈనేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లో డిఫెన్స్ సంబంధిత స్టాక్స్ రాణిస్తున్నాయి. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ 9.73 శాతం, పరాస్ డిఫెన్స్ అండ్ స్పేస్ టెక్నాలజీస్ లిమిటెడ్ 5.89 శాతం, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ 4.88 శాతం, గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ లిమిటెడ్ 3.63 శాతం, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ 3.60 శాతం చొప్పున బీఎస్‌ఈలో రాణిస్తున్నాయి. డ్రోన్ల తయారీ సంస్థ ఐడియా ఫోర్జ్ టెక్నాలజీ లిమిటెడ్ ఏకంగా 18 శాతం మేర లాభాల్లో కొనసాగుతోంది. డ్రోనాచార్య ఏరియల్ ఇన్నోవేషన్స్ లిమిటెడ్ 4.99 శాతం లాభాల్లో కొనసాగుతోంది. మరోవైపు మన స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంట్రాడేలో బీఎస్‌ఈ సెన్సెక్స్ 800 పాయింట్లు, నిఫ్టీ 250కి పైగా పాయింట్ల నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్టీపీసీ, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నష్టాల్లో ట్రేడవుతుండగా, టైటాన్, ఎల్‌అండ్‌టీ, టాటా మోటార్స్, ఎస్‌బీఐ షేర్లు మాత్రమే లాభాల్లో కొనసాగు



## సరిహద్దు రాష్ట్రాల్లోనే భారీగా బ్యాంకు డిపాజిట్లు

**న్యూఢిల్లీ, మే 8:** భారత్-పాకిస్థాన్‌ల మధ్య యుద్ధ పరిస్థితులు ఎప్పటికప్పుడు వేగంగా మారిపోతున్నాయి. పాకిస్తాన్‌పై ఓవైపు మెరుపుదాడులతో విరుచుకుపడుతూనే మరోవైపు సరిహద్దు వెంబడి ఆ దేశం చేస్తున్న దాడులను భారత్ సైనిక దళాలు తిప్పికొడుతున్నాయి. ఈ నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల్లోనే గణనీయమైన డిపాజిటర్ బేస్ ఉండడంతో బ్యాంకింగ్ రంగం ఇక్కడ జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తుంది. జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో అత్యధిక బ్యాంకు డిపాజిట్లు ఉన్నాయి. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా తాజా గణాంకాల ప్రకారం, భారతదేశ మొత్తం బ్యాంకు డిపాజిట్లలో 12.81 శాతం అంటే రూ.26.21 లక్షల కోట్లు ఆ అయిదు రాష్ట్రాల నుంచే ఉన్నాయి. ఇక అప్పుల విషయానికివస్తే, మొత్తం అడ్వాన్సులలో 13.41 శాతం అంటే రూ.22.13 లక్షల కోట్లు ఆయా రాష్ట్రాల్లో ఉన్నాయి. జమ్ముకశ్మీర్‌లో ఘర్షణకు కేంద్ర బిందువైన కేంద్ర పాలిత ప్రాంతం జమ్ముకశ్మీర్ అస్థిర నియంత్రణ రేఖతో సహా పాకిస్థాన్‌తో 3,323 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటోంది. జమ్ముకశ్మీర్ బ్యాంకుల్లో రూ.1.49 లక్షల కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. ఇవి దేశ డిపాజిట్లలో 0.73 శాతం. అడ్వాన్సులు రూ.73,879కోట్లు. మొత్తంఅడ్వాన్స్‌లలో 0.45శాతం. భారత్‌లో మరో ముఖ్యమైన సరిహద్దు రాష్ట్రం పంజాబ్. ఇది పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌తో 547 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటోంది. దేశంలోని మొత్తం డిపాజిట్లలో 3శాతం అంటే రూ.6.14 లక్షల కోట్లకుపైగా ఈ రాష్ట్రం నుంచి ఉన్నాయి. ఇక రూ.5.35 లక్షల కోట్ల మేర రుణాలను ఇక్కడి బ్యాంకులు వితరణ చేశాయి. పాకిస్థాన్‌లోని సింధ్, పంజాబ్ ప్రావిన్సుల వెంబడి 1,035 కిలోమీటర్ల ఎడారి సరిహద్దు కలిగిన రాజస్థాన్‌లో రూ.6.98 లక్షల కోట్లకు పైగా డిపాజిట్లు, రూ.6.25 లక్షల కోట్లు అడ్వాన్సులు ఉన్నాయి.



## ఇంధన కొరతపై ఇండియన్ ఆయిల్ స్పష్టత

**ముంబై, మే 9:** పాకిస్థాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతల వేళ ఆన్‌లైన్ వేదికగా పలు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. యుద్ధ వాతావరణం నేపథ్యంలో దేశవ్యాప్తంగా చమురు నిల్వల్లో కొరత ఏర్పడినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రజలు త్వరితగతిన ఇంధనాన్ని కొనుగోలు చేయాలని పలువురు భావిస్తున్నారు. ఆయా ప్రచారాలపై ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ స్పష్టతనిచ్చింది. ఇంధన నిల్వల విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది. తమవద్ద తగినంత నిల్వలు ఉన్నట్లు ప్రకటించింది. దేశవ్యాప్తంగా తగినంత ఇంధన నిల్వలు కలిగిఉన్నాం. మా సరఫరా లైన్లు సజావుగా పని చేస్తున్నాయి. భయపడాల్సిన అవసరం లేదు. ఇంధనం, ఎల్‌పీజీ మా అన్ని అవుట్‌లెట్‌లలో అందుబాటులో ఉన్నాయి. ప్రశాంతంగా ఉండి, అనవసరమైన రద్దీని నివారించి మెరుగైన సేవలు అందించడంలో మాకు సహాయపడండి. మా సరఫరా లైన్లు సజావుగా నడుపుతుంటాం అని పేర్కొంది.




# వాణిజ్యం

## స్టాక్ మార్కెట్లకు 'సింధూర్' షాక్

**ముంబై, మే 9:** భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు దేశీయ స్టాక్ మార్కెట్‌పై ప్రభావం చూపాయి. సరిహద్దు రాష్ట్రాలపై పాక్ దాడులకు యత్నించడంతో భారత్ వాటిని సమర్థంగా తిప్పికొట్టింది. ఇవి మరింత తారస్థాయికి చేరొచ్చన్న భయాలతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నేడు క్షీణించాయి. దాదాపు అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొ న్నాయి. దీంతో వరుసగా రెండో రోజూ మన సూచీలు నష్టపోయాయి. సెన్సెక్స్ 800 పాయింట్లకు పైగా నష్టపోయి మళ్లీ 80వేల దిగువకు చేరగా, నిఫ్టీ 24వేల కాస్త ఎగువన ముగిసింది. భారత్-పాక్ నడుమ ఉద్రిక్తతల వేళ విమానయానం, టూరిజం, రియాల్టీ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అదే సమయంలో డిఫెన్స్ సంబంధిత స్టాక్స్‌లో కొనుగోళ్ల ఉత్సాహం కనిపించింది. డ్రోన్ల తయారీ కంపెనీ ఐడియా ఫోర్జ్ షేర్లు ఏకంగా 18 శాతం మేర పెరిగాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ ఫ్లాట్‌గా ముగియగా, స్మాల్‌క్యాప్ సూచీ 0.61 శాతం మేర నష్టోయింది. మార్కెట్ ఒడుదొడుకులను సూచించే ఇండియా విక్స్ 2.98 శాతం పెరిగి 21.63కు చేరింది. ఇంట్రాడేలో 8 శాతం వరకు పెరిగింది. సెన్సెక్స్ ఉదయం 78,968.34 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై రోజంతా నష్టాల్లోనే చలించింది. ఇంట్రాడేలో 78,968.34 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచి చివరికి 880.34 పాయింట్ల నష్టంతో 79,454.47 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 265 పాయింట్ల నష్టంతో 24,008.00 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 17 పైసలు బలపడి 85.41 రూపాయలుగా ఉంది. ఐసీఐసీఐ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. టైటాన్, టాటా మోటార్స్, ఎల్‌అండ్‌టీ, ఎస్‌బీఐ, ఏషియన్ పెయింట్స్ షేర్లు రాణించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 63 డాలర్ల వద్ద కొనసాగగా.. బంగారం 3,329 డాలర్ల వద్ద ట్రేడయింది.



## ఓయో లాభం రూ.623 కోట్లు

**ముంబై, మే 9:** హాస్పిటాలిటీ రంగ దిగ్గజం ఓయో 202425 ఆర్థిక సంవత్సరంలో రూ.623 కోట్ల లాభాన్ని అందుకుంది. దింతో ఓయో లాభాల పరంగా టాప్ భారతీయ స్టార్టప్‌గా అవతరించింది. ఓయో వ్యవస్థాపకుడు రితేష్ అగర్వాల్ గురువారం స్వయంగా ఉద్యోగులకు ఈ విషయాన్ని తెలియజేశారు. అయితే ఓయో ఐపీఓ ప్రారంభం ఆలస్యం అవ్వొచ్చు అని భావిస్తున్న సమయంలో ఈ వార్త వెలువడింది. ఒక్కో షేరుకు ఓయో ఆదాయం ఓయో ఆర్థిక సంవత్సరం 2025లో రూ.1132 కోట్ల ఎబిటాను సాధించింది, గత సంవత్సరం ఇదే కాలంలో చూస్తే రూ.889 కోట్లుగా ఉంది. అంతేకాక గత సంవత్సరంతో పోలిస్తే 27 శాతం పెరుగుదలను సూచిస్తుంది. ఓయో షేరు ఆదాయం (ఇపిఎస్) 2025లో రూ.0.93కి చేరుకుంటుందని అంచనా, అయితే 2024లో ఈ అంచనా రూ.0.36గా ఉంది. ఇంకా ఈసారి 158 శాతం పెరుగుదలను చూపుతుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఓయో గ్రాస్ బుకింగ్ వాల్యూ (జిబివి)లో 54 శాతం వృద్ధిని నమోదు చేసింది. అంటే రూ.16,436 కోట్లకు పెరిగింది. దీని రెవెన్యూ రూ.6,463 కోట్లకు పెరిగి, గత సంవత్సరంతో పోలిస్తే 20 శాతం వృద్ధిని నమోదు చేసింది. 2024 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 2025 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ఓయో బిటీజు 126 శాతం పెరిగి రూ.6,379 కోట్లకు చేరుకుంది. నాల్గవ త్రైమాసికంలో ఆదాయం గత సంవత్సరం కంటే 41 శాతం పెరిగి రూ.1,872 కోట్లుగా ఉంది. గత 12 నెలల్లో భారతదేశం, సౌదీ అరేబియా, యుఎఇ ఇంకా సౌత్ ఈస్ట్ ఆసియా సహా వివిధ ప్రాంతాలలో 30కి పైగా సండే హోటళ్లను ప్రారంభించడం ద్వారా కంపెనీ ప్రీమియం ఆఫరింగ్ పెంచింది. ఓయోకి ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం దాదాపు 22,700 హోటళ్ళు ఇంకా 1,19,900 ఇల్లులు ఉన్నాయి. తాజాగా ఓయో హోటల్స్ అక్టోబర్‌లో ఐపిఒకి లిస్ట్ కావాలనే ప్లాన్ వాయిదా వేసినట్లు తెలిపింది. రితేష్ అగర్వాల్ నేతృత్వంలోని కంపెనీ ఈ ఏడాది చివర్లో ఐపిఒను ప్రారంభించాలని యోచిస్తోంది. అయితే ఇన్వెస్టర్ సాఫ్ట్ బ్యాంక్ ఈ ప్లాన్‌తో విభేదించింది. ఆదాయం పెరిగే వరకు ఐపిఒను ఆలస్యం చేయాలని సాఫ్ట్‌బ్యాంక్ ఓయోను కోరింది. ఓయోలో జపాన్ పెట్టుబడి సంస్థకు 40 వాటా ఉండగా, వ్యవస్థాపకుడు అగర్వాల్‌కు 30 వాటా ఉంది. ఈ అద్భుతమైన పర్ఫార్మెన్స్‌తో ఓయో లాభాలను ఆర్జించడమే కాకుండా సరైన ప్లాన్ ఇంకా ఆవిష్కరణలతో ప్రయాణ రంగంలో కూడా పెద్ద ఎత్తున లాభాలను సాధించవచ్చని భారతీయ స్టార్టప్ ఏకోసిస్టంలో ఒక బలమైన ఉదాహరణగా నిలిచింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.